
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 309
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL
సోమవారం 22-7-2024


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



నిఫా వైరస్‌తో బాలుడు మృతి
కేరళలో నిఫా ఇన్ఫెక్షన్‌తో చికిత్స పొందుతున్న 14 ఏళ్ల బాలుడు ఆదివారం మరణించాడు.
వివరాలు 6లో ▸



బంగ్లాదేశ్‌లో కోటా కట్
ఆందోళనల నేపథ్యంలో 56% ఉన్న రిజర్వేషన్లను 7 శాతానికి తగ్గిస్తూ బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది.
వివరాలు 6లో ▸



బడ్జెట్ మెప్పిస్తుందా?
వరుసగా ఏడో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి నిర్మలవైపు అన్ని వర్గాలూ ఆశగా ఎదురుచూస్తున్నాయి.
వివరాలు 13లో ▸

అమెరికా అధ్యక్ష రేసు నుంచి
జో బైడెన్ ఔట్



పోటీ నుంచి వైదొలుగుతున్నానని ప్రకటన

డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా కమలా హ్యారిస్‌కు మద్దతు

అమెరికా అధ్యక్షుడిగా ప్రజలకు ఇప్పటిదాకా సేవలందించడం అతిగొప్ప గౌరవంగా భావిస్తున్నా. మరోసారి పోటీ చేయాలన్న ఆలోచన లేదు. దేశ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నా. అధ్యక్షుడిగా మిగిలిన పదవీకాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యతలపై దృష్టి పెడతా. - జో బైడెన్

6లో

ముంచిన డిబేట్ ఇప్పుడేంటి?

న్యూస్‌రీల్

ప్రపంచం గర్వించేలా గొప్ప ఆవిష్కరణలు



ప్రఖ్యాతిగాంచిన విద్యాసంస్థలో సాంకేతిక విద్య అభ్యసించిన ఐఐటీ విద్యార్థులు ప్రపంచం గర్వించే ఆవిష్కరణలతో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఇన్ఫోసిస్ కో ఫౌండర్ క్రిస్ గోపాలకృష్ణన్ సూచించారు. తిరుపతి ఐఐటీ 6వ స్నాతకోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. 338 మందికి పట్టాలు ప్రదానం చేశారు.
వివరాలు 12లో ▸

నేటి నుంచి ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్



రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ పరిధిలో ఉన్న నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు ఈ నెల 22 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ నేతృత్వంలో కౌన్సెలింగ్ జరగనుంది.
వివరాలు 14లో ▸

ముగిసిన గిరి ప్రదక్షిణ




విశాఖలో శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణ ఉత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ ఏడాది 9 లక్షల మంది గిరి ప్రదక్షిణ చేసినట్లు సింహాచలం ఆలయ వర్గాల అంచనా.
వివరాలు 5లో ▸



ఎదురులేని భారత్
ఆసియా కప్ టి20 టోర్నీలో యూఏఈపై 78 పరుగులతో విజయం
12లో

ఇదండీ సంగతి



అసలు ముందు నువ్ గిట్టితే మా ప్రాణాలు పోయేవి కావు కదా!

'రెడ్‌బుక్'తో అరాచకం

అదే రాజ్యాంగం అనే రీతిలో రాష్ట్రంలో పాలన

అధఃపాతాళానికి దిగజారిన శాంతి భద్రతలు

గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఫిర్యాదు

- హోర్డింగులు పెట్టి మరీ ప్రోత్సహిస్తున్న రాష్ట్ర మంత్రి
- ఎంపీల నుంచి సామాన్యుల వరకు రక్షణలేని దుస్థితి
- నెల రోజుల్లోనే 36 హత్యలు.. 300కుపైగా హత్యాయత్నాలు
- యథేచ్ఛగా దాడులు.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల విధ్వంసం
- వైఎస్సార్‌సీపీని అణచివేసే కుట్రతోనే బీభత్సకాండ
- రాజ్యాంగ వ్యవస్థలు, పోలీసు యంత్రాంగం నిర్వీర్యం
- కేంద్రం వెంటనే జోక్యం చేసుకుని దర్యాప్తు జరిపించాలని విజ్ఞప్తి

2లో



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిసేందుకు రాజ్‌భవన్‌కు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

"రాష్ట్రంలో నెలన్నర రోజులుగా డిఫ్యాక్టో రాజ్యాంగం.. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. కూటమి ప్రభుత్వ అండదండలతో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసకాండ యథేచ్ఛగా కొనసాగుతోంది. రాజకీయ గూండాలు, మహిళలు-చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడే వారి చెప్పుచేతల్లోకి ప్రభుత్వ వ్యవస్థ వెళ్లిపోయింది. తమకు ఓటు వేయలేదన్న కారణంతో టీడీపీ గూండాలు ఊరూరా ఇష్టారాజ్యంగా కక్ష సాధింపు చర్యలతో విధ్వంసం సృష్టిస్తున్నారు. వేలాది కుటుంబాలు ఊళ్లొదిలాయి. వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ప్రజాప్రతినిధులు మొదలు సామాన్యుల వరకు రక్షణ లేకుండా పోయింది. కళ్లెదుటే ఫొటో, వీడియో ఆధారాలున్నా పోలీసు యంత్రాంగం అరాచకాన్ని నిలువరించే సాహసం చేయలేకపోతోంది.
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

రెడ్ బుక్ కాదది బ్లడ్ బుక్
- రక్తపుటేరులు పారిస్తున్న టీడీపీ శ్రేణులు
- హత్యలు, దాడులతో రాష్ట్రం అల్లకల్లోలం
- సినిమా ముందుంది అంటూ బెదిరింపు
- కనీసం శాంతి-భద్రతలను సమీక్షించని సీఎం చంద్రబాబు

10లో

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

ఉదయం 10 గంటలకు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం

- నాలుగు నెలలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- హామీల అమలు నుంచి తప్పించుకునేందుకు పూర్తి బడ్జెట్‌కు మంగళం
- హత్యా రాజకీయాలపై సర్కారును నిలదీయనున్న వైఎస్సార్‌సీపీ



సాక్షి, అమరావతి: ఏపీ అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు ఉభయ సభల సభ్యులనుద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ అధ్యక్షతన శాసన సభా వ్యవహారాల సలహా కమిటీ(బీఏసీ) సమావేశమై సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై అజెండాను ఖరారు చేయనుంది. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై అధికార పార్టీ నేతలు చేస్తున్న హత్యా రాజకీయాలు, దాడులు, దౌర్జన్యాలపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు నిలదీయనున్నారు. వినుకొండలో వైఎస్సార్‌సీపీ నేత రషీద్‌ను నడిరోడ్డుపై అత్యంత కిరాతకంగా నరికి చంపిన విషయాన్ని అసెంబ్లీలో ప్రధానంగా ప్రస్తావించాలని, ప్రభుత్వమే హత్యా రాజకీయాలను ప్రోత్సహించడంపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని నిలదీయనున్నారు. ఎన్నికల ముందు వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో అధికార పక్షం హామీలకు కేటాయింపుల చేయకుండా తప్పించుకునే ఎత్తుగడలో భాగంగా పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టకుండా నాలుగు నెలలకు ఓటాన్ అకౌంట్‌కు సభలో ఆమోదం పొందడం ద్వారా కాలయాపన చేయాలని నిర్ణయించింది.

కాలయాపన చేసే ఎత్తుగడ

ఎన్నికల ముందు కేంద్రం ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టి.. ఇప్పుడు ఈ నెల 23వ తేదీన పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతోంది. ఎన్నికల ఫలితాల అనంతరం అధికారం చేపట్టే ప్రభుత్వాలు పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెడతాయి. అయితే అందుకు భిన్నంగా చంద్రబాబు ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో సూపర్ సిక్స్ పథకాలకు కేటాయింపుల్లేకుండా కాలయాపన చేసే ఎత్తుగడకు పాల్పడుతోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వంపై

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రపతి పాలన విధించాల్సిందే

అఖిలపక్ష భేటీలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి డిమాండ్



- ఏపీలో దారుణంగా శాంతిభద్రతలు
- ఎంపీలకే రక్షణ లేని పరిస్థితి
- టీడీపీకి ఏ మాత్రం పాలించే అర్హత లేదు.. మాపై దాడి చేసి మాపైనే కేసులు పెడుతున్నారు

3లో

నేటి నుంచే కేంద్ర బడ్జెట్ సమావేశాలు
6లో

పోటెత్తుతున్న 'గోదావరి'

- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణతో పాటు గోదావరి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు
- పరవళ్లు తొక్కుతున్న శబరి, తాలిపేరు, ఇంద్రావతి, ప్రాణహిత
- దీంతో గోదావరిలో గంటగంటకూ పెరుగుతున్న వరద ప్రవాహం
- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- పోలవరం ప్రాజెక్టులోకి 8.60 లక్షల క్యూసెక్కులు.. 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల

14లో


ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

పునరావాసం ఊసే లేదు
సహాయక చర్యలు ఇంకా ప్రారంభించని ప్రభుత్వం
14లో

నీట్.. ర్యాంకుల షికార్

దేశంలోని పలు పరీక్ష కేంద్రాల్లో భిన్నమైన ఫలితాలు

- సికర్, నామకల్‌లోని కేంద్రాల్లో టాప్ స్కోర్
- రీటెస్ట్ ఫలితాలు ఆశ్చర్యకరం
- లోతుగా విశ్లేషించాల్సిన అవసరముంది



■ నీట్ యూజీ ఫలితాలపై వివాదం కొనసాగుతూనే ఉంది. మే 5న దేశవ్యాప్తంగా నిర్వహించగా పరీక్షలో అక్రమాలు జరిగాయంటూ అనేకమంది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గ్రేస్ మార్కుల వివాదం నేపథ్యంలో సుప్రీంకోర్టు.. నీట్ రీటెస్ట్‌కు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఆ రీటెస్ట్ ఫలితాలు మరింత ఆశ్చర్యానికి గురిచేశాయి.
- వివరాలు 2లో

క్లుప్తంగా...

'ఈఎంసీ'లో వేస్ట్‌వాటర్ కామన్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్ తయారీరంగాన్ని ప్రోత్సహించడానికి తిరుపతిలో అభివృద్ధి చేసిన ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌లో మురుగునీటి వ్యర్థాల శుద్ధికోసం కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను ఏపీఐఐసీ ఏర్పాటు చేస్తోంది. రూ.5.91 కోట్లతో ఏర్పాటు చేస్తున్న వేస్ట్ వాటర్ కామన్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానిస్తోంది. ఈ రంగంలో కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్న సంస్థలు ఈ బిడ్డింగ్‌లో పాల్గొనవచ్చు. ఈ నెల 31న మధ్యాహ్నం 3 గంటల్లోపు బిడ్లను దాఖలు చేయాలి. ఆగస్టు 5న రివర్స్ బిడ్డింగ్ ద్వారా కాంట్రాక్టరను ఎంపిక చేస్తామని, బిడ్ దక్కించుకున్న సంస్థ 9 నెలలల్లోగా ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొంది.

ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య టెక్నోస్కూల్ ప్రతిభ



విజయం సాధించిన శ్రీచైతన్య విద్యార్థులు

హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఎన్నో వేల మంది ప్రతిభ గల విద్యార్థులు పోటీపడే ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్-24లో భారత జట్టు అద్భుత ప్రతిభా పాటవాలు ప్రదర్శించి ప్రపంచవ్యాప్తంగా నాలుగోస్థానంలో నిలిచిందని శ్రీచైతన్య టెక్నో స్కూల్ వెల్లడించింది. భారత్‌కు చెందిన ఆరుగురు సభ్యుల విద్యార్థి బృందం నాలుగు బంగారు పతకాలు, ఒక రజత పతకంతో నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ఆరుగురు బృందంలో శ్రీచైతన్య టెక్నో స్కూల్ బావదాన్ పూణేకు చెందిన విద్యార్థి ఎం.వి.ఆదిత్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడని సంస్థ తెలిపింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని బాత్‌లో ఇటీవల ముగిసిన 65వ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ఈ అరుదైన గౌరవం దక్కింది. ఈ విజయం సాధించిన విద్యార్థి ఆదిత్యాని ప్రధాని మోదీ 'ఎక్స్'లో అభినందించారు. విద్యార్థులను శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్‌లు సుష్మ, సీమ అభినందించారు.

డిగ్రీలో ప్రవేశాలు మరింత ఆలస్యం

సాక్షి, అమరావతి: డిగ్రీలో ప్రవేశాలు మరింత ఆలస్యం అవుతున్నాయి. బీబీఏ, బీసీఏ కోర్సులకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి నుంచి అనుమతులు తప్పనిసరి కావడంతో ప్రవేశాలు ఆలస్యమవుతున్నట్లు ఉన్నత విద్యా మండలి అధికారులు తెలిపారు. ఈ నెల 25వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. 26 నుంచి 29 వరకు ఆప్షన్ల ఎంపిక, 30న ఆప్షన్ల మార్పు, వచ్చే నెల 3న సీట్ల కేటాయించి 5 నుంచి తరగతులు ప్రారంభించేలా ఉన్నత విద్యా మండలి ఏర్పాట్లు చేస్తోంది.

గురుపౌర్ణమి వేడుకల్లో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో సీఎం చంద్రబాబుపాల్గొన్నారు. రామదూతస్వామి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ గురువులు దేవుళ్లతో సమానమన్నారు.


నేటి నుంచి అసెంబ్లీ

▶ మొదటి పేజీ తరువాయి

ఆరోపణలకు, నిందలకు అసెంబ్లీని వేదికగా చేసుకోవడమే లక్ష్యంగా చంద్రబాబు శ్వేత పత్రాల విడుదల ఎత్తుగడకు దిగారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంపై అసెంబ్లీలో చర్చకు అవకాశం లేకుండా ఆర్థిక, ఎక్సైజ్, శాంతిభద్రతల పేరుతో శ్వేతపత్రాలు విడుదల చేసి అసెంబ్లీని ఆరోపణలకు వేదికగా ఉపయోగించుకోనున్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుకు అసెంబ్లీలో బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టే యోచనలో ఉంది. టీడీపీ ఎమ్మెల్యేలందరూ పసుపు రంగు దుస్తులు, సైకిల్ గుర్తు కండువాలతో అసెంబ్లీకి రావాలని పార్టీ సూచించింది. 5రోజుల పాటు సమావేశాలను నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఈ నెల 24 లేదా 25న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

నీట్.. ర్యాంకుల 'షికార్'

నీట్ యూజీ-2024 పరీక్ష ఫలితాలపై వివాదం కొనసాగుతూనే ఉంది. మే 5న దేశవ్యాప్తంగా పరీక్ష నిర్వహించగా.. 23 లక్షల మందికిపైగా హాజరయ్యారు. ఇందులో 13.16 లక్షల మంది నీట్‌లో అర్హత సాధించారు. గత నెలలో ఫలితాలు వెల్లడికాగా.. పరీక్షలో అక్రమాలు జరిగాయంటూ ఆందోళన వ్యక్తమైంది. అనేక మంది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు పరీక్ష నిర్వహణ సంస్థ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తాజాగా పట్టణాలు, పరీక్ష కేంద్రాల వారీగా ఫలితాలను వెల్లడించింది.



700+ స్కోర్‌తో ఆలిండియా కోటా సీటు..

నీట్‌లో 700+ మార్కులు స్కోర్ చేసిన 2,321 మంది విద్యార్థులకు ఆల్ ఇండియా కోటాలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో మెడికల్ సీటు లభిస్తుంది. అదేవిధంగా 650+ మార్కులు స్కోర్ చేసిన 30,204 మంది విద్యార్థులకు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రవేశం దక్కుతుంది. అలాగే 600+ మార్కులు స్కోర్ చేసిన 81,550 మంది విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలల్లో ఏదో ఒక చోట సీటు సొంతమయ్యే అవకాశముంది.

రీటెస్ట్ తర్వాత ఫలితం..


గ్రేస్ మార్కుల వివాదం నేపథ్యంలో సుప్రీంకోర్టు.. నీట్ రీటెస్ట్‌కు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ రీటెస్ట్ తర్వాత హరియాణాలోని ఒక పరీక్ష కేంద్రంలో ఆశ్చర్యకర ఫలితాలు వెల్లడయ్యాయి. హిస్సార్‌లోని హరదయాళ్ పబ్లిక్ స్కూల్ పరీక్ష కేంద్రంలో రీటెస్ట్‌కు ముందు వెల్లడించిన ఫలితాల్లో మొత్తం ఎనిమిది మంది విద్యార్థులకు 720, 719, 718 మార్కులు వచ్చాయి. రీటెస్ట్ ఫలితాలు వెల్లడయ్యాక ఈ పరీక్ష కేంద్రంలో గరిష్ట స్కోర్ 682 మాత్రమే. అంతేకాకుండా కేవలం ఇద్దరు విద్యార్థులకు మాత్రమే 650+ మార్కులు వచ్చాయి. 13 మంది విద్యార్థులు 600+ మార్కులు స్కోర్ చేశారు. దీన్నిబట్టే చూస్తే రీటెస్ట్‌కు ముందు ఈ సెంటర్‌లో వెల్లడయిన ఫలితం ఆశ్చర్యకరమని చెప్పొచ్చు.

సికర్ ఫలితం.. ఇంతే

➤ రాజస్థాన్‌లోని సికర్ పట్టణంలో మొత్తం 50 కేంద్రాల్లో నీట్ జరిగింది. ఈ పట్టణంలోని కేంద్రాల్లో మొత్తం 27,216 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. 149 మందికి 700+ స్కోర్ వచ్చింది. 650 + స్కోర్ చేసిన విద్యార్థుల సంఖ్య 2,037. అలాగే 4,297 మంది విద్యార్థులు 600 + స్కోర్ చేశారు. సికర్‌లో నీట్ రాసిన విద్యార్థుల సగటు మార్కులు 362.

➤ దేశవ్యాప్తంగా పరీక్ష రాసిన మొత్తం 23 లక్షల మందిలో 30,204 మంది విద్యార్థులు 650+ స్కోర్ చేశారు. వీరు కేవలం 1.3 శాతం మంది. కాని ఒక్క సికర్‌లోనే 2,037 మంది 650+ స్కోర్ చేశారు. ఇది 6.8 శాతం. అదేవిధంగా దేశవ్యాప్తంగా పరీక్ష రాసిన వారిలో 1.3 శాతం మందికి మాత్రమే ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు వచ్చే అవకాశం లభించగా.. సికర్‌లో పరీక్ష రాసిన వారిలో ఏకంగా 7.48 శాతం మందికి ప్రభుత్వ కళాశాలలో ప్రవేశం లభిస్తుంది. ➤ ఇక్కడే చాలా మందికి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం 50 పరీక్ష కేంద్రాలున్న ఒక్క పట్టణంలో ఇంత మందికి బెస్ట్ స్కోర్ ఎలా సాధ్యమనే ప్రశ్న చాలా మందికి ఎదురవుతోంది.


నీట్-2024 వివరాలివీ..



- కెరీర్స్360 ఫౌండర్ చైర్మన్ మహేశ్వర్ పెరి
www.360careers.com

■ కోచింగ్‌కు పేరుగాంచిన కోటా పట్టణంలోని పరీక్ష కేంద్రాల్లో హాజరైన విద్యార్థుల డేటాను విశ్లేషించినా.. సికర్‌లో పరీక్ష రాసిన విద్యార్థులు ఎంతో ముందున్నారని అర్థమవుతోంది. కోటాలో 27,118 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైతే..700+ స్కోర్ చేసింది 74 మంది(0.27శాతం) మాత్రమే. అదే సికర్‌లో ఆ సంఖ్య రెండింతలుగా ఉంది. 650+ స్కోర్ చేసిన విద్యార్థుల సంఖ్య 1,066(3.93 శాతం)గా ఉంది. అలాగే ఇక్కడ 2,599 విద్యార్థులు 600 + స్కోర్ చేశారు. 600+స్కోర్ చేసిన విద్యార్థులు కోటాలో 9.58 శాతం ఉండగా.. సికర్‌లో అది 16 శాతంగా ఉంది.

సికార్‌లో పరీక్ష రాసిన వారి వివరాలివీ..



ఒక్క కేంద్రంలోనే 12 మందికి 700+

➤ అహ్మదాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పరీక్ష కేంద్రంలో మొత్తం 676 మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాయగా.. ఏకంగా 12 మందికి 700 + స్కోర్ వచ్చింది.

➤ నామకల్‌లోని ద నవోదయా అకాడెమీ సీనియర్ సెకండరీ స్కూల్‌లో 659 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. 8 మందికి 700+ మార్కులు వచ్చాయి.

➤ సికర్‌లోని టాగోర్ పీజీ కాలేజీలో 356 మంది పరీక్ష రాయగా.. 5గురికి 700+ స్కోర్ వచ్చింది.

టాప్ 50లో 37 సికర్ నుంచే

➤ 650 మార్కుల కంటే ఎక్కువ స్కోర్ చేసిన టాప్ 50 పరీక్ష కేంద్రాల్లో 37 సికర్‌లోని పరీక్ష కేంద్రాలే. అలాగే దేశంలో బెస్ట్ ఫలితం వచ్చిన టాప్ 60 పరీక్ష కేంద్రాల్లో 43 సికర్ నుంచే ఉన్నాయి. టాప్ 50లో నామకల్‌లోని ఐదు పరీక్ష కేంద్రాలు, హర్యాన, హిస్సార్‌లోని జఝర్ వంటివి ఉన్నాయి.

➤ రాజ్‌కోట్‌లోని ఒక పరీక్ష కేంద్రంలో ఏకంగా 200 మంది విద్యార్థులకు 600 + మార్కులు వచ్చాయి.


రాజస్థాన్ బెస్ట్ ప్రదర్శన

➤ దేశ వ్యాప్తంగా నీట్ యూజీలో ఉత్తమ ఫలితాలు చూపిన టాప్ 10 సిటీలో.. ఐదు రాజస్థాన్ నుంచే ఉన్నాయి.

➤ రాష్ట్రాలు/కేంద్రాలు పాలిత ప్రాంత్రాల వారిగా చూసే.. నీట్‌లో ఉత్తమ ఫలితం చూపిన టాప్ పది రాష్ట్రాల్లో వరుసగా చండీగఢ్, రాజస్థాన్, హరియాణా కేరళ, ఢిల్లీ, పంజాబ్, ఒడిశా, గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి.

➤ ఈశాన్య రాష్ట్రాల్లో నీట్ ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నాయి. కాగా కొన్ని పరీక్ష కేంద్రాలు, కొన్ని సిటీల్లో ఇలా ఎందుకు ఫలితం భిన్నంగా ఉంది. ఇక్కడ ఎక్కువ మందికి బెస్ట్ ర్యాంకులు ఎలా వచ్చాయి అనే సందేహం రావడం సహజం. అయితే దీనికి ఈ సిటీల్లో అందుబాటులో ఉన్న కోచింగ్ సౌకర్యాలు కారణం కావచ్చు. కోచింగ్ వల్ల కొన్ని చోట్ల విద్యార్థులు మంచి ఫలితం సాధించి ఉండొచ్చు.

కోటాలో పరీక్ష రాసిన వారి వివరాలివీ..



రాష్ట్రాలవారీగా 700కు పైగా మార్కులు వచ్చిన విద్యార్థులు		
రాజస్థాన్ 482	కేరళ 194	హరియాణా 146
మహారాష్ట్ర 205	ఉత్తరప్రదేశ్ 184	తెలంగాణ 49

ఆంధ్రప్రదేశ్ నుంచి..

నీట్ రాసినవారు	అర్హత సాధించినవారు	700కు పైన మార్కులు వచ్చినవారు	650పైన మార్కులు సాధించినవారు	600కుపైన మార్కులు సాధించినవారు	550కి పైన మార్కులు సాధించినవారు
64,931	43,853	87	758	2,500	5,027

500కు పైన మార్కులు సాధించినవారు 7,938

'రెడ్‌బుక్'తో అరాచకం

గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల అనంతరం అరాచకాలు, ఆటవిక పాలన, హింసాకాండపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను కోరారు. 'రాష్ట్రంలో రాజ్యాంగం, శాంతి-భద్రతలు, పోలీసు వ్యవస్థ మొత్తం నిస్తేజంగా మారిపోయాయి. 45 రోజులుగా రాష్ట్రంలో డిఫ్యాక్టో రాజ్యాంగం.. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించడం లేదు. రాజకీయ గూండాలు, మహిళలు-చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడే వారి చెప్పుచేతల్లోకి ప్రభుత్వ వ్యవస్థ వెళ్లిపోయింది' అని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో ఆదివారం ఆయన భేటీ అయ్యారు. దాదాపు 45 నిముషాలపాటు సాగిన ఈ భేటీలో రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అండదండలతో సాగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసకాండ గురించి గవర్నర్‌కు వివరించారు. 'వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ప్రజాప్రతినిధుల నుంచి సామాన్యుల వరకు రక్షణ లేకుండాపోయింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 36 హత్యలు, 300కు పైగా హత్యాయత్నాలకు పాల్పడగా, వేధింపులు తట్టుకోలేక 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 560 ప్రైవేటు, 490 ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. దాడులతో భయకంపితులై 2,700 కుటుంబాలు తమ గ్రామాలను విడిచి పోయాయి. వాటితోపాటు 1,050 దాడులకు పాల్పడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుత పాలకులు శాంతి-భద్రతలను ఏమాత్రం పరిరక్షించలేరని ఈ దురాగతాలు వెల్లడిస్తున్నాయి' అని గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు. టీడీపీ గూండాలు పాల్పడిన హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలతో సహా పూర్తి ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు. గవర్నర్‌కు సమర్పించిన వినతిపత్రంలో విషయాలు ఇలా ఉన్నాయి.



అదఃపాతాళానికి దిగజారిన శాంతి భద్రతలు

రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. రాజ్యాంగ వ్యవస్థలు విఫలమయ్యాయి. అధికార యంత్రాంగం నిర్వీర్యమైపోయింది. సామాన్యుల ప్రాణాలకు ఏమాత్రం రక్షణ లేకుండా పోయింది. అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు దారుణంగా దాడులకు పాల్పడుతుండటంతో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఎన్నికల్లో తమ పార్టీలకు ఓటు వేయని వారిని లక్ష్యంగా చేసుకుని టీడీపీ కూటమి ప్రభుత్వం దాడులకు తెగబడుతోంది. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను లక్ష్యంగా చేసుకుని వారిని అవమానిస్తూ.. దాడులకు పాల్పడుతుండటమే కాకుండా హతమారుస్తున్నారు. వారి ఆస్తులు, వ్యాపారాలను ధ్వంసం చేస్తూ, ఇళ్లను నేలమట్టం చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్ భవనాలతోపాటు ఇతర ప్రభుత్వ ఆస్తులను కూడా ధ్వంసం చేస్తున్నారు. వాటిని గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందనే ఒకే ఒక్క విద్వేషంతోనే ఇలా విధ్వంసకాండ సృష్టిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను కూడా నేలమట్టం చేస్తున్నారు.

ఎంపీల నుంచి సామాన్యుల వరకూ రక్షణ కరువు

టీడీపీ నేతలు, కార్యకర్తల దాడులకు పరాకాష్టగా వినుకొండలో వైఎస్సార్‌సీపీ క్రియాశీల కార్యకర్త రషీద్‌ను ఈ నెల 17న కిరాతకంగా నరికి చంపారు. పోలీసులు సమీపంలోనే ఉన్నాసరే నడి వీధిలో దాడి చేసి మరీ పాశవికంగా హత్య చేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు ఇటీవల ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులకు రక్షణ లేకుండా పోయింది. ఈ నెల 18న చిత్తూరు జిల్లా పుంగనూరు ఎంపీ ఎన్.రెడ్డప్పను కలిసేందుకు వెళ్లిన లోక్‌సభ వైఎస్సార్‌సీపీ పక్ష నేత, ఎంపీ మిథున్ రెడ్డిపై టీడీపీ మూకలు దాడి చేసి హత్య చేసేందుకు యత్నించాయి. పోలీసుల సమక్షంలోనే ఈ దాడికి పాల్పడటం రాష్ట్రంలో సామాన్యులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల ఉదాసీనతకు ఈ దాడి అద్దం పడుతోంది. పోలీసుల ఈ నిర్లక్ష్య వైఖరితో అమానవీయంగా దాడులు చేసేందుకు తమకు అనుమతి లభించిందన్న రీతిలో టీడీపీ గూండాలు చెలరేగిపోయి యథేచ్ఛగా విధ్వంసకాండ సృష్టిస్తున్నారు.

రెడ్ బుక్.. రాజ్యాంగ అరాచకం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా ఏమాత్రం వ్యవహరించడం లేదు. రాజ్యాంగం, శాంతి-భద్రతలు, పోలీసు వ్యవస్థ మొత్తం అచేతనంగా మారిపోయాయి. 45 రోజులుగా రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగమే అమలవుతోంది. రాజకీయ గూండాలు, మహిళలు, చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడేవారి చెప్పుచేతల్లోకి ప్రభుత్వ వ్యవస్థ వెళ్లిపోయింది. గత ఐదేళ్లపాటు రాష్ట్రం అత్యుత్తమ విద్య, వైద్య-ఆరోగ్య విధానాలు, రైతుల సంక్షేమం, మహిళా సాధికారత, పటిష్టమైన శాంతి-భద్రతలు, సమీకృత అభివృద్ధికి నిదర్శనంగా నిలిచింది. కానీ ప్రస్తుతం హత్యలు, అత్యాచారాలు, రాజకీయ కక్ష సాధింపులు, విధ్వంసానికి మారుపేరుగా దిగజారిపోయింది. రాష్ట్రంలో అంతటా అరాచకమే రాజ్యమేలుతోంది. ప్రస్తుత పాలకులు శాంతి-భద్రతలను ఏమాత్రం పరిరక్షించలేరని ఈ దురాగతాలు వెల్లడిస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీని అణచివేసే కుట్ర

వైఎస్సార్‌సీపీని అణచి వేయాలని, తమ పార్టీతో అనుబంధం ఉన్న వారిని రాజకీయాల్లో లేకుండా చేయాలనే ఏకైక కుట్రతోనే ఈ దాడులు, విధ్వంసానికి పాల్పడుతున్నారు. అందుకోసం అత్యున్నత స్థాయిలో ఉన్న ఉన్నతాధికారుల నుంచి క్షేత్ర స్థాయిలో అధికారుల వరకు ఈ మేరకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఓ రాష్ట్ర మంత్రి రెడ్‌బుక్ పేరుతో ఏకంగా హోర్డింగులు ఏర్పాటు చేసి మరీ దాడులు చేయమని తమ నేతలు, కార్యకర్తలను ఆదేశించారు. ఈ విషయాల్లో జోక్యం చేసుకోవద్దని పోలీసు అధికారులకు కూడా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. దాంతోనే టీడీపీ గుండాలు రాష్ట్ర వ్యాప్తంగా దాడులకు పాల్పడుతూ బీభత్సం సృష్టిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు భద్రత కల్పించాల్సిన ప్రభుత్వ యంత్రాంగాన్ని హత్యలు, దాడులు, దురాగతాలకు పాల్పడేందుకు దుర్వినియోగం చేస్తున్నారు. 27 మంది ఐఏఎస్ అధికారులు, 24 మంది ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా ఈ ప్రభుత్వం వివక్ష, కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. మొత్తం మీద రాష్ట్రంలో శాంతి-భద్రతలు అదఃపాతాళానికి దిగజారిపోయాయి. రాష్ట్రంగానీ ప్రజలుగానీ ఈ దుస్థితిని ఇక ఏమాత్రం భరించే పరిస్థితి లేదు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం హింసాకాండపై కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని కోరుతున్నాం.

జగన్‌పై చర్యలు ఎందుకు తీసుకోకూడదు

- హోంమంత్రి అనిత వ్యాఖ్యలు
- రాజకీయ హత్యలపై ఆరోపణల్లో వాస్తవం లేదు
- అసెంబ్లీ ఎగ్గొట్టేందుకే ఢిల్లీలో ధర్నా పేరుతో డ్రామా

సాక్షి, అమరావతి: అధికారం పోవడంతో జగన్‌రెడ్డికి బుర్ర దొబ్బి ఎక్కడికెళ్లి ఏం మాట్లాడాలో తెలియడం లేదని హోంమంత్రి వంగలపూడి అనిత అనుచిత వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఛీత్కరించినా వైఎస్సార్‌సీపీ నాయకులు మారడంలేదని, వారి అబద్ధాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందన్నారు. ఆదివారం మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో హోంమంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. అసత్యాలు, అబద్ధాలతో కూటమి ప్రభుత్వంపై బురద చల్లి జగన్ మళ్లీ సీఎం కావాలని కలలు కంటున్నారని విమర్శించారు. నిజంగానే రాజకీయ హత్యలు జరిగితే వాటికి సంబంధించి పూర్తి వివరాలను ప్రభుత్వానికి ఇవ్వాలని సూచించారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్‌రెడ్డిపై చర్యలు ఎందుకు తీసుకోకూడదని ప్రశ్నించారు. తాజా ఘటనల్లో నిజంగా రాజకీయ హత్యలు నాలుగు మాత్రమే కాగా వాటిల్లోనూ ముగ్గురు టీడీపీ నాయకులే



చనిపోయారని చెప్పారు. వ్యక్తిగత హత్యపై ప్రధానికి లేఖ రాసి రాష్ట్రపతి పాలన విధించాలని కోరుతున్నారంటే ఆయన ఎంత ఘనుడో అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. బాధితులకు దగ్గరకు వెళ్లి అమ్మఒడి వచ్చిందా? వసతి దీవెన అందిందా..? చంద్రబాబు అన్ని ఇచ్చారా? అని అడుగుతున్నారని విమర్శించారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే కేసులకు వెనుకాడం..

ఎమ్మెల్యే భార్యకు కేకు తినిపించిన ఫొటోను చూపించి అందులోని వారిని అరెస్ట్ చేయాలంటున్నారని అలాగైతే జగన్ రెడ్డితో కూడా వారు ఫొటో దిగారని, ఆయన్నే ముందు అరెస్ట్ చేయాల్సి ఉంటుందని హోంమంత్రి పేర్కొన్నారు. తన కార్యకర్త అంటూ భుజాలు ఎగరేసుకుంటూ వెళ్లిన జగన్ ఒక్క రూపాయి కూడా బాధిత కుటుంబానికి సాయం చేయలేదన్నారు. అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్‌ను జగన్ రెడ్డి ఖూనీ చేశారంటూ హోంమంత్రి వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు ఇచ్చిన వాహనం గురించి సాక్షిలో తప్పుడు రాతలు రాశారన్నారు. అసెంబ్లీ సమావేశాలకు వస్తే బండారం బయట పడుతుందని ఢిల్లీలో ధర్నా అంటూ నాటకాలు ఆడుతున్నారన్నారు.

ఆగని దాష్టీకాలు





రెడ్‌బుక్ కాదది.. బ్లడ్ బుక్ వివరాలు 10లో





1. **విజయనగరం:** విజయనగరం జిల్లా రాజాం మండలం గురవాంలో వైఎస్సార్‌సీపీ అభిమాని గొడే ధనుంజయ పిండిమిల్లు ఉన్నరేకుల షెడ్డు గదిని ఈ నెల 19న కూల్చేశారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న గదిని పొక్లెయిన్‌తో నేలమట్టం చేశారు.

2. **కొంతలపల్లి:** కర్నూలు జిల్లా ఆర్.కొంతలపాడులో ఇంట్లో అన్నం తింటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను బయటకు లాక్కొచ్చి టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా కొట్టడంతో పదిమంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.

3.4 **పాకాల:** తిరుపతి జిల్లా పాకాల మండలం పంటపల్లిలో వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు కపిలేశ్వర్‌రెడ్డి, పార్టీ నేతలు ఖాదర్‌బాషా, వాసు రెడ్డిపై టీడీపీ నాయకులు కర్రలు, మద్యం సీసాలతో దాడిచేశారు. ఘటనలో కపిలేశ్వర్‌రెడ్డిని తీవ్రంగా గాయపడ్డాడు.. మరో ఘటనలో పాకాలలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు, సామిరెడ్డిపల్లికి చెందిన హరీష్ నిర్వహిస్తున్న బట్టల దుకాణాన్ని, టీడీపీ గూండాలు ధ్వంసం చేసి పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించారు.

క్లుప్తంగా...

'ఏఈ' ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షుడు వీవీ మురళీకృష్ణ నాయుడు, ప్రధాన కార్యదర్శి కె సంగీతరావు నాయకత్వంలో ఆదివారం సంఘం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ నిర్వహించి పలు తీర్మానాలను చేశారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం పరిధిలో కొనసాగే నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించేలా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు వాహనాల ఏర్పాటుకు ప్రతి నెలా నిధులు విడుదల చేయాలని సమావేశంలో తీర్మానించారు.

ఏపీలో ఐదు నెలల్లో కూటమి కుప్పకూలడం ఖాయం

కాంగ్రెస్ నేత తులసిరెడ్డి



తిరుపతి కల్చరల్ (తిరుపతి జిల్లా): గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ అభాసుపాలు చేసి తాము సచ్ఛీలులమని ప్రకటించుకున్న కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే విధ్వంసకర పాలన సాగిస్తోందని, ఇదే కొనసాగితే ఐదు నెలల్లో కూటమి కుప్ప కూలక తప్పదని కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ తులసిరెడ్డి జోస్యం చెప్పారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో లా అండ్ ఆర్డర్ గతి తప్పడంతో ప్రజలు గుణపాఠం చెప్పారని, గత ప్రభుత్వం కన్నా ప్రస్తుతం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పి రోజూ ఏదో ఒక హింసాత్మక ఘటన జరుగుతుండటం కలవరపాటుకు గురి చేస్తోందన్నారు. అయినా బీజేపీ మాత్రం కూటమితో అంటకాగుతూ చోద్యం చూస్తోందని విమర్శించారు. ప్రస్తుతం ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు సరైన సమయమని కేంద్రంపై ఒత్తిడి తెస్తే రాష్ట్రానికి మంచి జరుగుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రయోజనాలపై చంద్రబాబు దృష్టి సారించకపోతే ఇబ్బందులు తప్పవని తులసిరెడ్డి హెచ్చరించారు.

కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించాలి

గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య


ఓబులేసు యాదవ్

సాక్షి, అమరావతి: అసెంబ్లీ, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కడప ఉక్కు పరిశ్రమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్, సంఘం కడప నగర అధ్యక్షుడు నవీన్ ఆదివారం సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలోని వైఎస్సార్ జిల్లాకు ప్రభుత్వ రంగ పరిశ్రమను ఏర్పాటు చేస్తామని పార్లమెంట్ సాక్షిగా నాడు నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గడిచిన పదేళ్లుగా కడప ఉక్కు పరిశ్రమను పట్టించుకోలేదన్నారు. సీమ యువతకు ఉపాధి కల్పతరువు లాంటి కడప ఉక్కుపై అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు గళం విప్పాలని కోరారు. ఓట్లు, సీట్ల ప్రాతిపదికన సీమ ప్రజలను నిలువునా మోసం చేస్తున్న ప్రధాని మోదీ విధానాలను ఎండగట్టాలని విజ్ఞప్తి చేశారు.

భోజనం @ ఆన్‌లైన్



దేశంలో ఆన్‌లైన్ ఆహార సేవల్లో గణనీయమైన వృద్ధి	ఇంటి భోజనం కంటే ఆన్‌లైన్ ఆర్డర్లకే ఆసక్తి
	2030 నాటికి మార్కెట్ విలువ రూ.5.50 లక్షల కోట్ల నుంచి రూ.9 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా

దేశంలో ఆహార సేవల మార్కెట్ గణనీయంగా వృద్ధి చెందుతోంది. ఇంటికంటే హోటళ్లు, రెస్టారెంట్లలో తినే వారి సంఖ్యలో భారీగా పెరుగుదల నమోదవుతోంది. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలు వచ్చాక వినియోగదారులు తమకు నచ్చిన ఆహారాన్ని ఒక్క క్లిక్‌లో ఆర్డర్ చేసి హాయిగా లాగించేస్తున్నారు. మార్కెట్‌లో విస్తరిస్తున్న వినియోగదారులు, కొత్తరకాల తినుబండారాల సంఖ్య పెరగడంతో ఈ తరహా వృద్ధి నమోదవుతోందని ఆహార సరఫరాల సంస్థల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

-సాక్షి, అమరావతి

రూ.9 లక్షల కోట్లకు చేరి

ఆదాయంలో పెరుగుదల, డిజిటలైజేషన్, మెరుగైన కస్టమర్ సేవలు, కొత్త ధోరణిలో ఆహారపు అలవాట్లు మార్కెట్లను పెంచుతున్నాయి. ప్రస్తుతం రూ.5.50 లక్షల కోట్లుగా ఉన్న ఆహార మార్కెట్ విలువ 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల గరిష్ట వృద్ధిని నమోదు చేస్తుందని భావిస్తున్నారు. అంటే ప్రస్తుతం ఉన్న 32–34 కోట్ల వినియోగదారుల నుంచి 43–45 కోట్లకు వృద్ధి చెందనున్నారు. ఫాస్ట్‌ఫుడ్ చైన్‌ల పెరుగుదల, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌ల ప్రవేశంతో దేశంలో ఆహార సేవల మార్కెట్‌లో గత దశాబ్దంలో గణనీయమైన మార్పులు వచ్చాయి. తద్వారా ప్రజలు బయటి నుంచి ఆహార పదార్థాలను ఇంటికే రప్పించుకుని తినే ఫ్రీక్వెన్సీ మరింత పెరగనుంది. వాస్తవానికి దేశంలోని మొత్తం ఆహార సేవల వినియోగంలో దాదాపు 70 శాతం టాప్ 50 నగరాల్లోనే ఉంది. ఈ క్రమంలోనే క్లౌడ్ కిచెన్‌తో కూడిన క్విక్ సర్వీస్ రెస్టారెంట్లు 40 శాతం వేగంగా వృద్ధి చెందుతాయని అంచనా.

వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, ఆదాయం పెరుగుదల బయట ఆహారాన్ని తీసుకునే విధానంలో స్పష్టమైన మార్పులు తీసుకొస్తుందని ఓ ప్రముఖ సం

నెలకు ఏడెనిమిదిసార్లు బయట భోజనమే

స్థ తాజా నివేదిక తేల్చింది. అంటే భారతీయ వినియోగదారులు నెలకు 5 సార్లు హోటళ్లు, రెస్టారెంట్లు, ఆన్‌లైన్ డెలివరీల్లో ప్రత్యేక భోజనం చేస్తుంటే ఇది 7–8 రెట్లు పెరుగుతుందని స్పష్టం చేస్తోంది. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలు, ఫైన్‌డైన్ రెస్టారెంట్ల చెయిన్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని తెలిపింది. ప్రతి వినియోగదారుడు సగటున ఆరు కంటే ఎక్కువ సార్లు ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లు చేస్తే.. ఇందులో ఏడాదిలో మూడు కంటే ఎక్కువ విభిన్న రకాల వంటకాలను ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ భారతీయ వినియోగదారులు ప్రతిసారీ వైవిధ్యమైన ఆహారాన్ని కోరుకుంటున్నట్టు నివేదికలో తేలింది. ముంబైలో మొదటి రెండు వంటకాలు దాల్ కిచిడీ, మార్గెరిటా పిజ్జా, ఢిల్లీలో మెక్ ఆలూ టిక్కీ బర్గర్, పిజ్జా మెక్‌పఫ్ ఉన్నాయి. బెంగళూరులో మసాలా దోశ, చికెన్ బిర్యానీ ఎక్కువగా ఆర్డర్ చేయగా.. కోల్‌కతాలో చికెన్, మటన్ బిర్యానీలను ఎక్కువగా ఇష్టపడినట్టు ఆ నివేదిక తెలిపింది.



ఆయా నగరాల్లో ఎక్కువగా ఆర్డర్ చేస్తున్న ఆహార పదార్థాలు

నగరం	ఆహార పదార్థాలు
ముంబై	దాల్ కిచిడీ, మార్గెరిటా పిజ్జా
ఢిల్లీ	మెక్ ఆలూ టిక్కీ బర్గర్, పిజ్జా మెక్‌పఫ్
బెంగళూరు	మసాలా దోశ, చికెన్ బిర్యానీ
కోల్‌కతా	చికెన్, మటన్ బిర్యానీ

దళితుడి లాకప్‌డెత్‌పై న్యాయ విచారణ జరపాలి

కేవీపీఎస్ డిమాండ్

సాక్షి, అమరావతి: నంద్యాల జిల్లా ముచ్చుమర్రి బాలికపై హత్యాచారం కేసులో దళితుడు హుస్సేన్ (యోహాన్) లాకప్‌డెత్ వ్యవహారంపై న్యాయ విచారణ జరిపించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు హోం మంత్రి అనితకు రాసిన లేఖను కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి ఆదివారం మీడియాకు విడుదల చేశారు. పోలీసులు విచారణ పేరుతో విచక్షణారహితంగా కొట్టి హింసించడం వల్లే యోహాన్ మరణించాడన్నారు. ఇందుకు అతని శరీరంపై ఉన్న గాయాలే నిదర్శనమన్నారు. అతను పారిపోయే క్రమంలో పరుగెత్తుతూ గుండెపోటుతో చనిపోయాడని పోలీసులు చెప్పడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఏ తప్పూ జరగకపోతే.. ఎందుకంత గుట్టుగా అంత్యక్రియలు నిర్వహించారని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాగాన్ ఎక్స్‌ప్రెస్‌లో పొగలు



బిట్రగుంట: అసోం రాష్ట్రం సిల్‌గాట్ నుంచి తమిళనాడులోని తాంబరం వెళ్తున్న నాగాన్ ఎక్స్‌ప్రెస్(15630) రైలులో ఒక్కసారిగా పొగలు వ్యాపించిన ఘటన కావలి–తెట్టు రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం జరిగింది. సాయంత్రం సుమారు ఆరు గంటల సమయంలో కావలి–తెట్టు స్టేషన్ల మధ్య ఎల్‌సీ గేటు నంబరు 161 వద్దకు వచ్చే సరికి రైలు జనరల్ బోగీల చక్రాల వద్ద దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గమనించిన రైల్వే సిబ్బంది వెంటనే రైలును నిలిపేశారు. వెంటనే బోగీల్లో నుంచి బయటకు దిగి పరుగులు తీశారు. రైలును పరిశీలించిన సిబ్బంది బ్రేక్ బైండింగ్ కారణంగా పొగలు వస్తున్న విషయాన్ని గుర్తించారు. మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు. ఈ ఘటన కారణంగా రైలు సుమారు 20 నిమిషాల పాటు అక్కడ నిలిచిపోయింది.

హోదా విషయంలో చంద్రబాబు నోరు తెరవడం లేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



ఒంగోలు టౌన్: ప్రధాని మోదీ విషయంలో గతం నుంచి గుణపాఠం నేర్చుకోకుంటే తెలుగుదేశం పార్టీ బీజేపీ ధృతరాష్ట్ర కౌగిలికి బలికాక తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఒంగోలు సుందరయ్య భవనంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం.. చంద్రబాబు, నితీష్ కుమార్‌ల మద్దతు మీద ఆధారపడి ఉందని, సొంత రాష్ట్రం కోసం నితీష్‌కుమార్ ప్రత్యేక హోదా, నిధులు కోరారని గుర్తు చేశారు. చంద్రబాబు మాత్రం రాష్ట్రం కోసం నోరు తెరవడం లేదని, టీడీపీ ఎంపీలతో ఎక్కువ నిధులు తీసుకుని రావాలని సూచించారే తప్ప.. రాష్ట్ర హక్కుల గురించి ప్రస్తావించలేదని చెప్పారు. వెనకబడిన ప్రకాశం జిల్లాకు బుందేల్ ఖండ్ తరహాలో ప్యాకేజీ ప్రకటించాలని, రాష్ట్రం కోసం ఢిల్లీలో ధర్నా చేయాలని సూచించారు.

పర్యాటక అభివృద్ధికి సహకరించండి

నిధుల కోసం కేంద్ర మంత్రి షెకావత్‌కు కందుల దుర్గేష్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక అభివృద్ధికి తగిన సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఢిల్లీలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను ఆయన కలిశారు. ఏపీలో పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో అనేక సముద్రతీర ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని వివరించారు. రాజధాని ప్రాంతంలో కూడా పర్యాటక రంగాన్ని విస్తరించాల్సిన అవసరముందన్నారు. పర్యాటక రంగంలో ఏపీ రోల్‌మోడల్ అని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీ పర్యాటక రంగానికి తగిన నిధులు కేటాయించాలని కోరారు. షెకావత్ స్పందిస్తూ.. కేంద్రం నుంచి తగిన సహకారం అందిస్తామని చెప్పారు.

రాష్ట్ర సమస్యలన్నీ పార్లమెంట్‌లో లేవనెత్తుతాం

టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అన్ని సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తుతామని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. ఆదివారం ఢిల్లీలోని పార్లమెంట్‌లో జరిగిన అఖిలపక్ష భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'అమరావతి, పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్ ప్లాంట్‌తో పాటు.. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంటులో గళం వినిపిస్తాం. రాష్ట్రంలో విడుదల చేస్తున్న శ్వేతపత్రాలను కూడా పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్తాం. ఆర్థిక పరిస్థితిపైనా మాట్లాడుతాం' అని శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. ఐదేళ్లలో చేసిన తప్పులు బయటికి వస్తాయన్న భయంతో వైఎస్సార్‌సీపీ ఢిల్లీలో ఆందోళన తలపెట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య ఉంటే అసెంబ్లీలో మాట్లాడాలి గానీ ఢిల్లీకి రావడమేంటని ప్రశ్నించారు.

అఖిలపక్ష భేటీలో ప్రజా సమస్యలెందుకు?: జనసేన

అఖిలపక్ష సమావేశంలో ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన అవసరం లేదని జనసేన పార్టీ ఎంపీ బాలశౌరి అన్నారు. అఖిలపక్ష భేటీలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంట్ సమావేశాల్లో చిన్న పార్టీల ఎంపీలు మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వాలని అఖిలపక్ష సమావేశంలో కోరినట్లు చెప్పారు. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తుతామన్నారు. రోడ్లు, తాగునీరు, విద్య, పోలవరం, అమరావతి అంశాలను లేవనెత్తుతామని తెలిపారు.

శాంతిభద్రతలు నాశనమయ్యాయంటున్నారు

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు పూర్తి కాకముందే వైఎస్సార్‌సీపీ నేతలు శాంతిభద్రతలు నాశమవుతున్నాయి.. రాష్ట్రపతి పాలన పెట్టాలి.. అంటూ మాట్లాడుతున్నారని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు అన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక కనీసం మూడు నెలల సమయం కూడా ఇవ్వకుండా కాట్ల కుక్కల్లా మీద పడుతున్నారని, వాళ్లకు యాంటీ రాబీస్ ఇంజక్షన్ వేసి సైలెంటుగా కూర్చోబెడతామంటూ వ్యాఖ్యానించారు.

రాష్ట్రపతి పాలన విధించాల్సిందే

- అఖిలపక్ష భేటీలో విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి డిమాండ్
- ఏపీలో దారుణంగా శాంతి భద్రతలు
- ఎంపీలకే రక్షణలేని పరిస్థితి


మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, చిత్రంలో మిథున్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాల్సిన పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయని వైఎస్సార్ సీపీ రాజ్యసభ, లోక్‌సభ పక్ష నేతలు వి.విజయసాయిరెడ్డి, పి.మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆదివారం ఢిల్లీలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజ్జు నిర్వహించిన అఖిలపక్ష భేటీలో వారిద్దరూ ఆంధ్రప్రదేశ్‌లో అదుపు తప్పిన శాంతి భద్రతలు, అధికార పార్టీ దాడులు, విభజన హామీల అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.

ఎంపీలకే రక్షణ లేని దుస్థితి..

ఆంధ్రప్రదేశ్‌లో పార్లమెంట్ సభ్యులకు సైతం భద్రత లేకుండా పోయిందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాసానికి వెళ్లిన ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ గూండాలు దాదాపు 500 మందితో వచ్చి రాళ్లు, కర్రలతో దాడి చేశారన్నారు. దాడులకు బరి తెగించిన టీడీపీ గూండాలను వదిలేసి వైఎస్సార్ సీపీకి చెందిన బాధితులపై నే కేసులు బనాయించడం దారుణమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలన సాగించేందుకు టీడీపీ ప్రభుత్వానికి ఏమాత్రం అర్హత లేదని, రాష్ట్రపతి పాలన విధించాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయని చెప్పారు. రాష్ట్రంలో 45 రోజుల టీడీపీ పాలనలో 490 ప్రభుత్వ భవనాలు, 560 ప్రైవేట్ ఆస్తులపై దాడులు జరిగాయన్నారు. యథేచ్ఛగా హత్యలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై వేలాదిగా దాడులు జరిగాయన్నారు. టీడీపీ గూండాలు వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్‌ను నడిరోడ్డుపై నరికి చంపుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం దారుణమన్నారు. ఇలాంటి వాళ్లా రాష్ట్రాన్ని పాలించేది? అని ప్రజలు ఆలోచిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 300 హత్యాయత్నాలు జరిగాయంటే ఎలాంటి దారుణ పరిస్థితులు నెలకొన్నాయో ఊహించవచ్చన్నారు. మౌనపాత్ర పోషిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వచ్చే బుధవారం ఢిల్లీ వేదికగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వివరిస్తారని తెలిపారు. గత 45 రోజులుగా రాష్ట్రంలో ఏం జరిగిందో ఫోటో ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. ప్రజల బాగోగుల పట్ల చిత్తశుద్ధితో రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రుల అపాయింట్‌మెంట్లు కోరినట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రజలకు వ్యతిరేకంగా ఏం జరిగినా కేంద్రం, రాజ్యాంగ వ్యవస్థల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రజల కోసం వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాడుతుందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే టీడీపీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమన్నారు. అఖిలపక్ష సమావేశంలో ప్రత్యేక హోదా, బడ్జెట్‌లో ఎక్కువ వాటా, విభజన హామీల్లో ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న పెట్రో కెమికల్, రైల్వే జోన్, గిరిజన వర్సిటీ తదితర అంశాలపై డిమాండ్ చేశామని ఎంపీ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జేడీయూ బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని అఖిలపక్ష సమావేశంలో కోరగా మరో కీలక భాగస్వామి టీడీపీ మాత్రం దీనిపై నోరు మెదపకపోవడం దారుణమన్నారు.

మాపై దాడి చేసి.. మాపైనే కేసులా?

రెండుసార్లు తన నియోజకవర్గానికి వెళ్లేందుకు సిద్ధమైనా టీడీపీ గూండాలు అడ్డుకుని భౌతిక దాడులకు దిగినట్లు ఎంపీ మిథున్‌రెడ్డి చెప్పారు. గృహ నిర్బంధం విధించి భద్రత కల్పించలేమని పోలీసులు చేతులెత్తేశారన్నారు. పోలీసుల సమక్షంలోనే మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపై టీడీపీ కార్యకర్తలు దాడులు చేసి వాహనాలను దగ్ధం చేస్తే హత్యాయత్నం, నాన్ బెయిలబుల్ కేసులు తమపై బనాయించడం దారుణమన్నారు. ప్రజాప్రతినిధికే ఇలాంటి పరిస్థితి వస్తే సామాన్యుల సంగతి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. వినుకొండలో రషీద్‌ది రాజకీయ హత్య అని మృతుడి తల్లిదండ్రులు చెబుతున్నా ప్రభుత్వం ఆలకించడం లేదని మండిపడ్డారు. ఏపీలో శాంతి భద్రతలు అదుపులో లేవన్నారు.



ఒకదాని పేరు తెలుసుకోవడానికీ, ఒకదాన్ని తెలుసుకోవడానికీ మధ్య ఉన్న తేడా ఏమిటో నేను త్వరగా నేర్చుకున్నాను.
– రిచర్డ్‌ పి. ఫెయిన్‌మాన్‌

సాక్షి
సోమవారం, 22 జూలై 2024

దాశరథి స్మృతి

పూపరిమళాన్ని వెదజల్లే అగ్నిశిఖలాంటివాడు దాశరథి. చైత్రరథాలను తోలుతూనే, అభ్యుదయ పంథా సాగాడు. ఋతురాగాలను వర్ణిస్తూనే, 'నిరుపేదవాని నెత్తురు చుక్కలో' విప్లవాలను కాంచాడు. 'అంగారమూ శృంగారమూ' సమపాళ్లలో మేళవించివున్న సుకుమారుడు. ఆకాశమంత ఎదిగిన వామనుడు. స్నానం చేసి మడి కట్టుకున్నాక, సంస్కృతంలో తప్ప తెలుగులో మాట్లాడని సనాతన సంప్రదాయ కుటుంబంలో జన్మించిన దాశరథి– పన్నీటివంటి తెలుగునూ, పసందైన ఉర్దూ గజళ్లనూ ప్రేమించాడు. 'ఏది కాకతి? ఎవతి రుద్రమ?/ ఎవడు రాయలు? ఎవడు సింగన?/ అన్ని నేనే, అంత నేనే/ వెలుగు నేనే, తెలుగు నేనే' అని సగర్వంగా ప్రకటించాడు. ఒకప్పటి వరంగల్‌ జిల్లాలో భాగమైన ఖమ్మంలోని చిన గూడూరులో 1925 జూలై 22న జన్మించిన దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సంవత్సరం నేటి నుంచి మొదలవుతుంది.

దొరలు, దేశ్‌ముఖులు, జమీందారులు, జాగీర్దార్ల గుప్పిట సాగుభూములన్నీ ఉన్న రోజుల్లో; ఎర్రకోటపై నిజాం పతాకం ఎగురవేస్తాననీ, బంగాళాఖాతంలో నిజాం కాళ్లు కడుగుతాననీ కాశిం రజ్వీ బీరాలు పలుకుతున్న కాలంలో; హైదరాబాద్‌ రాష్ట్రాన్ని ఇండియన్‌ యూనియన్‌లో కలపడం కోసం తొలుత కమ్యూనిస్టుగానూ, అటుపై స్టేట్‌ కాంగ్రెస్‌వాడిగానూ పోరాట పిడికిలి బిగించిన యోధుడు దాశరథి. 'మధ్యయుగాల రాచరికపు బలా'న్నే తన కవితకు ప్రేరణగా మలుచుకుని సింహగర్జన చేసిన మహాకవి దాశరథి. 'ఓ నిజాము పిశాచమా! కానరాడు/ నిన్ను బోలినరాజు మాకెన్నడేని/ తీగెలను తెంపి అగ్నిలో దింపినావు/ నా తెలంగాణ కోటిరత్నాల వీణ' అని నినదించిన 'అగ్నిధార' దాశరథి. 1947 ప్రాంతంలో నిజాం పోలీసులు బంధించి తొలుత వరంగల్‌ సెంట్రల్‌ జైలుకూ, అనంతరం నిజామాబాద్‌ జైలుకూ ఆయన్ని తరలించారు. ముక్కిన బియ్యం, ఉడకని అన్నం వల్ల అనారోగ్యానికి గురైనా కవితా కన్యకను విడిచిపెట్టలేదు. కలం కాగితాలు దొరక్కపోయినా జైలు గోడల మీద బొగ్గుతో కవిత్వం రాయడం మానలేదు. తోటి ఖైదీలు పదే పదే చదువుతూ వాటిని కంఠస్థం చేసేవాళ్లు. 'దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు/ ఊళ్లకూళ్లు అగ్గిపెట్టి ఇళ్లన్నీ కొల్లగొట్టి... పెద్దరికం చేస్తావా మూడు కోట్ల చేతులు నీ/ మేడను పడదోస్తాయి...' అంటూ 'ఇదేమాట పదేపదే' హెచ్చరించాడు.

తెలంగాణను కలవరించిన 'కవిసింహం' దాశరథి. తెలంగాణ అనే మాటతో మరింకే కవీ ముడిపడనంతగా ముడిపడిన 'అభ్యుదయ కవిసమ్రాట్‌' దాశరథి. 'కలిపి వేయుము నా తెలంగాణ తల్లి/ మూడు కోటుల నొక్కటే ముడి బిగించి' అని కోరాడు. 'తెలంగాణము రైతుదే/ ముసలి నక్కకు రాచరికమ్ము దక్కునే' అని ప్రశ్నించాడు. 'నేనురా తెలంగాణ నిగళాలు తెగగొట్టి ఆకాశమంత ఎత్తర్చినానూ' అని ఘోషించాడు. 'తెలంగాణమున గడ్డిపోచయును సంధించెను కృపాణమ్ము' అని కీర్తించాడు. 'మూగవోయిన కోటి తమ్ముల గళాల/ పాట పలికించి కవిరాజసమ్ము కూర్చి/ నా కలానకు బలమిచ్చి నడపినట్టి/ నా తెలంగాణ కోటిరత్నాల వీణ' అని పలికాడు. 'నాడు నేడును తెలగాణ మోడలేదు' అని ఎలుగెత్తాడు. 1952లో స్థాపించిన 'తెలంగాణ రచయితల సంఘం'కు మొదటి అధ్యక్షుడిగా వ్యవహరించాడు. అయినప్పటికీ 'మహాంధ్ర సౌభాగ్య గీతి'ని చివరిదాకా ఆలపించాడు. 'సమగ్రాంధ్ర దీపావళి సమైక్యాంధ్ర దీపావళి'ని జరుపుకొన్నాడు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రానికి ఆస్థాన కవిగా వ్యవహరించాడు.

ఆంధ్ర నటుల నోట తెలంగాణ మాట ఇప్పుడు కమ్మగా వినిపిస్తున్నదంటే, ఆంధ్ర దర్శకులు తెలంగాణ పలుకుబడిని తమది కానిదని భావించడం లేదంటే– దాశరథి, ఇంకా అలాంటి ఎందరో తెలంగాణ రచయితలు, అటుపై జరిగిన తెలంగాణ ప్రత్యేక ఉద్యమాలు కారణం. దాశరథి లాంటివాళ్లు రెండు రకాల యుద్ధాలు చేశారు. ఉర్దూమయమైన హైదరాబాద్‌ రాష్ట్రంలో తెలుగు మాట్లాడటం కోసం ఒకటి, అది 'తౌరక్యాంధ్రము' అని ఈసడించే ఆంధ్రులతో మరొకటి! అయినా దాశరథి తాను రాసిన సినిమా పాటల్లో తెలంగాణ 'తహజీబ్‌'ను 'ఖుషీ ఖుషీగా' చాటాడు. నిషాలనూ, హుషారులనూ మజామజాగా పాడాడు. అంతేనా? 'ఏ దివిలో విరిసిన పారిజాతమో ఏ కవిలో మెరిసిన ప్రేమగీతమో'; 'నా కంటిపాపలో నిలిచిపోరా నీ వెంట లోకాల గెలవనీరా' అంటూ సాటి తెలుగు సినీ గేయరచయితలకు దీటుగా నిలిచాడు.

భద్రాద్రి శ్రీరామచంద్రుని సేవలో తరించి దాశరథి అనే ఇంటిపేరును స్థిరం చేసుకున్నదని చెప్పే వంశం వాళ్లది. తమ్ముడు దాశరథి రంగాచార్య కూడా అంతే గట్టివాడైనప్పటికీ మనకు దాశరథి అంటే దాశరథి కృష్ణమాచార్యే. 'మహాంధ్రోదయం', 'పునర్నవం', 'కవితాపుష్పకం', 'అమృతాభిషేకం', 'రుద్రవీణ', 'తిమిరంతో సమరం' వంటి కవితా సంపుటాలు; 'మహాశిల్పి జక్కన్న' అనే చారిత్రక నవల; 'యాత్రాస్మృతి' పేరిట వచన సొగసును తెలిపే ఆత్మకథ వెలువరించాడు. రేడియోలో పనిచేస్తూ లలిత గీతాలు, రేడియో నాటకాలు వినిపించాడు. భక్త రామదాసు మాదిరిగానే 'దాశరథీ కరుణాపయోనిధీ' మకుటంతో 'అభినవ దాశరథీ శతకం' రచించాడు. చక్కటి గాలిబ్‌ గీతాలను సరళ సుందరమైన తెలుగులోకి అనువదించాడు. 'నాదు గుండె గాయము కుట్టు సూదికంట/ అశ్రుజలధార దారమై అవతరించె' అంటూ గాలిబ్‌ ఉర్దూ ఆత్మను తెలుగు శరీరంలోకి ప్రవేశపెట్టాడు. 'రోజూ కనబడే నక్షత్రాల్లోనే/ రోజూ కనబడని కొత్తదనం చూసి/ రోజూ పొందని ఆనందానుభూతి/ పొందడం అంటేనే కవిత్వం' అని చెప్పిన సౌందర్యారాధకుడు దాశరథి 1987 నవంబర్‌ 5న అరవై రెండేళ్లకు గురుపూర్ణిమ నాడు పరమపదించాడు.

జమ్మూలో దాడుల వెనుక...

విశ్లేషణ



జ్యోతీ మల్హోత్రా

కొన్ని వారాలుగా జమ్ము తీవ్రవాదుల దాడులతో దద్దరిల్లుతోంది. కశ్మీర్‌ లోయ నుండి ఉగ్రదాడులు జమ్మూకి ఎందుకు మారినట్టు? ప్రపంచంలోనే అత్యంత సైనికీకరించిన ప్రదేశాల్లో కశ్మీర్‌ ఒకటి. సైన్యానికి తెలియకుండా ఆకు కూడా కదలదు. కశ్మీర్‌తో పోల్చితే జమ్మూ తక్కువ సమస్యాత్మకం. జమ్ము–కశ్మీర్‌కు ఆర్టికల్‌ 370 రద్దు అయిదో వార్షికోత్సవాన్ని జరుపుకోవడానికి బీజేపీ పాలిత కేంద్రం సిద్ధమవుతున్న తరుణంలో ఈ దాడులు జరుగుతుండటం గమనార్హం. సాధారణ స్థితికి సంబంధించిన ప్రభుత్వ వాదనలను జమ్మూలో కూడా తోసిపుచ్చడమే ఉగ్రవాదుల లక్ష్యం అయి వుండాలి. శాశ్వత శాంతిని కనుగొనడంలో 'పాకిస్తానీ హస్తం' ఇప్పటికీ తప్పనిసరని ఈ దాడులు గుర్తు చేస్తాయని వాళ్లు భావిస్తూవుండొచ్చు.

ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ ప్రాంతంలోని రియాసీ నుంచి కాశ్మీర్‌లోని బారాముల్లా వరకు చీనాబ్‌ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన వంతెన మీదుగా ఈ నెలాఖరులో తొలి రైలు రన్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. కానీ ప్రశ్న ఏమిటంటే, పీర్‌ పంజాల్‌కు దక్షిణాన ఇటీవల జరిగిన ఉగ్రదాడుల కారణంగా ఈ ప్రాంత వాసుల్లో ఏర్పడుతున్న ఆందోళనకు ప్రధాన మంత్రి సమక్షంలో భరోసా లభిస్తుందా?



గత కొన్ని వారాలు రక్తంతో తడిసిన భీకర శబ్దాన్ని గుర్తుచేస్తున్నాయి: జూలై 8న కథువా జిల్లాలో ఐదుగురు సైనికులు హతమయ్యారు. జూలై 7న కుల్గామ్‌లో ఆరుగురు ఉగ్రవాదులతో సహా ఎనిమిది మంది హతమయ్యారు. జూన్‌ 26న దోడా జిల్లాలో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. జూన్‌ 9న ఢిల్లీలో ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం చేస్తున్న రోజున రియాసి జిల్లాలో తొమ్మిది మంది యాత్రికులు హత్యకు గురయ్యారు.

మరో నెల రోజుల్లో, జమ్ము–కశ్మీర్‌కు ఆర్టికల్‌ 370 రద్దు అయిదో వార్షికోత్సవాన్ని జరుపుకోవడానికి బీజేపీ పాలిత కేంద్రం సిద్ధమవుతున్న తరుణంలో 'సబ్‌ చంగా సీ' (అంతా బాగుంది) పిలుపునకు ఏమైంది? ముడుచుకుపోయిన పెదవులు, పిడచకట్టుకుపోయిన నాలుకలపై కదులుతున్న ప్రశ్న ఏమిటంటే, ముస్లింలు మెజారిటీగా ఉన్న కశ్మీర్‌ లోయ నుండి ఉగ్రవాద దాడులు హిందూ మెజారిటీ జమ్మూకి ఎందుకు మారాయి?

మొదట, వాస్తవాలు చూద్దాం. దాడులు చేస్తున్న ఉగ్రవాదులు విదేశీయులు. అంటే వారు పాకిస్తాన్‌కు చెందినవారు. అఫ్గాన్లు, చెచెన్లు మొదలైన ఇతర విదేశీ ఉగ్రవాదుల్ని ఇక్కడ గుర్తించలేదు. రెండవది, వారు అమెరికా తయారీ ఎమ్‌4 కార్బైన్‌ అసాల్ట్‌ రైఫిల్స్‌ వంటి అధునాతన ఆయుధాలను కలిగి ఉన్నారు. ఇవి తరచుగా జమ్ము–కశ్మీర్‌లో కంటే అఫ్గాన్‌ యుద్ధరంగంలో ఎక్కువగా కనిపిస్తాయి. మూడవది, వారు దాడులను నిర్వహించడానికి అత్యున్నత శిక్షణ పొందారు. నాల్గవది, ఈ ఉగ్రవాదులు అటవీ, అంతర్జాతీయ సరిహద్దు విభాగం నుండి జమ్మూ ప్రాంతంలోకి చొరబడ్డారు. వారు వేగవంతమైన ప్రవాహాల నుండి ఈదుకుంటూ వచ్చారు, అంతే తప్ప నిజంగా నియంత్రణ రేఖను దాటి కాదు.

అంతర్జాతీయ సరిహద్దు నుంచి చొరబడవచ్చని చెబితే ఎక్కువగా ఆశ్చర్యపోవద్దు. రియాసీ, డోడా, కథువా, సాంబాలో నేల మెత్తటిది. గతంలో ఉగ్రవాదులు సొరంగాల ద్వారా చొరబడ్డారు. ఇప్పుడైతే పాకిస్తానీ డ్రోన్లు వారికి సాయపడుతున్నాయి – 2021లో జమ్మూ వైమానిక క్షేత్రంపై దాడితో సహా!

మరీ ముఖ్యంగా, పాకిస్తానీ వ్యూహంలో మార్పు – అంటే, లక్ష్య ప్రాంతాన్ని కశ్మీర్‌ నుండి జమ్మూకి మార్చడం అనేది కశ్మీరీ జనాభాకు 'ఉపశమనం' ఇవ్వాలనే ఉద్దేశ్యంతో స్పష్టంగా జరిగిన చర్య. కశ్మీర్‌ లోయ చాలా నిశితంగా పరిశీలించబడుతోంది. అక్కడ చెట్టు నుండి పడే ఆకు వేగం, కోణం, దూరం గురించి కూడా భద్రతా బలగాలకు తెలుసు. వారికి ముందుగా తెలియకుండా చిగురుటాకు కూడా రాలడం కష్టం. కశ్మీర్‌లోని పెద్ద భూభాగాలు ప్రపంచంలోనే అత్యంత సైనికీకరించబడిన వాటిలో ఒకటిగా ఉన్నాయనడంలో సందేహం లేదు. వ్యవస్థ గురించి మాట్లాడితే లేదా వ్యతిరేకంగా మాట్లాడితే దానికి చెల్లించే మూల్యం చాలా ఎక్కువగా ఉంటుంది కాబట్టి ప్రజలు తమ పనులు తాము చూసుకుంటారు.

జమ్మూ ప్రాంతంలో అలా కాదు. పూంఛ్‌–రాజౌరీ సెక్టార్‌లో నిరంతరం దాడులు జరుగుతున్నప్పటికీ, ఈ భూభాగాల భద్రత చాలావరకు సడలించబడింది. హిందూ మెజారిటీతో కూడిన జమ్మూ మరింత జాతీయవాదంతో, తక్కువ సమస్యాత్మకంగా ఉంటుంది. వాస్తవానికి, 2020 వేసవిలో వాస్తవ నియంత్రణ రేఖ అంతటా చైనీయులు కాలిడినట్లు గుర్తించిన వెంటనే, రాష్ట్రీయ రైఫిల్స్‌ వారి బ్రిగేడ్‌ను తూర్పు లద్దాఖ్‌కు తరలించారు. భద్రత పలుచబడిపోవడం వల్ల జమ్మూకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పుడు మాత్రమే ఇక్కడి బ్రిగేడ్‌ కొంతమంది రిజర్వ్‌ బలగాలతో భర్తీ అయింది.

ఇక్కడ మరొకటి కూడా జరుగుతోంది. ఇది భద్రతా పరిస్థితులతో నేరుగా సంబంధం కలిగి ఉండకపోయినా, మారుతున్న పరిస్థితుల గురించి మీకు కొంత ఆలోచన ఇస్తుంది. అదేమిటంటే ఆర్టికల్‌ 370 రద్దు అనంతరం కూడా బీజేపీ బలహీనపడటం!

ఇది ఇలా ఉండకూడదు. ఆర్టికల్‌ 370ను రద్దు చేయడం వల్ల జమ్మూను దేశంలోని మిగిలిన ప్రాంతాలతో మరింత అనుసంధానం చేయాలని భావించారు. దానికి బదులుగా, ఇప్పుడు స్థానిక నివాసితులు పెరుగుతున్న నిరుద్యోగం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, బయటి వ్యక్తులకు భూమి అమ్మకం, మద్యం వ్యాపారంలో పెరుగుదలతో పాటుగా, శ్రీనగర్‌ నుండి ఐదు లక్షల మందితో కూడిన బలమైన సైన్యం తరలింపును గురించి ఫిర్యాదు చేస్తున్నారు. ఇది స్థానిక వ్యాపారానికి ఊతమిచ్చేది.

ఇటీవలి లోక్‌సభ ఎన్నికలు ఆ అసంతృప్తిని కొంత మేరకు ప్రదర్శించాయి. ఉధమ్‌పూర్‌ (40.11 శాతం ఓట్లు సాధించిన చౌధురీ లాల్‌ సింగ్‌ను 51.28 శాతంతో జితేంద్ర సింగ్‌ ఓడించారు), జమ్మూ (42.4 శాతం ఓట్లు సాధించిన రామన్‌ భల్లాను 52.8 శాతంతో జుగల్‌ కిషోర్‌ శర్మ ఓడించారు) స్థానాలను బీజేపీ గెలుచుకున్నప్పటికీ, వారి గెలుపు మార్జిన్లు చాలా తక్కువగా ఉన్నాయి. రెండూ 1.5 లక్షల కంటే తక్కువ. ఇలా జరగడం పట్ల అధికార పార్టీ ఒకింత ఆశ్చర్యం కూడా వ్యక్తం చేసింది.

బహుశా, పాకిస్తానీ ఉగ్రవాదులు చేయాలనుకుంటున్నది అదే కావచ్చు. ఆర్టికల్‌ 370 రద్దు అయిదో వార్షికోత్సవం సందర్భంగా, సాధారణ స్థితికి సంబంధించిన ప్రభుత్వ వాదనలను జమ్మూలో కూడా తోసిపుచ్చడమే. తీవ్రవాద దాడుల స్థాయి ఇంకా కొద్దో గొప్పో నియంత్రణలోనే ఉందనీ, వ్యూహాలు మారినప్పటికీ అది ఎక్కువ ప్రతీకార చర్యలకు పురిగొల్పదనీ కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడులు సైనిక శిబిరాలకు ఎక్కువ నష్టం కలిగించడానికి ఉద్దేశించబడ్డాయి. జమ్మూలో ఇవి సాయుధ గస్తీపై, పౌర వాహనాలపై మెరుపుదాడిగా మారాయి.

బహుశా, మరొక కారణం ఉంది. పార్లమెంట్‌లో ప్రధాని మోదీ బలం తగ్గినప్పటికీ, ఆయన ప్రపంచంలో పర్యటిస్తున్నారనీ, ఆయన గౌరవం పొందుతున్నారనీ పాకిస్తాన్‌ సర్వశక్తిమంతమైన సైనిక వ్యవస్థ గమనించకుండా ఉండదు. న్యూఢిల్లీని దాని ఆత్మసంతృప్తి దశ నుండి కదిలించి, ఒక పరిష్కారాన్ని, శాశ్వత శాంతిని కనుగొనడంలో 'పాకిస్తానీ హస్తం' ఇప్పటికీ తప్పనిసరని గుర్తించేలా ఈ దాడులు చేస్తాయని బహుశా రావల్పిండి భావిస్తూవుండొచ్చు.

అయినప్పటికీ, అంతర్గత ఒత్తిడికి మోదీ చాలా ఎక్కువగా స్పందిస్తారని స్పష్టంగా తెలుస్తుంది. 2019లో కర్తార్‌పూర్‌ సాహిబ్‌ కారిడార్‌ను బలవంతంగా ప్రారంభించిన పంజాబ్‌ మాదిరిగానే, మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు కశ్మీర్‌కు అవకాశం వస్తుంది. కశ్మీర్‌ లేదా జమ్మూ నుండి ఎన్నికైన ప్రతినిధులను ఢిల్లీ గానీ, రావల్పిండి గానీ విస్మరించలేవు. చేతిలో ఒక క్షణం ఉంటుంది. ఇది త్వరలో మళ్లీ రాకపోవచ్చు. భారతదేశం, పాకిస్తాన్‌ రెండూ ప్రయత్నించాలి, దానికి సిద్ధం కావాలి.

వ్యాసకర్త సీనియర్‌ జర్నలిస్ట్‌

సోషల్‌ మీడియా

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

హక్కు సమానమే!



మత ఆజ్ఞ ప్రకారం, తాను తింటున్నది హలాల్‌ అవునో, కాదో తెలుసుకునే హక్కు ఒక ముస్లింకు ఉంటుంది. అదే... తాను కొంటున్నది తన మత అవసరాలను తీర్చుతున్నదా, లేదా అని ఒక హిందువు చూసుకుంటే అది మతతత్వం అవుతుంది. ఎంతటి ద్వంద్వ ప్రమాణాలు!

– బల్‌బీర్‌ పుంజ్, బీజేపీ మాజీ ఎంపీ – కాలమిస్ట్‌

తాకనీయరు!



ముస్లింలు ప్రతిచోటా శాకాహార భోజనం చేస్తారు. మాంసం తింటున్నప్పుడు మాత్రమే అది హలాల్‌ అయివుండాలి. ఎందుకంటే శాకాహారం అప్పటికే హలాల్‌. దీనికి విరుద్ధంగా కొందరు (హిందూ శాకాహారులు!) తమ చెమ్చాలను కూడా వెంట తెచ్చుకొంటారు.

– దారాబా ఫారూఖీ, సినిమా రచయిత

చరిత్ర పునరావృతం?



19వ శతాబ్దంలో ఈస్ట్‌ ఇండియా కంపెనీ నల్లమందు వ్యాపారాన్ని కొనసాగించింది. దాన్నొక ఆర్థిక వరంగా చూపినప్పటికీ వాస్తవంలో అది గ్రామీణ జనాభాను దోచుకోవడానికి దారితీసింది. చరిత్ర మణిపూర్‌లో పునరావృతం అవుతోందా? కుకీ–మైతేయిల ఘర్షణకు సామాజిక–రాజకీయ కోణం ఉండొచ్చుగానీ, ఆర్థిక కోణమే రాజకీయాలను నడుపుతోంది.

– ఆర్తీ టిక్కూ సింగ్, సంపాదకురాలు

అయిపోయిందా?



ఉక్రెయిన్‌ జెండాలను సామాజిక మాధ్యమాల్లో ఎగరవేస్తున్న జనాలు నాకు ఎవరూ కనబడటం లేదు. అందరూ నిశ్శబ్దంగా వాటిని తమ పరిచయం(బయో)లోంచి తొలగించారు. ఏమైంది? ఇంకా యుద్ధం కొనసాగుతోందిగా?

– జూబీ, ర్యాపర్‌

ఇన్‌ బాక్స్‌

సుస్థిరాభివృద్ధిలో మెరుగుదల ఉన్నా...

పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, వైద్యం, లింగ అసమానతలు, ఆకలి, పరిశుభ్రత, రక్షిత మంచినీరు, పర్యావరణం లాంటి 16 లక్ష్యాలలో రాష్ట్రాల కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరు ఆధారంగా 'ఇండియా ఇండెక్స్‌ 2023– 24' పేరుతో నీతి ఆయోగ్‌ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై తన రిపోర్టుని విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారంగా 2018 నుండి భారత్‌ తన స్కోర్‌ని 57 నుండి 71 పాయింట్లకు పెంచుకున్నప్పటికీ సుస్థిరాభివృద్ధి కీలక లక్ష్యాల సాధనలో మెరుగైన ఫలితాలను సాధించటంలో వెనుకబడిందని నివేదిక స్పష్టం చేస్తోంది. పర్యావరణ విధ్వంసం జరగకుండా ప్రస్తుత తరం అవసరాలతో రాజీపడకుండా భవిష్యత్‌ తరాల అవసరాలను తీర్చగలిగే విధంగా వనరుల సామర్థ్యాన్ని కాపాడటమే సుస్థిరాభివృద్ధి. ఈ భావనను యూఎన్‌డీపీ 2015లో ప్రకటించిన తర్వాత ప్రపంచంలోని 193 దేశాలు 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాయి. సుస్థిరాభివృద్ధికి కావలసిన 16 లక్ష్యాలలో ప్రతి లక్ష్యానికి 0 (సున్నా) నుండి 100 స్కోర్‌ కేటాయిస్తారు. ఈ 16 లక్ష్యాలలో వచ్చిన స్కోర్‌ ఆధారంగా రాష్ట్రాలకి ర్యాంకులు కేటాయిస్తారు. 'అందరికీ అందుబాటులో శక్తి వనరులు' అనే లక్ష్యంలో మాత్రమే అత్యధికంగా 96 స్కోర్‌ సాధించగలిగినాం. పేదరిక నిర్మూలన, రక్షిత మంచినీరు, పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, బాధ్యతాయుతమైన వినియోగం, ఉత్పత్తిలో, నేలపై జీవుల రక్షణ, శాంతి, న్యాయం, బలమైన వ్యవస్థల విషయంలో 70 దాటి స్కోర్‌ సాధించగలిగింది. అయినప్పటికీ లింగ సమానతలో అతి తక్కువ స్కోరు (49) సాధించటం; ఆకలి నివారణ, నాణ్యమైన విద్య, అసమానతల తగ్గింపు, పరిశ్రమలు, ఆవిష్కరణలు, మౌలిక వసతుల కల్పనలో వెనకబడటం ఆందోళన కలిగించే విషయంగానే చెప్పాలి.

నీతి ఆయోగ్‌ విడుదల చేసిన నివేదిక ప్రకారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో రాష్ట్రాల స్కోర్లను చూస్తే... ఉత్తరాఖండ్, కేరళలు 79 స్కోర్‌తో మొదటి ర్యాంకు సాధించాయి. 57 స్కోర్‌తో బిహార్‌ చివరి స్థానంలో నిలబడింది. 74 స్కోర్‌తో రెండు తెలుగు రాష్ట్రాలు ఆరవ ర్యాంకులో నిలిచాయి.

'ప్రధానమంత్రి ఆవాస్‌ యోజన' కింద నాలుగు కోట్ల గృహాలను నిర్మించటం, 11 కోట్ల టాయిలెట్‌ సౌకర్యాలు కల్పించటం, 'ఉజ్వల యోజన' కింద పది కోట్ల మహిళలకు గ్యాస్‌ కనెక్షన్లు ఇవ్వటం, 'జల్‌ జీవన్‌ మిషన్‌'లో భాగంగా 15 కోట్ల గృహాలకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించటం, 30 కోట్ల మందికి 'ఆయుష్మాన్‌ భవ' వర్తింపజేయటం, 'ప్రధానమంత్రి గరీబ్‌ కల్యాణ్‌ అన్న యోజన' పథకం కింద 80 కోట్ల పేదలకు ఉచిత రేషన్‌ ఇవ్వటం వంటివాటి వలన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్‌ తన స్కోర్‌ను 57 నుండి 71కి పెంచుకోగలిగిందనేది నీతి ఆయోగ్‌ సీఈఓ బీవీఆర్‌ సుబ్రహ్మణ్యం అభిప్రాయం.

– డా।। తిరునహరి శేషు, అసిస్టెంట్‌ ప్రొఫెసర్, కాకతీయ విశ్వవిద్యాలయం । 9885475877

వర్చువల్‌ కచ్చడాలు

తూర్పు తీరం




కె.ఎన్‌. మల్లీశ్వరి

'ఒక తల్లి, ముగ్గురు డాడీలు' యూ ట్యూబ్‌ ఓపెన్‌ చెయ్యగానే ఒక చానల్‌ పెట్టిన థంబ్‌ నెయిల్‌ కనపడింది. వ్యూస్‌ పెంచుకోవడానికి యూట్యూబ్‌ చానల్స్‌తో పాటు చిన్నా పెద్ద పత్రికల డిజిటల్‌ విభాగాలు కూడా ఎన్నో ప్రయత్నాలు చేస్తాయి. 'మతి పోగొట్టే, రచ్చ రచ్చ చేసే, పడీపడీ నవ్వే, చూడగానే షాకయ్యే' ఎన్నో థంబ్‌ నెయిల్స్‌ చూస్తూనే ఉన్నాము. కానీ ఆడవాళ్ళ విషయంలో... ముఖ్యంగా పోరాట కులాల నుంచి వచ్చిన ఆడవాళ్ళ విషయంలో ఈ చూపుడు వేళ్ళు మరిన్ని వంకర్లు తిరుగుతాయి.

'ఆడదాన్ని అడ్డం పెట్టుకుని యుద్ధం చేస్తావా?' అంటుంది ఫ్యూడల్‌ సమాజం. పౌరుషమైన విషయాలు మగవారికే కనుక వారు పురుషులయ్యారు. సమాజమూ రాజకీయాలు వగైరాలన్నీ మగవారి టెరిటరీగా ఉన్నంతకాలం ఆడవాళ్ళని రాజకీయాల్లోకి లాగడం తప్పన్నది ఒక అనాగరిక విలువ. ఆ మేరకు స్త్రీలు యుద్ధాలు చేయని సుకుమారులుగా, మాటంటే బడబడా కన్నీరు కార్చే సున్నిత మనస్కులుగా తయారు చేయబడ్డారు. ఇక ఇపుడు అలా లేరు. స్త్రీలు అన్నీ మాట్లాడగలరు. ముక్కూ చెవులూ కోసి పంపినందుకు సంబరపడిన మన మొహాలకేసి జాలిగా చూసి, 'ప్రేమించడం తప్పా?' అంటుంది ఆధునిక శూర్పణఖ. 'పేడితో యుద్ధం చెయ్యనని' ఆయుధం విసర్జించిన విలువిద్యకారుని ప్రశ్నించింది శిఖండి. 'భీష్మా! నాతో పోరాడు' అని సవాల్‌ చేసినట్లు కూడా రాసింది ఒక రచయిత్రి.

స్త్రీలు తమ యుద్ధాలు తామే చేస్తున్నా వారి లైంగిక వ్యక్తిత్వం మగవారి సొత్తుగానే ఉంది. సామాజిక మాధ్యమాల విస్తృతి వల్ల ఈ స్థితి కొత్తరూపం తీసుకుంటోంది. రాజకీయ నాయకులుగా, రాజకీయ కుటుంబీకులుగా, ఉన్నతోద్యోగులుగా, కళాకారులుగా ఇంకా ఎన్నో రంగాలలో స్త్రీలు బాహాట శీలపరీక్షలకు గురవుతున్నారు. చేతిలో ఫోనో, ఛానల్‌లో ఉన్న చాలామంది అగ్నిగుండాలకి సమిధలు తయారు చేస్తున్నారు. 'ఫలానా స్త్రీ ఎవరితో శారీరక సంబంధంలో ఉందీ, ఆమె బిడ్డకి ఎంతమంది డాడీలు, ఆమెకి ఎంతమంది మగాళ్లతో సంబంధాలు ఉన్నాయి, ఆమె ఏ రోజు ఎవరితో ఏ హోటల్లో ఉందీ' వంటి లక్షోపలక్షల ప్రశ్నలు సమాజాన్ని ఉద్ధరించడం కోసం మీడియా వేస్తూ ఉంటుంది.



అంతేకాదు అటువంటి స్త్రీలకి ఎటువంటి శిక్షలు విధించాలో కూడా రచ్చబండలు, బతుకు జట్కాబండులతో పాటు పిల్లా పిచుకా యూట్యూబర్లు, పెద్ద మీడియా సంస్థలు, రాజకీయ పార్టీల డిజిటల్‌ విభాగాలు నిర్ణయిస్తాయి. 'కామాంధురాలి కళ్ళు పీకాలి', 'పరాయి మగాడితో కులికిన స్త్రీని గుడ్డలూడదీసి కొట్టాలి', 'అక్రమ సంబంధం పెట్టుకున్న ఆమెని చెట్టుకు కట్టేసి తన్నాలి' వంటి అనేక శిక్షలను సజెస్టివ్‌గా చెప్పడంతో పాటు, ఆ యా శిక్షలను అభినయించి చూపగల ధీరులు వారు. స్త్రీ పురుష శారీరక సంబంధాలు వ్యక్తిగతం. వాటిని చర్చించడానికి కొద్దిమందికి మాత్రమే హక్కు ఉంది. అటువంటి వివాదాల్లోని వ్యక్తులు, ఆ యా సంబంధాలలోని అవకాశవాదాన్ని, మోసాన్ని, హింసని గుర్తించి తీర్పు ఇచ్చే న్యాయవ్యవస్థ లేదా ఆ ఇరువురి సమ్మతంతో ప్రయత్నించే మధ్యవర్తులకి మాత్రమే ఆ హక్కు ఉంది. అంతే తప్ప ఎవరు పడితే వారు, వారి సంబంధాలలోకి తొంగి చూసి, చకచకా అడుగులు వేసి వ్యాఖ్యానించడం కుసంస్కారం. తమ రక్తం పంచుకు పుట్టినవారికే ఆస్తి ఇవ్వడం కోసం, బయలాజికల్‌ తండ్రులుగా తమ స్థితిని నిర్ధారించుకోవడం కోసం స్త్రీ మొలకు ఇనుప కచ్చడాలు బిగించి, తాళాలు వేసిన ఘనత పితృస్వామ్య సమాజానిది. ఇపుడు మీడియా, సోషల్‌ మీడియా సామాజిక, రాజకీయ రంగాలలో ఉన్న స్త్రీలకు అటువంటి వర్చువల్‌ కచ్చడాలు బిగించే ప్రయత్నం చేస్తున్నాయి.

డియర్‌ మీడియా– సోషల్‌ మీడియా! అవినీతిని వెలికి తీయడమే మీ అత్యున్నత లక్ష్యం అయినపుడు అవినీతే ప్రమాణం కావాలి తప్ప ఎవరి వ్యక్తిగతాలయినా మీకెందుకు! వేల కోట్ల సంపన్నుల మీద పెద్ద చూపు, పీడిత వర్గాల వ్యక్తిత్వం మీద చిన్నచూపుతో ఉన్న విషయానికి వంద మసాలా దినుసులు కలిపి వార్తలను వండి వడ్డించే హక్కు మీకుందా? ఒక స్త్రీ ఎంతమందితో తిరిగితే, ఎవరితో ఏ సంబంధంలో ఉంటే, ఎవరితో బిడ్డని కంటే మీకేమిటి నొప్పి? స్త్రీలుగా, పోరాట కులాల స్త్రీలుగా, పౌరులుగా, మనుషులుగా మాకు ఉండే హక్కుల పట్ల ఎలానూ అక్కర లేదు. ఏ రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేని పసిబిడ్డల పట్ల మానవ సహజమైన తడి కూడా మీకు లేదు. 'తల్లి వాస్తవం, తండ్రి నమ్మకం' అన్న నానుడి పాతదే కానీ దాని నిజార్థాన్ని, 'పిల్లలు మన ద్వారా వస్తారు తప్ప మనకోసం రారు' అన్న ఖలీల్‌ గిబ్రాన్‌ తాత్వికార్థాన్ని గ్రహించగలిగితే స్త్రీ పురుష సంబంధాల పట్ల మీ చూపు మారుతుంది. ఒక బిడ్డకు ఎంతమంది డాడీలు అంటూ చర్చ చేసిన ప్రతి మీడియా సంస్థా ఈ రోజు స్త్రీల, బాలల హక్కులను ఉల్లంఘించాయి. వ్యూస్‌ కోసం ఎంతకైనా తెగించే మిమ్మల్ని చూస్తుంటే, మా శరీరాల చుట్టూ కెమెరాలు బిగించినట్లు, రాబందుల మైకుల చప్పుడు మా తలల మీదుగా వీస్తున్నట్లు ఉంది. దయ చేసి ఆపండి!

వ్యాసకర్త కార్యదర్శి, ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక, ఏపీ

malleswari.kn2008@gmail.com

అప్రియమైన సత్యమైనా...

సత్యం బ్రూయాత్‌ ప్రియం బ్రూయాత్‌ – న బ్రూయాత్‌ సత్యమప్రియం– అని అంటుంటారు. అంటే సత్యాన్ని చెప్పాలి. ప్రియమైనదాన్ని పలుకాలి, అప్రియమైన సత్యాన్ని పలుకరాదు అని అర్థం. కానీ అత్యుత్తముడైన రామకృష్ణ పరమహంస కొన్ని సందర్భాలలో అప్రియమైన సత్యాన్నే చెప్పేవారు. కొన్ని సందర్భాలలో కఠినమైన మాటలే శ్రేయస్సును కల్గిస్తాయి.

పరమహంస ఒక రోజు సురేంద్రతో జయగోపాల్‌ సేన్‌ గురించి ఇలా చెప్పాడు– 'జయగోపాల్‌ సేన్‌ సంపన్నుడు. అతడు దాన ధర్మాలు చేయాలి... ఆ రోజు జయగోపాల్‌ ఇక్కడకు గుర్రబ్బండిలో వచ్చాడు. బండిలోని లాంతరు పగిలి పోయి ఉంది. గుర్రం శ్మశానం నుంచి తప్పించుకొని బతికి వచ్చినట్లు ఉంది. బండి తోలేవాడు అప్పుడే మెడికల్‌ కళాశాల ఆస్పత్రి నుంచి బయటపడ్డ వ్యక్తిలా ఉన్నాడు. అతడు ఇక్కడకు తీసుకొచ్చింది కుళ్లిన రెండు దానిమ్మ పళ్ళు!'

జ్యోతిర్మయం

ఒక వ్యక్తి లేనప్పుడు ఆ వ్యక్తిని గూర్చి చెడుగా మాట్లాడరాదనేది రామకృష్ణునికి తెలీకనా? ఆ వ్యక్తి ఉన్నా కపటం లేని రామకృష్ణుడు పిసినారితనం పనికి రాదనీ; గుర్రాన్నీ, బండి తోలేవాడిని కూడా ఇంకా బాగా చూసుకొమ్మని చెప్పి ఉండేవాడు. ఎదురుగా కూర్చొన్న సురేంద్రతోనే, 'నువ్వు నీ కార్యాలయంలో అబద్ధాలు చెబుతుంటావు. అలాంటప్పుడు నువ్వు సమర్పించే ఆహారాన్ని నేను ఎందుకు తింటానో తెలుసా? నువ్వు దానధర్మాలు చేస్తుంటావు కాబట్టి. నేను పిసినారులు సమర్పించే వాటిని తినలేను. వారి సొమ్ము వ్యాజ్యాలలోను, దొంగల పాలవడంలోను, వైద్యం నిమిత్తం అయ్యే ఖర్చులకూ... ఇలా పలు రకాలుగా వ్యర్థమైపోతుంది. చివరకు తప్పుదారి పట్టిన పిల్లలు ఉన్న డబ్బంతా నాశనం చేస్తారు' (పుట 233– శ్రీరామకృష్ణ లీలామృతం) అని అన్నారు. కాబట్టి ఎవరైనా మన బంధు, మిత్రులు అన్యాయంగా సంపాదిస్తూ పిల్లికి భిక్షం పెట్టకుండా ఉంటే... వారిని దానధర్మాలు చేయమని చెప్పాలి. రామకృష్ణుని జీవితం నుంచి మనం నేర్చుకొని, ఆచరించ వలసినది ఇదే!

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; **తిథి:** బ.పాడ్యమి ప.2.41 వరకు; తదుపరి విదియ, **నక్షత్రం:** శ్రవణం రా.12.58 వరకు; తదుపరి ధనిష్ఠ; **వర్జ్యం:** తె.4.46 నుండి 6.17 వరకు (తెల్లవారితే మంగళవారం); **దుర్ముహూర్తం:** ప.12.31 నుండి 1.23 వరకు, తదుపరి ప.3.06 నుండి 3.58 వరకు; **అమృత ఘడియలు:** ప.2.56 నుండి 4.24 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 5.39; **సూర్యాస్తమయం:** 6.33

క్లుప్తంగా...

శాకంబరిగా శ్రీశైలం భ్రామరి



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ఆకుకూరలు, కూరగాయలు, వివిధ రకాల ఫలాలతో శ్రీభ్రమరాంబాదేవి మూలమూర్తిని, ఉత్సవమూర్తిని, ఆలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని, గ్రామదేవత అంకాళమ్మ అమ్మవారిని అలంకరించారు. అర్చకులు, పండితులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ఉత్సవ సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపారు. శాకంబరిగా అలంకరించిన అమ్మవారి ఉత్సవమూర్తికి షోడశోపచార పూజలు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని పలు రకాల ఆకుకూరలు, కూరగాయలతో అలంకరించారు.

పూర్ణాహుతితో ముగిసిన శాకంబరీదేవి ఉత్సవాలు



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో 3 రోజులుగా నిర్వహించిన శాకంబరీదేవి ఉత్సవాలు ఆదివారం పూర్ణాహుతితో పరిసమాప్తమయ్యాయి. ఆలయ వైదిక కమిటీ సభ్యులు పర్యవేక్షణలో జరిగిన పూర్ణాహుతిలో ఈవో కేఎస్ రామారావు దంపతులు పాల్గొన్నారు. మూడో రోజు అమ్మవారిని పండ్లు, ఫలాలతో విశేషంగా అలంకరించారు. అమ్మవారికి అలంకరించిన ఆకుకూరలు, కాయగూరలతో తయారు చేసిన కదంబం ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ ఉత్సవాల్లో మొత్తం 2.20 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల చివరి రోజు పౌర్ణమి, ఆదివారానికి తోడు ఆషాఢ మాసోత్సవాల నేపథ్యంలో అమ్మవారికి సారె సమర్పించేందుకు భక్తులు భారీగా ఆలయానికి వచ్చారు.

శాస్త్రోక్తంగా జీయంగార్ల చాతుర్మాస్య దీక్ష సంకల్పం



తిరుమల: శ్రీవారి ఆలయంలో ఆదివారం తిరుమల పెద్దజీయంగారి నేతృత్వంలో చాతుర్మాస్య దీక్ష సంకల్పం జరిగింది. పెద్ద జీయర్ స్వామి మాట్లాడుతూ..శ్రీ వైష్ణవ సంప్రదాయ కర్త రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాస్య దీక్ష విశేషమైందన్నారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజున మేల్కొంటారని తెలిపారు. ఈ 4 నెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారని వివరించారు. పెద్దజీయర్ స్వామి మఠంలో కలశ స్థాపన, కలశ పూజ, విష్వక్సేనారాధన, మేదినిపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తరువాత సేకరించిన పుట్ట మన్నుకు పూజలు నిర్వహించి చాతుర్మాస్య సంకల్పం స్వీకరించారు. అనంతరం పెద్ద జీయంగారు తిరుమల బేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కన ఉన్న జీయంగారి మఠం నుంచి చిన్నజీయంగారు, ఇతర శిష్య బృందంతో బయల్దేరి వరాహస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి మంగళ వాయిద్యాలతో శ్రీవారి ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు.


ముగిసిన రొట్టెల పండుగ



రొట్టెలు ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రం నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగ ఆదివారం ముగిసింది. ఐదురోజుల పాటు లక్షలాదిమంది భక్తులు బారాషహీద్ దర్గాను సందర్శించారు. స్వర్ణాల చెరువులో కోర్కెల రొట్టెలను మార్చుకున్నారు. పండుగ ముగిసినా సోమ, మంగళవారాలు కూడా భక్తుల రద్దీ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. అందుకు తగినట్లుగా అధికార యంత్రాంగం సిబ్బందిని కొనసాగిస్తోంది.పండుగ విజయవంతానికి కృషిచేసిన అధికారులు, ఉద్యోగులకు ఆదివారం జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా రొట్టెల పండుగ నిర్వహించడానికి బారాషహీద్ ప్రాంగణంలో సీసీ కెమెరాల నిఘాతో పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. కార్పొరేషన్ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. పండుగ విజయవంతంగా జరగడానికి అందరినీ సమన్వయంతో పనిచేయించిన కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, ఎస్పీ కృష్ణకాంత్‌తో పాటు కార్పొరేషన్ అధికారులను ప్రజాప్రతినిధులు, దర్గాకమిటీ సభ్యులు, ప్రజలు అభినందించారు.

సైలెంట్ కిల్లర్‌పై హై అలెర్ట్



గుండె, కిడ్నీ, మెదడు సంబంధిత తీవ్ర అనారోగ్యాలకు దారి తీసే అవకాశం

హైపర్ టెన్షన్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

రాష్ట్ర వ్యాప్తంగా 27.15 శాతం మంది బాధితులు

సాక్షి, అమరావతి: అత్యధికశాతం గుండెపోటు మరణాలకు, మెదడు, పక్షవాతం, కిడ్నీ సంబంధిత వ్యాధులకు కారణమవుతున్న రక్తపోటును (హైపర్‌టెన్షన్) సైలెంట్ కిల్లర్‌గానూ పిలుస్తుంటారు. జీవనశైలికి సంబంధించిన ఈ సమస్య ఒకప్పుడు మధ్యవయస్సు వారు, వృద్ధుల్లో అధికంగా ఉండేది. జంక్‌ఫుడ్, శ్రమ లేని జీవనశైలి, తగినంత వ్యాయామం లేకపోవడం, ఊబకాయం, ధూమపానం, ఒత్తిడి వెరసి యువత, పిల్లలు సైతం ప్రస్తుతం ఈ సమస్య బారినపడుతున్నారు. చాప కింద నీరులా శరీరానికి ముప్పు తెచ్చిపెడుతున్న హైపర్‌టెన్షన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

27.15 శాతం మంది

రాష్ట్రంలో 1.96 కోట్ల మంది 30 ఏళ్లు పైబడిన జనాభా ఉంది. కాగా, వీరిలో 27.15 శాతం 53.39 లక్షల మంది హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్నట్లు జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే–5లో అంచనా వేశారు. కాగా, నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ సర్వేలో భాగంగా రాష్ట్రంలోని 30 ఏళ్లు పైబడిన వారందరినీ స్క్రీనింగ్ చేసిన వైద్య శాఖ ఇప్పటి వరకు 23.50 లక్షల మందిలో సమస్యను గుర్తించింది. వీరందరికీ ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ వ్యవస్థల ద్వారా క్రమం తప్పకుండా వైద్య పరీక్షల **నిర్వహణ, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.**

కళ్ల నుంచి కాళ్ల వరకూ..

పైకి ఎలాంటి లక్షణాలు లేకుండానే లోలోపల తీవ్ర అనర్థాలకు హైపర్‌టెన్షన్ దారితీస్తుంది. కళ్ల నుంచి కాళ్ల వరకు అన్ని అవయవాలను దెబ్బతీస్తుంది. అధిక రక్తపోటు మూలంగా కళ్లలోని సూక్ష్మ రక్తనాళాలు దెబ్బతిని కంటి చూపు మందగిస్తుంది. గుండె మరింత బలంగా పనిచేయాల్సి రావడంతో గుండె పరిమాణంలో మార్పులు రావచ్చని వైద్యులు చెబుతున్నారు. దీంతో శరీరానికి తగినంత రక్తం సరఫరా అవ్వక గుండె వైఫల్యంకు దారి తీస్తుంది. మెదడులోని రక్తనాళాలు దెబ్బతినడం, బలహీనపడడం, రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడి పక్షవాతం వంటి ఘటనలు సంభవిస్తాయి. మూత్రపిండాల చుట్టూ ఉండే రక్తనాళాలు దెబ్బతినడంతో రక్తాన్ని వడపోసే ప్రక్రియ అస్తవ్యస్తమై, చివరికిది కిడ్నీ వైఫల్యానికి దారితీస్తుంది.

ఏటా మే నెల 17వ తేదీన ప్రపంచ హైపర్‌టెన్షన్ డే నిర్వహిస్తారు. 2005వ సంవత్సరంలో ఇది ప్రారంభం అయింది. మనకు తెలియకుండానే మన మనసును కుంగదీసే ఈ అధిక ఒత్తిడి, దాని ద్వారా వచ్చే అధిక రక్తపోటు గురించి అవగాహన కల్పించి దానిని తరిమికొట్టడమే ఈ రోజు ముఖ్య ఉద్దేశం. కాగా 'మీ రక్తపోటును ఖచ్చితంగా కొలవండి, నియంత్రించండి, ఎక్కువ కాలం జీవించండి' అనే నినాదంతో ఈ ఏడాది హైపర్ టెన్షన్ డేను నిర్వహిస్తున్నారు.

బీపీ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఆహారంలో ఉప్పును తగ్గించాలి. నిల్వ పచ్చళ్లు ఎక్కువగా తినకూడదు. పెరుగు, మజ్జిగలో ఉప్ప కలుపుకోవడం మానేయాలి.
- శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి. ఒక కిలో బరువు తగ్గినా ఒక ఎంఎం హెచ్‌జీ రక్తపోటు తగ్గుతుంది.
- రోజు అరగంట చొప్పున శారీరక శ్రమ ఉండేలా చూసుకోవాలి. వాకింగ్, జాగింగ్, స్విమ్మింగ్, ఇతర వ్యాయామం చేస్తుండాలి.
- ధూమపానం, మద్యపానం వంటి చెడు అలవాట్లు పూర్తిగా విడనాడాలి. పొగతాగడంతో రక్తనాళాలు గట్టిపడే ప్రక్రియ ఎక్కువ అవుతుంది. అదే విధంగా మద్యపానం చేసేవారు 60 ఎంఎల్ కన్నా మించకుండా చూసుకోవాలి.



ఒత్తిడే ప్రధాన కారణం

బీపీ రెండు రకాలుగా వస్తుంది. ఒకటి వయోభారం రీత్యా, రెండోది షుగర్, థైరాయిడ్, కిడ్నీ సమస్యల కారణంగా వస్తుంది. ఈ మధ్య కాలంలో చిన్న పిల్లల్లో, యువతి, యువకుల్లోను బీపీ కేసులు నమోదు అవుతున్నాయి. ఇంటర్, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ చదివే పిల్లల్లోను ఎక్కువగా బీపీ మేం గమనిస్తున్నాం. ఇందుకు ప్రధాన కారణం ఒత్తిడి. అదే విధంగా పిజ్జా, బర్గర్, ఇతర ఫాస్ట్ ఫుడ్స్‌ను పిల్లలు, యువత ఎక్కువగా తీసుకోవడం. వీటిల్లో ఉప్పు ఎక్కువగా ఉంటోంది. ఎప్పటికప్పుడు అందరూ బీపీ చెక్ చేయించుకోవాలి.

– డాక్టర్ కె.సుధాకర్, ప్రిన్సిపాల్ సిద్ధార్థ వైద్య కళాశాల, విజయవాడ

ఏటా చెకప్ చేయించుకోవాలి

ఎటువంటి లక్షణాలు లేకున్నా బీపీ వస్తోంది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరు ఏటా రక్తపోటు చెకప్ చేయించుకోవాలి. చాపకింద నీరులా విస్తరిస్తూ ఆరోగ్యానికి తీవ్ర నష్టం చేకూరుస్తోంది. అదే విధంగా ఈసీజీ, ఎకో, ట్రెడ్‌మిల్ టెస్ట్ చేయించుకోవాలి. కొలెస్ట్రాల్ లెవల్ టెస్ట్ చేసుకోవాలి. కొలెస్ట్రాల్ గుండెపోటుకు దారితీస్తుంది. మరోవైపు ఒత్తిడిని నియంత్రించుకోవడానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా కంటి నిండా నిద్రపోవాలి.

– కె.కళ్యాణ చక్రవర్తి, జనరల్ ఫిజిషియన్, గుంటూరు

ప్రైవేటు బస్సు బోల్తా.. ఇద్దరు మృతి

- మరో 8మందికి గాయాలు
- ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలో ప్రమాదం



కుటుంబ సభ్యులతో శివయ్య (ఫైల్)



విజయలక్ష్మీబాయి మృతదేహం

మార్కాపురం: రహదారిపై గేదెలు అడ్డురావడంతో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తాపడి ఇద్దరు ప్రయాణికులు మృతిచెందారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం చింతగుంట్ల, తిప్పాయపాలెం గ్రామాల మధ్య అమరావతి–అనంతపురం హైవేపై శనివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ నుంచి అనంతపురం వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో 30మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు చింతగుంట్ల–తిప్పాయపాలెం గ్రామాల మధ్యకు రాగానే ఆకస్మికంగా గేదెలు అడ్డువచ్చాయి. వాటిని తప్పించేందుకు డ్రైవర్ ప్రయత్నించే క్రమంలో బస్సు బోల్తా పడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన గజ్జల శివయ్య(45)కు తీవ్ర గాయాలుకావడంతో ఘటనాస్థలంలోనే మృతిచెందారు. విజయవాడ నుంచి అనంతపురం వెళుతున్న పెద్దారవీడు మండలం కలనూతల గ్రామానికి చెందిన కె.విజయలక్ష్మీబాయి(40)కి తీవ్రగాయాలయ్యాయి. ఆమెకు మార్కాపురం జీజీహెచ్‌లో ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలిస్తుండగా, మార్గమధ్యంలో నరసరావుపేట వద్ద మృతిచెందారు. అదేవిధంగా ఈ ప్రమాదంలో హరినాథ్, రాజీబీ, నాగమయ్య నాయక్, ఢమరుకానంద రెడ్డి, మునీందర్‌రెడ్డి, అప్సన్, మోహిత్, దస్తగిరి అనే ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరికి మార్కాపురం జీజీహెచ్‌లో చికిత్స అందించారు. గజ్జల శివయ్యకు భార్య సువర్ణ, ఒక కుమారుడు, కుమార్తె, విజయలక్ష్మీబాయికి భర్త కాశీనాయక్, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ముగిసిన గిరి ప్రదక్షిణ

9 లక్షల మంది పాల్గొన్నట్లు అంచనా

సింహాచలం (విశాఖ జిల్లా): శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి వేంజేసిన గిరి ప్రదక్షిణ ఉత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ ఏడాది 9 లక్షల మంది గిరి ప్రదక్షిణ చేసినట్లు సింహాచలం ఆలయ వర్గాల అంచనా. శనివారం సింహాచలంలోని తొలిపావంచా నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులంతా 32 కి.మీ కొండచుట్టూ ప్రదక్షిణ చేసి సింహాచలం చేరుకున్నారు. తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి తిరుగుపయనమయ్యారు. ఆదివారం తెల్లవారుజామునుంచి వర్షం కురవడంతో భక్తులు తడుస్తూనే గిరి ప్రదక్షిణ చేశారు. 60,000 మంది సింహగిరికి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం స్వామివారి ఆలయ ప్రదక్షిణలు జరిగాయి. 5,000 మంది వరకు భక్తులు ఆలయ ప్రదక్షిణల్లో పాల్గొన్నారు.



విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ కృష్ణమోహన్ ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. దర్శనానంతరం వీరికి వేద పండితులు ఆశీర్వచనం, ఆలయాధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేష వస్త్రాలను అందజేశారు. - ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)



నిస్వార్థ సేవకు నిదర్శనం సత్యసాయి

- హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- ప్రశాంతి నిలయంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



సత్యసాయి మహాసమాధి వద్ద నివాళులర్పిస్తున్న హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు

ప్రశాంతి నిలయం: నిస్వార్థ సేవకు నిదర్శనం సత్యసాయి బాబా అని హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కొనియాడారు. ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సత్యసాయి నర సేవయే నారాయణ సేవ అన్న సందేశంతో ప్రపంచ మానవాళిని సేవా మార్గం వైపు నడిపారన్నారు. ఆయన సంకల్ప బలంతో ప్రపంచ వ్యాప్తంగా 140 దేశాలలో అభాగ్యులకు నాణ్యమైన సేవలు అందుతున్నాయని చెప్పారు. అనంతరం సత్యసాయి శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ట్రస్ట్ చేపట్టిన సత్యసాయి దివ్యాంగజన సేవా కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా వికలాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేయనున్నారు. వేడుకల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, ట్రస్ట్ సభ్యులు నాగానంద, రిహికో హిరా, డాక్టర్ మోహన్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం రాత్రి గరుడ వాహన సేవ నిర్వహించారు. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి వారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు.

- తిరుమల

శ్రీవారికి బంగారం పూత హనుమద్ వాహనం

బహూకరించిన మాజీ మంత్రి బొత్స

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల చిన వెంకన్నకు రాష్ట్ర మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఆయన సతీమణి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ బంగారపు పూతతో తయారు చేయించిన రూ.32 లక్షల విలువైన హనుమద్ వాహనాన్ని ఆదివారం బహూకరించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన బొత్స ముందుగా ఈ వాహనాన్ని స్వామివారి నిత్య కల్యాణ మండపంలో ఆలయ డీఈవో బాబూరావు, ప్రధాన అర్చకుడు పీవీఎస్ఎస్ఆర్ జగన్నాథాచార్యులకు అందజేశారు. అర్చకులు ఈ వాహనంపై శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి, ప్రత్యేక పుష్పాలంకారాలు చేసి, పూజాదికాలను నిర్వహించారు. ఆలయ గర్భాలయంలో స్వామి, అమ్మవార్లకు బొత్స కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి శ్రీవారి శేష వస్త్రాన్ని, కండువాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈవో బాబూరావు, ఏఈవోలు నటరాజారావు, మెట్టపల్లి దుర్గారావు ఆయనకు స్వామివారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.



శభాష్ '108'..



డోలీలో నిండు గర్భిణిని మోసుకొస్తున్న 108 సిబ్బంది

ఈ చిత్రంలోని డోలీలో ఉన్న వ్యక్తి నిండు గర్భిణి వంతల జెస్సికా. నెలలు నిండి పురిటినొప్పులతో బాధపడుతోంది. ఉండేది ఏఎస్ఆర్ జిల్లా అడ్డతీగలలోని మారుమూల గిరిజన ప్రాంతమైన దుశ్చర్తి పంచాయతీ డి.పోలవరంలో. భారీ వర్షాలతో ఆమెను ఆస్పత్రికి ఎలా తరలించాలో పాలుపోక ఆమె కుటుంబ సభ్యులు 108కి సమాచారమిచ్చారు. కానీ, అది డి.చోడవరం వరకు వెళ్లి అక్కడ రోడ్డుకడ్డంగా చెట్లు పడిపోయి ఉండడంతో ఆగిపోయింది. దీంతో 108 సిబ్బంది జోరు వానలో మూడు కి.మీ.ల మేర నడుచుకుంటూ వెళ్లి జెస్సికాను డోలీలో 108 వరకు మోసుకొచ్చి అక్కడ నుంచి స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి సకాలంలో తీసుకొచ్చారు. వైద్యులు ఆమెను పర్యవేక్షిస్తున్నారు. 108 సిబ్బంది అశోక్‌కుమార్, పైలట్ నవాజ్, ఆశ వర్కర్ విజయ అందరితో శభాష్ అనిపించుకున్నారు.

– అడ్డతీగల (అల్లూరి సీతారామరాజు జిల్లా)

పెళ్లి పేరుతో ఘరానా మోసం

- ఒంటరి మహిళలే లక్ష్యం
- నగలు, డబ్బు కోసం..


గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): పెళ్లి పేరుతో ఒంటరి, విడాకులు తీసుకున్న మహిళలను మోసం చేస్తున్న కేటుగాడిని విజయవాడ గవర్నర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడి మోసాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన తుమ్మా మోహన్‌రెడ్డి వ్యసనాలకు బానిసై భార్య, పిల్లలను వదిలేశాడు. ఉన్న డబ్బులన్నీ షేర్ మార్కెట్‌లో పోగొట్టుకున్నాడు. అనంతరం సులభంగా డబ్బులు సంపాదించేందుకు 'పెళ్లి కొడుకు' అవతారం ఎత్తాడు. తెలుగు మ్యాట్రిమోని, షాదీ డాట్ కామ్ తదితర వెబ్‌సైట్లలో రకరకాల పేర్లతో రిజిస్టర్ చేసుకున్నాడు. ఒంటరి మహిళలను పరిచయం చేసుకునేవాడు. మాయమాటలతో నమ్మించి.. డబ్బు, బంగారం తీసుకొని పారిపోయేవాడు. ఈ క్రమంలో తెలుగు మ్యాట్రిమోని ద్వారా విజయవాడకు చెందిన ఓ మహిళను పరిచయం చేసుకున్నాడు. తన పేరు 'కార్తీక్‌రెడ్డి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని.. విల్లాలు ఉన్నాయి' అంటూ మాయ మాటలు చెప్పాడు. పెళ్లి చేసుకుందామని ఒప్పించాడు. ఫొటోషూట్ కోసం నగలతో రావాలని సూచించాడు. ఆ ఫొటోలను తన తల్లిదండ్రులకు చూపించి పెళ్లికి ఒప్పిస్తానని ఆమెను నమ్మించాడు. దీంతో ఆమె ఈ ఏడాది ఏప్రిల్ 14న విజయవాడలోని ఓ హోటల్‌కు వెళ్లింది. ఫొటోషూట్ కోసం సిద్ధమై రావాలని ఆమెను వాష్‌రూమ్‌కు పంపించాడు. ఆమె తెచ్చిన 16 తులాల బంగారం, సెల్‌ఫోన్‌తో హోటల్ నుంచి ఉడాయించాడు. దీనిపై బాధితురాలు గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి విచారించగా.. అతని మోసాలన్నీ బయటపడ్డాయి.

మోహన్‌రెడ్డి మోసాలివే..

- 2021 సెప్టెంబర్‌లో తెలంగాణలోని రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఓ మహిళ కారును తీసుకెళ్లిపోయి అమ్మేశాడు.
- 2023 నవంబర్‌లో గుంటూరుకు చెందిన మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. రూ.7 లక్షలు తీసుకుని పారిపోయాడు.
- 2023 నవంబర్‌లో తెలంగాణలో ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి 25 తులాల బంగారం
- 2023 జనవరిలో తెలంగాణలోని మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భర్తతో విడిపోయి ఒంటరిగా ఉన్న డాక్టర్‌ను పరిచయం చేసుకుని.. ఆమె క్రెడిట్ కార్డు ద్వారా రూ.లక్షలు వాడుకుని పారిపోయాడు.

అమెరికా అధ్యక్ష రేసు నుంచి బైడెన్ ఔట్

పోటీ నుంచి వైదొలుగుతున్నానని ప్రకటన ● దేశ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయమని వెల్లడి ● కమలా హ్యారిస్ అభ్యర్థిత్వానికి మద్దతు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తాను వైదొలుగుతున్నానని డెమొక్రటిక్ పార్టీ నేత, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి (భారత కాలమాన ప్రకారం) 'ఎక్స్' ఖాతాలో ఒక లేఖను పోస్టు చేశారు. దేశ ప్రయోజనాల కోసం, తమ పార్టీ ప్రయోజనాల కోసమే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తేల్చిచెప్పారు. గత మూడున్నరేళ్లలో ఒక దేశంగా మనం గొప్ప ముందడుగు వేశామని అమెరికా ప్రజలను ఉద్దేశించి పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో అమెరికా అత్యంత శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా మారిందన్నారు. ఎన్నో ఘనతలు సాధించామని తెలిపారు. అమెరికా అధ్యక్షుడిగా ప్రజలకు ఇప్పటిదాకా సేవలందించడం అతి గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. మరోసారి పోటీ చేయాలన్న ఆలోచన లేదని, అధ్యక్షుడిగా మిగిలిన పదవీ కాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యతలపై దృష్టి పెడతానని పేర్కొన్నారు. వచ్చే వారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తానని, తన నిర్ణయాన్ని పూర్తిగా తెలియజేస్తానని వెల్లడించారు. ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌కు బైడెన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆమె అసాధారణమైన భాగస్వామి అని ప్రశంసల వర్షం కురిపించారు. అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా భారతీయ అమెరికన్ మహిళ కమలా హ్యారిస్ అభ్యర్థిత్వాన్ని బైడెన్ బలపరిచారు. ఇదిలా ఉండగా ఎన్నికల్లో ట్రంప్‌ను ఓడించటానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఎన్నికల్లో పోటీ చేయడం తథ్యమని ఇన్నాళ్లూ చెబుతూ వచ్చిన బైడెన్ అనూహ్యంగా వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో గత నెలలో జరిగిన డిబేట్‌లో బైడెన్ తడబడిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా వయసు కారణంగా మతిమరుపు సమస్యను ఎదుర్కొంటున్నారు. దీంతో ఎన్నికల పోటీ నుంచి తప్పుకోవాలంటూ బైడెన్‌పై సొంత పార్టీ నాయకులు ఒత్తిడి పెంచారు. అందుకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ముంచిన డిబేట్

సీఎన్ఎన్ ఛానల్ వేదికగా జూన్ 27న డొనాల్డ్ ట్రంప్‌- జో బైడెన్‌ల మధ్య తొలి అధ్యక్ష చర్చ జరిగింది. ఈ చర్చలో బైడెన్ పదేపదే తడబడటం, మాటల కోసం తడుముకోవడం, మతిమరుపుతో పేలవ ప్రదర్శన కనబరిచారు. దాంతో 81 ఏళ్ల బైడెన్ మానసిక ఆరోగ్యంపై అమెరికన్లలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. సొంత డెమొక్రాటిక్ పార్టీలోనూ ఆయన సామర్థ్యంపై సందేహాలు తీవ్రమయ్యాయి. ట్రంప్‌ను బైడెన్ ఓడించలేడనే బలమైన అభిప్రాయం పార్టీలో నెలకొంది. ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ... బైడెన్‌తో మాట్లాడుతూ డెమొక్రాటిక్ పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవడమే మేలని కుండబద్దలు కొట్టారు. ప్రతినిధుల సభ, సెనేట్‌లలోనూ డెమొక్రాట్లకు అపజయాలు ఎదురవుతాయని హెచ్చరించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా సైతం పలువురు డెమొక్రాటిక్ కీలక నాయకులతో ప్రైవేటు సంభాషణల్లో బైడెన్ వైదొలిగితేనే ట్రంప్‌ను ఓడించే అవకాశాలుంటాయని చెప్పారు. ఐదుగురు చట్టసభ సభ్యులు బైడెన్ వైదొలగాలని బాహటంగానే డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా డెమొక్రాటిక్ పార్టీకి విరాళాలు ఇస్తున్న దాతలు.. బైడెన్ తప్పుకోవాలని షరతు పెడుతూ విరాళాలను నిలిపివేశారు. దాంతో నాన్సీ పెలోసీ రంగంలోకి దిగి తెరవెనుక పెద్ద ఎత్తున లాబీయింగ్ చేశారు. బైడెన్ శిబిరానికి వాస్తవాన్ని తెలియజెప్పారు. అన్నివైపులా నుంచి ఒత్తిడి పెరిగిపోవడంతో కోవిడ్‌తో డెలావెర్‌లోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న బైడెన్ ఆదివారం అర్ధరాత్రి (భారత కాలమానం ప్రకారం) అధ్యక్ష రేసు నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. **- సాక్షి, నేషనల్ డెస్క్**

ఇప్పుడేంటి?

ఓపెన్ కన్వెన్షన్.. కమలకు ఛాన్స్

బైడెన్ అధ్యక్ష రేసు నుంచి వైదొలగడంతో నవంబరు 5 జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి ఎవరవుతారనే ఆసక్తి నెలకొంది. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మొగ్గ కనపడుతున్నా.. పార్టీ నిబంధనావళి ప్రకారం ఓపెన్ కన్వెన్షన్ (ఎవరైనా పోటీపడవచ్చు) జరుగుతుంది. డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకోవడానికి రాష్ట్రాల వారీగా నిర్వహించిన ప్రైమరీల్లో బైడెన్ తిరుగులేని మెజారిటీని కూడగట్టుకున్నారు. 4,000 పైచిలుకు డెలిగేట్లలో 3,900 మంది డెలిగేట్లను బైడెన్ గెల్చుకున్నారు. నిబంధనల ప్రకారం ఆగస్టులో అధ్యక్ష అభ్యర్థిని ఖరారు చేయడానికి జరిగే జాతీయ కన్వెన్షన్‌లో వీరిందరూ బైడెన్‌కు బద్ధులై ఉండాలి. ఇప్పుడాయనే స్వయంగా రేసు నుంచి వైదొలిగారు కాబట్టి.. డెమొక్రాటిక్ టికెట్ కోసం పార్టీ సభ్యులెవరైనా పోటీపడొచ్చు. దీన్నే ఓపెన్ కన్వెన్షన్ అంటారు. కమలా హారిస్‌కు అవకాశాలు మెరుగ్గా ఉన్నా.. డెమొక్రాటిక్ పార్టీలోని ముఖ్యనేతలైన కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్, మిషిగాన్ గవర్నర్ గ్రెట్చెన్ విట్మర్‌లు ఆమెకు ప్రధాన పోటీదారులుగా ఉంటారని భావిస్తున్నారు. నామినేషన్ జాబితాలో పేరు లేనప్పటికీ డెలిగేట్లు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసే వీలు కూడా ఉంది. నాలుగు వేల పైచిలుకు డెలిగేట్లు ఆగస్టులో తమ తదుపరి అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకుంటారు. తొలిరౌండ్‌లో ఫలితం తేలకపోతే 700 మంది సూపర్ డెలిగేట్లను ఓటు వేయడానికి అనుమతిస్తారు. డెమొక్రాటిక్ నామినీ ఎన్నికయ్యేదాకా ఓటింగ్ కొనసాగుతుంది. ముమ్మర లాబీయింగ్, తెరవెనుక మంత్రాంగాలు జరగడం ఖాయం. **- సాక్షి, నేషనల్ డెస్క్**

నేటి నుంచే బడ్జెట్ సమావేశాలు

- నేడు ఉభయ సభల ముందుకు సామాజిక, ఆర్థిక సర్వే
- రేపు లోక్‌సభలో బడ్జెట్
- సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించండి
- అఖిలపక్ష సమావేశంలో పార్టీలకు ప్రభుత్వం విజ్ఞప్తి
- తమ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కోరిన వైఎస్సార్‌సీపీ, జేడీ(యూ), బీజేడీ

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 12వ తేదీ వరకు 19 రోజులపాటు కొనసాగుతాయి. సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశాలు ప్రారంభం కానుండగా, తొలి రోజు పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ నియోజకవర్గం నుంచి గెలిచిన శత్రుఘ్న సిన్హా లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. అనంతరం ప్రశ్నోత్తరాలు నిర్వహిస్తారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 సామాజిక, ఆర్థిక సర్వే నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుత సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం 6 బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. జమ్మూకశ్మీర్ బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.

ఈసారి వాడీవేడిగానే చర్చలు

2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం ఓ వైపు సన్నాహాలు చేస్తుండగా, మరోవైపు వివిధ కీలక అంశాలపై కేంద్రాన్ని నిలదీసేందుకు విపక్షాలు సన్నద్ధమవుతున్నాయి. నీట్-యూజీ పేపర్ లీకేజీ, యూపీఎస్సీ పరీక్షల్లో అవకతవకలు, రైల్వే భద్రత, డిప్యూటీ స్పీకర్ పదవి, నిరుద్యోగం, అగ్నివీర్ పథకం, ఆర్థిక వ్యవస్థ, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, మణిపూర్‌లో శాంతి భద్రతలు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని నిర్ణయానికొచ్చాయి.

ప్రత్యేక హోదాపై గళం విప్పిన వైఎస్సార్‌సీపీ

కేంద్ర ప్రభుత్వం ఆదివారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, జేపీ నడ్డా నేతృత్వంలో నిర్వహించిన ఈ భేటీకి ఆర్జేడీ, జేడీయూ, బీజేడీ, టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, శివసేన తదితర 44 పార్టీల సభాపక్ష నేతలు హాజరయ్యారు. బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభల కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్ర మంత్రులు కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశాన్ని వైఎస్సార్‌సీపీ రాజ్యసభాపక్ష నేత విజయసాయిరెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ పాలనలో ప్రతిపక్ష నేతలపై దమనకాండ సాగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ జేడీ(యూ), ఒడిశాకు ప్రత్యేక హోదా కల్పించాలని బిజూ జనతాదళ్(బీజేడీ) సైతం తమ డిమాండ్లను ప్రభుత్వం ముందుంచాయి. నీట్-యూజీ పేపర్ లీకేజీ అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడేందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ తరఫున హాజరైన గౌరవ్ గొగోయ్ కోరారు. లోక్‌సభలో కాంగ్రెస్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి కట్టబెట్టాలని డిమాండ్ చేశారు.

ఆరు బిల్లులివే..

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఆరు కొత్త బిల్లులు ప్రవేశపెట్టనుంది. 90 ఏళ్ల క్రితం నాటి ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం స్థానంలో భారతీయ వాయుయాన్ విధేయక్-2024ను తీసుకొస్తోంది. విమానయాన రంగంలో సులభతర వాణిజ్యానికి పెద్దపీట వేయనున్నారు. అలాగే ఫైనాన్స్ బిల్లు, విపత్తు నిర్వహణ(సవరణ) బిల్లు, బాయిలర్స్ బిల్లు, కాఫీ(ప్రోత్సాహం, అభివృద్ధి) బిల్లు, రబ్బర్(ప్రోత్సాహం, అభివృద్ధి) బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనుంది.

హోదాపై టీడీపీ మౌనమెందుకో?: జైరాం

అఖిలపక్ష సమావేశంపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో స్పందించారు. ''రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష భేటీలో ఆంధ్రప్రదేశ్, బిహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, జేడీ(యూ) డిమాండ్ చేశాయి. విచిత్రంగా తెలుగుదేశం పార్టీ మాత్రం ఈ అంశంపై మౌనం దాల్చింది'' అని పేర్కొన్నారు.

అస్తిత్వాన్ని తాకట్టు పెట్టారు

- పిరికిపందలు, నిస్సిగ్గుగా వ్యవహరించారు
- మంత్రి పదవుల్లో రాజీపడ్డారు
- ఎన్డీఏ మిత్రపక్షాలపై మమత ధ్వజం


ర్యాలీలో పాల్గొన్న మమత, అఖిలేశ్

కోల్‌కతా: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఎక్కువకాలం కొనసాగదని, త్వరలోనే కూలిపోతుందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బెదిరించి, భయపెట్టి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మమత ఏ పార్టీ పేరు తీసుకోకపోయినప్పటికీ ఆమె పరోక్షంగా ఎన్డీఏ కీలకపక్షాలను ఉద్దేశించే పలు ఘాటు విమర్శలు చేశారు. అమరువీరుల దినోత్సవ భారీ ర్యాలీలో మమత ఆదివారం మాట్లాడారు. 'పిరికిపందలు, అత్యాశాపరులైన నాయకులు ఆర్థిక తాయిలాలకు లొంగిపోయారు. మంత్రిపదవులకు బదులుగా డబ్బు ఇస్తామనడం ఎప్పుడైనా విన్నామా? పార్టీలు డబ్బుకు అమ్ముడు పోవడం చూశామా? వాళ్లు (ఎన్డీఏ మిత్రపక్షాలు) పిరికిపందలు, సిగ్గులేని వారు. అత్యాశాపరులు. అస్తిత్వాన్ని తాకట్టు పెట్టారు' అని మమత ధ్వజమెత్తారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు ఎక్కువకాలం కొనసాగదని, మతతత్వశక్తులకు విజయం లభించినా.. ఓటమి తప్పదని అఖిలేశ్ అన్నారు.

కేరళలో నిఫా వైరస్ కలకలం.. బాలుడు మృతి

చికిత్స పొందుతున్న మరో ముగ్గురు

కేరళ: కేరళలో నిఫా వైరస్ కలకలం రేపుతోంది. నిఫా ఇన్ఫెక్షన్‌తో చికిత్స పొందుతున్న 14 ఏళ్ల బాలుడు ఆదివారం మరణించాడు. ఆదివారం ఉదయం బాలుడికి గుండెపోటు వచ్చిందని, అతడిని బతికించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని, 11.30 గంటలకు మృతి చెందాడని రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ తెలిపారు. బాలుడు చికిత్స పొందుతున్న కోజికోడ్ మెడికల్ కాలేజీలో ప్రస్తుతం ముగ్గురు వ్యక్తులు ఐసోలేషన్‌లో ఉన్నారని తెలిపారు. అయితే 246 మంది బాలుడితో కాంటాక్ట్ అయ్యారని, వారిలో 63 మంది హై-రిస్క్ కేటగిరీ కింద ఉన్నారని తెలిపింది. నిఫా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేరళకు తమ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది.

గ్రీన్‌విచ్ కంటే ముందే మనకో కాలమానం!

న్యూఢిల్లీ: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీఈఆర్టీ) ఆరో తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పుస్తకంలో పలు మార్పులు చేసింది. గ్రీన్‌విచ్ కాలమానం కంటే ముందే మన దేశానికి సొంత కాలమానం ఉందని, దీనిని 'మధ్య రేఖ' అని పిలుస్తారని పేర్కొంది. బీఆర్ అంబేద్కర్ అనుభవాలను, ఎదుర్కొన్న కుల వివక్ష పాఠాన్ని కూడా కుదించింది. హరప్పా నాగరికతను కొత్త పాఠ్య పుస్తకంలో 'సింధు-సరస్వతి'గా పేర్కొంది. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా పాఠశాల విద్య కోసం కొత్త జాతీయ పాఠ్యప్రణాళిక ఫ్రేమ్ వర్క్-2023కు అనుగుణంగా ఎన్సీఈఆర్టీ కొత్త సిలబస్‌ను సిద్ధం చేస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో 6వ తరగతి సాంఘిక శాస్త్ర పుస్తకంలో పలు మార్పులు చేసింది. గ్రీన్‌విచ్ కాలమానమే ప్రధాన కాలమానం కాదని, దానికంటే శతాబ్దాల ముందు యూరప్, భారత్‌లకు సొంత కాలమానాలున్నాయని పేర్కొంది. దానిని మధ్య రేఖ (మిడిల్ లైన్) అని పిలిచేవారని, అది ఖగోళ శాస్త్రానికి ప్రసిద్ధి చెందిన ఉజ్జయినీ నగరం (ఉజ్జయిన్) గుండా వెళ్లిందని వివరించింది. అలాగే కొత్త పాఠ్యపుస్తకంలో 'భారత నాగరికత ప్రారంభం' అనే అధ్యాయంలో సరస్వతి నదికి ప్రముఖ స్థానం ఉందని, ప్రజలను వర్ణాలుగా విభజించారని, శూద్రులను, స్త్రీలను వేదాలను అధ్యయనం చేయనీయలేదని పాత పాఠ్య పుస్తకంలో ఉండగా.. వ్యవసాయదారుడు, నేత, కుమ్మరి, బిల్డర్, వడ్రంగి, వైద్యుడు, నర్తకి, మంగలి, పూజారివంటి వృత్తులను వేదాల్లో పేర్కొన్నట్లు కొత్త పుస్తకాల్లో పేర్కొంది. పాత పుస్తకంలోని నాలుగు అధ్యాయాల్లో ఉన్న చాణక్యుడి అర్థశాస్త్రం, గుప్తులు, పల్లవులు, చాళుక్యుల రాజవంశాలు, అశోకుడు చంద్రగుప్త మౌర్యుల రాజ్యాల కథనాలను కొత్త పుస్తకంలో తొలగించింది.

బంగ్లాదేశ్‌లో కోటా కట్

- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- 56 శాతం ఉన్న రిజర్వేషన్లు 7 శాతానికి తగ్గింపు
- స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు 5 శాతమే
- 30 శాతం నుంచి భారీగా కుదింపు
- వెనుకబడిన జిల్లాల ప్రజలు, మహిళలకు రిజర్వేషన్లు రద్దు
- న్యాయస్థానం స్పష్టీకరణ.. విద్యార్థులకు పాక్షిక విజయం

ఢాకా: బంగ్లాదేశ్‌ను అగ్నిగుండంగా మార్చిన రిజర్వేషన్ల వివాదానికి ముగింపు పలికే దిశగా సుప్రీంకోర్టు ఆదివారం సంచలనాత్మక తీర్పు వెలువరించింది. 1971లో బంగ్లా విముక్తి ఉద్యమంలో పాల్గొన్నవారి వారసులకు, కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇప్పటిదాకా కల్పిస్తున్న 30 శాతం కోటాలో భారీగా కోత విధించింది. కేవలం 5 శాతానికి పరిమితం చేసింది. వెనుకబడిన జిల్లాల ప్రజలకు, మహిళలకు 10 శాతం చొప్పున రిజర్వేషన్లు అమల్లో ఉండగా, న్యాయస్థానం వాటిని రద్దు చేసింది. గిరిజనులు/మైనార్టీలకు కల్పిస్తున్న 5 శాతం రిజర్వేషన్లను ఒక శాతానికి తగ్గించింది. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు అమల్లో ఉన్న ఒక శాతం రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు చేయలేదు. మొత్తంగా 56 శాతం ఉన్న కోటాను ఏకంగా 7 శాతానికి కుదించడం గమనార్హం. 93 శాతం ప్రభుత్వ ఉద్యోగాలను కేవలం ప్రతిభ ఆధారంగానే భర్తీ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్లు పూర్తిగా రద్దు చేసి, ప్రతిభావంతులకే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా తీవ్రంగా పోరాడుతున్న విద్యార్థులకు పాక్షిక విజయమే దక్కినట్లయ్యింది.

రిజర్వేషన్లకు షేక్ హసీనా అనుకూలం

ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో అధికారంలో ఉన్న అవామీ లీగ్ పార్టీ బంగ్లా విముక్తి ఉద్యమానికి సారథ్యం వహించింది. సహజంగానే ఆ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటా విధానంతో లబ్ధి చేకూరుతోంది. ఈ రిజర్వేషన్లను ప్రధానమంత్రి షేక్ హసీనా పరోక్షంగా సమర్థిస్తున్నారు. సొంత దేశం కోసం పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో త్యాగాలు చేసిన సమరయోధుల కుటుంబాలకు సమున్నత గౌరవం ఇవ్వాలని ఆమె వాదిస్తున్నారు. అయితే, ఇది పూర్తిగా వివక్షతో కూడిన విధానమని విద్యార్థులు మండిపడుతున్నారు. రిజర్వేషన్లు పూర్తిగా పక్కనపెట్టి, కేవలం ప్రతిభ ఆధారంగా నియామకాలు చేపట్టాలని పట్టుబడుతున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు క్రమంగా తగ్గిపోతుండడం, అందుబాటులో ఉన్న కొద్దిపాటి ఉద్యోగాలు రిజర్వేషన్ల పేరిట కొన్ని కుటుంబాలకే దక్కుతుండడం, తమకు అన్యాయం జరుగుతుండడంతో విద్యార్థుల్లో అసహనం మొదలైంది. అదే చివరకు రిజర్వేషన్ల వ్యతిరేక పోరాటంగా మారింది. ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) సైతం విద్యార్థులకు అండగా నిలిచింది.


ఢాకాలోని ప్రధాన రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

ఎందుకీ ఆందోళనలు?

1971లో జరిగిన బంగ్లాదేశ్ విముక్తి ఉద్యమంలో వేలాది మంది పాల్గొన్నారు. ఆస్తులు పోగొట్టుకున్నారు. ప్రాణత్యాగాలు సైతం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వారి కుటుంబాలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రిజర్వేషన్ల విధానం తీసుకొచ్చింది. విముక్తి ఉద్యమంలో భాగస్వాములైన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లు కల్పించింది. 2018లో ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. దేశవ్యాప్తంగా అలజడి సృష్టించారు. దాంతో అప్పటి ప్రభుత్వం దిగివచ్చింది. రిజర్వేషన్లను నిలిపివేసింది. స్వాతంత్ర్య సమరయోధుల బంధువుల విజ్ఞప్తి మేరకు రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ ఈ ఏడాది జూన్‌లో బంగ్లాదేశ్ హైకోర్టు తీర్పు ప్రకటించడంతో విద్యార్థులు మళ్లీ భగ్గుమన్నారు. రిజర్వేషన్లు వెంటనే రద్దు చేయాలంటూ పోరుబాట పట్టారు. వీధుల్లోకి వచ్చి పోలీసులతో ఘర్షణకు దిగారు. ఈ నేపథ్యంలో షేక్ హసీనా ప్రభుత్వంలో కలవరం మొదలైంది. ఘర్షణల్లో విద్యార్థులు మరణిస్తుండడం, శాంతి భద్రతలు అదుపు తప్పుతుండడంతో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రిజర్వేషన్లపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు రిజర్వేషన్లు పూర్తిగా రద్దు చేయకుండా, అన్ని రకాల రిజర్వేషన్లను 7 శాతానికి పరిమితం చేస్తూ తీర్పు వెల్లడించింది. ఇందులో 5 శాతం బంగ్లా స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు, 2 శాతం ఇతరులకు కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది.


బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లు (శాతాల్లో)

	గతంలో	ఇప్పుడు
సమరయోధుల కుటుంబాలకు	30	5
వెనుకబడిన జిల్లాల ప్రజలకు	10	-
మహిళలకు	10	-
గిరిజనులు/మైనార్టీలకు	5	1
దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు	1	1

ఆందోళనలు ఆపేదిలేదన్న విద్యార్థులు

తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేవరకూ ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థి సంఘాల నేతలు తేల్చిచెప్పారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని, హింసకు కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత బంగ్లాదేశ్‌లో పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది. కర్ఫ్యూ నిబంధనలను ఇంకా సడలించలేదు. కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించలేదు. ఈ ఘటనలో మృతిచెందినవారు 150కి చేరినట్లు సమాచారం. ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. ప్రజలు బయటకు రావొద్దని సూచించింది.

వారసత్వ సంపదతో మెరుగైన ప్రపంచం



న్యూఢిల్లీ: పూర్వీకుల నుంచి వచ్చిన ఘనమైన వారసత్వం అనేది కేవలం ఒక చరిత్ర కాదని, అదొక శాస్త్రం, వివిధ వర్గాల ప్రజలను కలిపే వారధి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. మరింత మెరుగైన ప్రపంచాన్ని సృష్టించడానికి వారసత్వ సంపదను ఉపయోగించుకోవాలని సూచించారు. శనివారం ఢిల్లీలోని భారత్ మండపంలో 46వ వరల్డ్ హెరిటేజ్ కమిటీ(డబ్ల్యూహెచ్‌సీ) సదస్సు ప్రారంభోత్సవంలో మోదీ ప్రసంగించారు. చరిత్రాత్మక కట్టడాలు వారసత్వంగా వస్తుంటాయని, వాటిని చూసినప్పుడు అప్పటి కాలంలోకి వెళ్తామని ఉద్ఘాటించారు. ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయం, తమిళనాడులోని బృహదీశ్వరాలయం ఘనమైన వారసత్వానికి ప్రతీక అని కొనియాడారు. ప్రపంచంలో అత్యంత ప్రాచీన నాగరికతను నిలయమైన మన దేశంలో ఈ సదస్సు జరుగుతుండడం ఆనందంగా ఉందన్నారు. యునెస్కో ఆధ్వర్యంలో జరుగుతున్న డబ్ల్యూహెచ్‌సీ సదస్సుకు భారత్ తొలిసారిగా ఆతిథ్యం ఇస్తోంది. ఈ నెల 31 దాకా ఈ సదస్సు జరుగనుంది. యునెస్కో డైరెక్టర్ జనరల్ ఆడ్రీ అజౌలే, కేంద్ర మంత్రులు ఎస్.జైశంకర్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌ను జైల్లోనే చంపేందుకు బీజేపీ కుట్ర: ఆప్



న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను జైలులోనే చంపేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. జూన్ 3-జూలై 7వ తేదీల మధ్య కేజ్రీవాల్ షుగర్ స్థాయిలు 26 రెట్లు పడిపోయినట్లు ఆరోగ్య నివేదికలు స్పష్టం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాలు కేజ్రీవాల్ జీవితంతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. కేజ్రీవాల్‌కు ఏ క్షణమైనా ప్రమాదం జరగొచ్చని అధికారిక నివేదికలే చెబుతున్నాయన్నారు. కేజ్రీవాల్ ఆరోగ్యంపై బీజేపీ, ఎల్జీ పదే పదే వెలువరిస్తున్న తప్పుడు నివేదికలు, చేస్తున్న తప్పుడు వ్యాఖ్యలు ఈ అనుమానాలను బలపరుస్తున్నాయన్నారు. 'కేజ్రీవాల్ పూరీలు, స్వీట్లు తదితరాలను అతిగా తింటున్నారని, అవసరం లేకున్నా ఇన్సులిన్ అడుగుతున్నారని వీరే గతంలో ఆరోపించారు. కోర్టు జోక్యంతో ఎయిమ్స్ వైద్యులు పరీక్షలు జరిపి ఆయనకు ఇన్సులిన్ ఇచ్చారు. ఇప్పుడేమో కేజ్రీవాల్ వైద్యులు సూచించిన మోతాదు కంటే తక్కువగా తింటున్నారని, అందుకే షుగర్ లెవెల్స్ పడిపోయాయని అంటున్నారు'అని సంజయ్ సింగ్ వివరించారు. దీని వెనుక కేజ్రీవాల్ ప్రాణాలు తీసేలా భారీ కుట్ర ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

ప్రధానిగా ఓలి రెండేళ్లు.. దేవ్‌బా ఒకటిన్నరేళ్లు

నేపాల్ సంకీర్ణంలోని ప్రధాన పార్టీల మధ్య ఒప్పందం



కఠ్మాండు: నేపాల్‌లో కొత్తగా ప్రధాని కేపీ శర్మ ఓలి సారథ్యంలో ఏర్పాటైన సంకీర్ణ ప్రభుత్వంలో ప్రధాన పార్టీల మధ్య అధికార పంపిణీ ఒప్పందం ఖరారైంది. దీని ప్రకారం కేపీ శర్మ ఓలి ప్రధానిగా రెండేళ్లు కొనసాగుతారు, ఆ తర్వాత మిగతా ఏడాదిన్నర కాలంలో నేపాలీ కాంగ్రెస్(ఎన్‌సీ) చీఫ్ షేర్ బహదూర్ దేవ్‌బా ప్రధానిగా పగ్గాలు చేపడతారు. ఈ మేరకు తమ మధ్య కీలకమైన ఏడు అంశాలపై అంగీకారం కుదిరినట్లు నేపాల్- యూనిఫైడ్ మార్కిస్ట్-లెనినిస్ట్(సీపీఎన్-యూఎంఎల్) చీఫ్, ప్రధాని ఓలి ఆదివారం పార్లమెంట్‌లో వెల్లడించారు. దీంతో, సంకీర్ణ ప్రభుత్వంలోని కీలక భాగస్వామ్యపక్షాలైన ఎన్‌సీ, సీపీఎన్-యూఎంఎల్‌ల మధ్య కుదిరిన రహస్య ఒప్పందంపై వస్తున్న అనేక ఊహాగానాలకు ఆయన చెక్ పెట్టినట్లయింది. పార్లమెంట్‌లో బల నిరూపణలో విఫలమైన ప్రచండ స్థానంలో గత వారం ఓలి ప్రధానిగా ప్రమాణం చేయడం తెల్సిందే. దీంతో, ఆదివారం ఓలి పార్లమెంట్ దిగువ సభలో ప్రవేశపెట్టిన విశ్వాసతీర్మానానికి అనుకూలంగా 188 ఓట్లు, వ్యతిరేకంగా 74 ఓట్లు పడ్డాయి. దీంతో, ఓలి ప్రభుత్వం సభ విశ్వాసాన్ని పొందినట్లు స్పీకర్ దేవ్ రాజ్ ఘిమిరే ప్రకటించారు.

రాహుల్‌కి ఊమెన్ చాందీ అవార్డు



తిరువనంతపురం: దివంగత కేరళ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత 'ఊమెన్ చాందీ పబ్లిక్ సర్వెంట్'మొట్టమొదటి అవార్డుకు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఎంపికయ్యారు. అవార్డు కింద రాహుల్‌కు రూ.లక్ష నగదుతోపాటు ప్రముఖ సినీ నిర్మాత నెమొమ్ పుష్పరాజ్ రూపొందించిన శిల్పాన్ని అందజేస్తారు. భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజల కష్టాలను విని, వాటికి పరిష్కారాలు కనుగొన్న జాతీయ నేత రాహుల్ గాంధీ అని ఎంపిక కమిటీ పేర్కొంది. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ సారథ్యంలోని కమిటీ ఈ అవార్డుకు ఎంపిక చేస్తుంది. మూడు రోజుల క్రితమే ఊమెన్ చాందీ మూడో వర్ధంతి జరిగింది.

యూజీసీ-నెట్‌కు..మళ్లీ పరీక్ష వద్దు

న్యూఢిల్లీ: యూజీసీ- నెట్ పరీక్షను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. జూన్ 18న యూజీసీ-నెట్‌ను నిర్వహించగా.. పరీక్షల సమగ్రతకు భంగం కలిగి ఉండొచ్చనే సమాచారంతో కేంద్రం 19న పరీక్షను రద్దు చేసింది. కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. లీకేజీ ఆరోపణలపై సీబీఐ విచారణ ముగిసే దాకా పునఃపరీక్షను నిర్వహించవద్దని, ఆ మేరకు స్టే ఇవ్వాలని పిటిషనర్ కోరారు. సీబీఐ విచారణ పూర్తికాక ముందే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) యూజీసీ-నెట్‌ను మళ్లీ నిర్వహించడానికి ఆగస్టులో కొత్త తేదీలను ప్రకటించడం సరికాదని పిటిషనర్ విన్నవించారు. ఈ పిటిషన్ సోమవారం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చే అవకాశముంది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ ప్రధానం, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం, పీహెచ్‌డీల్లో ప్రవేశాల కొరకు యూజీసీ- నెట్‌ను అర్హత పరీక్షగా నిర్వహిస్తారు.

యూపీ, ఉత్తరాఖండ్..మధ్యప్రదేశ్..!

భోపాల్/ముజఫర్‌నగర్: హోటల్ యజమానులు తమ పేర్లు, ఫోన్ నంబర్లను కూడా బోర్డులపై ప్రదర్శించాలంటూ ఇచ్చిన ఆదేశాలపై ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల్లోని బీజేపీ ప్రభుత్వాలు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న వేళ.. బీజేపీకే చెందిన మధ్యప్రదేశ్‌లోని మోహన్ యాదవ్ ప్రభుత్వం దాదాపు ఇలాంటి ఉత్తర్వులనే తాజాగా జారీ చేసింది. దీని ప్రకారం..ప్రముఖ పుణ్యక్షేత్రం ఉజ్జయినిలోని దుకాణదారులంతా తమ దుకాణాల వెలుపల పేర్లు, ఫోన్ నంబర్లను ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ మేరకు బీజేపీ పాలిత ఉజ్జయిని మున్సిపల్ కౌన్సిల్ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. పేరు, ఫోన్ నంబర్ ప్రదర్శించని దుకాణదారులు మొదటి విడతగా అయితే రూ.2 వేలు, రెండో విడతగా రూ.5 వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

ఆ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి

కువర్ యాత్రా మార్గంలో ఉన్న హోటళ్ల వారంతా యజమానుల పేర్లను ప్రదర్శించాలంటూ యూపీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకునేందుకు సమయం ఉందని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మిత్రపక్షం ఆర్ఎల్‌డీ పేర్కొంది. ఆ పార్టీ నేత జయంత్ చౌదరి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ..ఆ యాత్రా మార్గం ఏ ఒక్క కులానికో, మతానికో చెందింది కాదన్నారు. ఈ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని, లేదా సడలించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాగా, కువర్ యాత్ర మార్గంలోని హోటళ్ల యజమానులంతా తమ పేర్లను ప్రదర్శించాలన్న యూపీ ప్రభుత్వ ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై నేడు సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం : 22 : జూలై : 2024

పడవ ప్రయాణం



కావేరి నదిలో నీటి ప్రవాహం పెరగడంతో నదీ పరివాహం లోని లోతట్టు గ్రామాల మధ్య రాకపోకలకు ఆటంకాలు తప్పడం లేదు. ఈక్రమంలో మేట్టూరు పరిధిలోని కొలత్తూరు పన్నవాడి తీరం నుంచి ధర్మపురి జిల్లా పెన్నాగరం, పెన్నయూరు, ఎబియూరు, నాగమలై గ్రామాల మధ్య రాకపోకలకు ఆదివారం అధికారులు పడవలను ఏర్పాటు చేశారు. - సేలం

న్యూస్‌రీల్

రాయపేటలో మెట్రో టన్నెల్ తవ్వకం పనులు

• ప్రారంభించిన మంత్రి ఉదయనిధి స్టాలిన్

కొరుక్కుపేట: రాయపేటలో మెట్రో రైలు సొరంగం తవ్వకం పనులను మంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభించారు. ఈ పనులను నిర్ణీత వ్యవధిలో క్రమక్రమంగా పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎం.సుబ్రహ్మణ్యం, ఎంపీ దయానిధి మారన్, కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ చైర్మన్, జోనల్ కమిటీ, ప్రత్యేక ప్రాజెక్టుల శాఖ కార్యదర్శి తారాస్ అహ్మద్, చెన్నై మెట్రో రైల్ కార్పొరేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్చున పాల్గొన్నారు.

గ్రూప్- 2కు 7.90 లక్షల దరఖాస్తులు

సాక్షి, చెన్నై : రాష్ట్ర ప్రభుత్వంలోని గ్రూప్ 2, గ్రూప్ 2ఏ పోస్టుల కోసం 7.90 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రితో దరఖాస్తుల ప్ర క్రియను టీఎన్‌పీఎస్సీ అధికారులు ముగించారు. రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి గత నెల 20న టీఎన్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ వేదికగా దరఖాస్తులను ఆహ్వానించారు. గ్రూప్ -2కు సంబంధించిన అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, జూనియర్ ఎంప్లాయ్ మెంట్ ఆఫీసర్, కరప్షన్ అండ్ మానిటరింగ్ స్పెషల్ అసిస్టెంట్ ఆఫీసర్ల పోస్టులు 507తో పాటు ప్రభుత్వ పరిధిలోని 48 విభాగాలలోని గ్రూప్ 2ఏకు సంబంధించి మరో 1,820 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారు. ఈనెల 19వ తేదీ చివరి గడువుగా నిర్ణయించినా, సాంకేతిక సమస్యలతో ఒక రోజు పొడిగించారు. శనివారం అర్ధరాత్రితో దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియను ఆన్‌లైన్ వేదికగా ముగించారు. మొత్తం ఉన్న 2,327 పోస్టులకు గాను 7.90 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి సెప్టెంబర్ 14వ తేదీ పరీక్ష జరగనుంది.

ఏడేళ్లలో 9,630 మంది చిన్నారుల రక్షింపు

• దక్షిణ రైల్వే అధికారుల సమాచారం

అన్నానగర్: 2018 నుంచి మే 2024 మధ్య దక్షిణ రైల్వేలోని రైల్వే స్టేషన్ల నుంచి 9,630 మంది చిన్నారులను రైల్వే భద్రతా బలగాలు రక్షించాయి. ఈ మేరకు దక్షిణ రైల్వే అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. తల్లిదండ్రులపై కోపం, నగరం చుట్టి చూడాలనే కోరిక, పేదరికం, ఇతర కారణాల వల్ల అబ్బాయిలు, అమ్మాయిలు తమ ఇళ్లను వదిలి చెన్నై సెంట్రల్, ఎగ్మోర్ సహా ఇతర రైల్వే స్టేషన్లలకు వస్తున్నట్లు పేర్కొన్నారు. వీరందరినీ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సహకారంతో రైల్వే సిబ్బంది రక్షించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు వివరించారు.

'నిఫా' అలర్ట్

సాక్షి, చెన్నై: నిఫా వైరస్ కేరళలో వెలుగు చూడడంతో తమిళనాడు సరిహద్దు జిల్లాల్లో ఆరోగ్య అధికారులు అలర్ట్ చేశారు. నిఫా వైరస్ కేరళలో వెలుగు చూడడం, ఓ బాలుడు మరణించిన సమాచారంతో రాష్ట్ర ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. తమిళనాడు - కేరళ సరిహద్దుల్లోని సెంగోట్టై, తేని, పొల్లాచ్చి, కోయంబత్తూరు, నీలగిరి జిల్లాలోని గ్రామాల మీద దృష్టి పెట్టారు. ఇక్కడి చెక్ పోస్టులలో సిబ్బందిని అప్రమత్తం చేశారు. వైద్య బృందాలు రంగంలోకి దిగాయి. కేరళ నుంచి తమిళనాడు లోకి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీలు చేసినానంతరం అనుమతించనున్నారు. వాహనాలపై క్రిమ సంహారక మందులను స్ప్రే చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఎవరైనా జ్వరం బారిన పడి రాష్ట్రంలోకి వస్తుంటే వెంటనే గుర్తించి వైద్య పరీక్షలు చేసినానంతరం అనుమతించే విధంగా చర్యలు చేపట్టారు.

బైకును ఢీకొన్న కారు

• దంపతుల దుర్మరణం
• నలుగురికి తీవ్ర గాయాలు

అన్నానగర్: నామక్కల్ జిల్లా పరమతివేలూరు సమీపంలోని మరవరపాళయం కుడిత్తేరు ప్రాంతానికి చెందిన చిన్నయ్యన్(70). ఇతని భార్య శాంతి (60). వీరిద్దరు ఆదివారం ఉదయం మరవరపాళయం నుంచి బైకులో పరమతి వేలూరుకు బయలుదేరారు. ఆ సమయంలో కరూర్ నుంచి నామక్కల్ వైపు వచ్చిన కారు వీరి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నయ్యన్, శాంతి ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన కారు రోడ్డు పక్కన ఉన్న గుంతలో బోల్తా పడింది. దీంతో కారులోని నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు నామక్కల్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రిలో మాజీ మంత్రి 'సెంథిల్' బాలాజీ

సాక్షి, చెన్నై: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ అనారోగ్యం బారిన పడ్డారు. ఆయన్ని ఆదివారం సాయంత్రం పుళల్ జైలు నుంచి స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. క్యాష్ ఫర్ జాబ్స్ ఆరోపణలతో మనీలాండరింగ్ కేసులో సెంథిల్ బాలాజీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేసిన విషయం తెలిసిందే. బైపాస్ సర్జరీ అనంతరం పుళల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఆయన ఉన్నారు. మంత్రి పదవి దూరం కావడంతో ఎమ్మెల్యేగా కటకటాలలో ఉంటూ వస్తున్న సెంథిల్ బాలాజీ ఆదివారం అనారోగ్యం బారినపడ్డారు. ఆయన్ని హుటాహుటిన జైలు సిబ్బంది చికిత్స నిమిత్తం ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మరో 20 నెలల్లో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాలకు డీఎంకే పదును పెట్టింది. టార్గెట్ 2026 అసెంబ్లీ ఎన్నికలు నినాదంతో కార్యక్రమాలను విస్తృతం చేయడానికి ప్రత్యేక కమిటీని డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ రంగంలోకి దించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ప్రస్తుతం సమన్వయ కమిటీని ప్రకటించారు.

సీఎం స్టాలిన్‌తో మంత్రులు, నేతలు



టార్గెట్ 2026

• మళ్లీ అధికారమే లక్ష్యం
• వ్యూహాలకు డీఎంకే పదును
• రంగంలోకి ప్రత్యేక కమిటీలు
• తాజాగా సమన్వయ కమిటీ ఏర్పాటు

సాక్షి, చెన్నై: ఏప్రిల్ 2021లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి బ్రహ్మాండ విజయాన్ని కైవసం చేసుకుంది. ఇందులో డీఎంకే 133 స్థానాలలో గెలిచి సంపూర్ణ మెజారిటీతో ప్రభుత్వాన్ని దక్కించుకుంది. పదేళ్ల తమకు అధికారం అన్నది దూరమైనా, తమ అధినేత కరుణానిధి దివంగతులైన తర్వాత ఎదుర్కొన్న ఈ ఎన్నికలలో గెలుపు డీఎంకే సేనలకు పండుగ రోజే అన్నట్లుగా పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమయంలో కరోనా రెండో వేవ్ రాష్ట్రంలో తాండవం చేసిన సంక్లిష్ట పరిస్థితులు ఉండడంతో మే 7వ తేదీన రాజ్ భవన్ వేదికగా నిరాడంబరంగా స్టాలిన్ ప్రమాణ స్వీకారం చేశారు. అధికారంలోకి రాగానే తీవ్ర ఆర్థిక కష్టాలు ఎదురైనా వాటన్నింటినీ అధిగమించి, కాల క్రమేనా ఎన్నికల వాగ్దానాలను ఒకటి తర్వాత మరొకటి విజయవంతం అమలు చేయడంలో స్టాలిన్ సఫలీకృతులయ్యారు. డీఎంకే ప్రభుత్వ పథకాలలో మహిళలకు ఉచిత బస్సు సేవ, బడులలో అల్పాహార పథకం, గృహిణులకు కలైంజ్ఞర్ మగళిర్ ఉరిమై తిట్టం పేరిట నెలకు రూ.1000 నగదు పంపిణీ, ఉన్నత చదువులను అభ్యసించే విద్యార్థినులకు నెలకు రూ. 1000, విద్యార్థులకు సైతం ఈ ఏడాది ఆగస్టు నుంచి ఈ నగదు సాయం వర్తింపు వంటి పథకాలు దేశానికే ఆదర్శమయ్యేలా తీర్చిదిద్దారు. ఎన్నో ఒడి దొడుగులు, విపత్తులు ఎదురైనా, కేంద్రం నుంచి సహకారం కొరవడినా, ఏ మాత్రం తగ్గకుండా ప్రజాహితాన్ని కాంక్షిస్తూ, అన్ని పథకాలను అమలు చేస్తూ, అన్ని శాఖలనూ బలోపేతం చేస్తూ, పెట్టుబడులను విస్తృతంగా ఆహ్వానించడమే కాకుండా, అనేక రంగాలలో జాతీయ స్థాయిలో తొలి మూడు స్థానాలలో తమిళనాడును నిలబెట్టడంలో సఫలీకృతులయ్యారు. 13 విభాగాలలో తమిళనాడు ప్రభుత్వం ముందంజలో దూసుకెళుతున్నట్లు నీతి ఆయోగ్ సైతం ప్రశంసించింది. ఇందుకు ప్రతిఫలంగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలోనూ క్లీన్ స్వీప్‌తో తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇదే ఊపుతో ముమ్ముందు రానున్న స్థానిక సంస్థలు, నగర పాలక సంస్థల ఎన్నికల్లోనూ క్లీన్ స్వీప్ నినాదం అందుకుని దూసుకెళ్తున్నారు. అదే సమయంలో 2026 అసెంబ్లీ ఎన్నికలలో మళ్లీ అధికారమే లక్ష్యంగా ఇప్పటి నుంచి వ్యూహాలకు స్టాలిన్ పదును పెట్టడం విశేషం.

రంగంలోకి సమన్వయ కమిటీ

2024 లోక్‌సభ ఎన్నికలకు ముందుగా స్టాలిన్ ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతూ ప్రత్యేక కమిటీలను ప్రకటించారు. ఈ కమిటీలు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పార్టీకి ఇచ్చిన సూచనలు, సలహాలు,



సమావేశానికి ముందు కరుణానిధి చిత్ర పటానికి సమన్వయ కమిటీ నివాళి

కొత్త అంశాలను అస్త్రంగా చేసుకుని లోక్‌సభ ఎన్నికలలో క్లీన్‌స్వీప్‌ను అందుకున్నారు. ఇదే తరహాలో 2026 అసెంబ్లీ ఎన్నికలలో 200లకు పైగా స్థానాల కైవసమే లక్ష్యంగా ఇప్పటి నుంచి వ్యూహాలకు డీఎంకే పదును పెట్టింది. పార్టీ పరంగా కార్యక్రమాలను విస్తృతం చేయడమే కాకుండా, ప్రజలలోకి ప్రభుత్వ పథకాలను మరింత దరిచేర్చేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో ప్రజలతో మమేకమై వారు ఆశిస్తున్న కొత్త పథకాలు, వారికి కావాల్సిన మరిన్ని సౌకర్యాలు, పథకాలు తదితర వాటిని అధ్యయనం చేయడమే కాకుండా, పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపడమే లక్ష్యంగా, అందరినీ కలుపుకుని కార్యక్రమాలను వేగవంతం చేసే దిశగా వివిధ కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రస్తుతం సమన్వయ కమిటీని స్టాలిన్ రంగంలోకి దించారు. శనివారం రాత్రి ఈ కమిటీని స్టాలిన్ ప్రకటించారు. 2026 అసెంబ్లీ ఎన్నిలకు ముందుగా పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయడం, పర్యవేక్షించడమే లక్ష్యంగా సమన్వయ కమిటీ దూసుకెళ్తుందని వివరించారు. సంస్థాగతంగా పార్టీలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, మార్పులు, చేర్పులు, నిర్వహణ పరంగా చేపట్టాల్సిన ప్రక్షాలన తదితర అంశాలతో పాటు కేడర్ అభిప్రాయాలతో పార్టీ అధిష్టానానికి పలు సూచనలు సలహాలు ఇచ్చి వాటిని అమలు చేసే దిశగా సమన్వయ కమిటీ ముందుకు సాగనున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీలో సీనియర్ మంత్రులు కేఎన్ నెహ్రూ, ఏవీ వేలు, తంగం తెన్నరసు, తన వారసుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్, సీనియర్‌నేత ఆర్‌ఎస్‌భారతీని స్టాలిన్ నియమించారు. ఈ కమిటీ లోని మంత్రులు, నేతలు పలువురు ఆదివారం ఉదయాన్నే పార్టీ అధ్యక్షుడు, సీఎం స్టాలిన్‌ను కలిశారు. వీరితో సమావేశమై పలు సూచనలు, సలహాలను స్టాలిన్ ఇచ్చారు. సాయంత్రం తేనాంపేటలోని డీఎంకే కార్యాలయంలో ఈ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో తమ కార్యాచరణ గురించి చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు ఈ కమిటీ తన కార్యక్రమాలను విస్తృతం చేసే విధంగా జిల్లా, నగర , పట్టణ స్థాయిలో రాష్ట్రంలో పర్యటించనుంది.

నేటి నుంచి రిజర్వ్‌డ్ సీట్ల భర్తీ

• ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు సన్నద్ధం



సాక్షి, చెన్నై: రాష్ట్రంలో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ వేదికగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు రిజర్వ్‌డ్ కోటా సీట్ల భర్తీ జరగనుంది. 29వ తేదీ నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు జనరల్ కోటా సీట్ల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. వివరాలు.. రాష్ట్రంలో సుమారు 400లకు పైగా ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్న విషయం తెలిసిందే. ఇందులోని 1.75 లక్షల ప్రభుత్వ కోటా ఇంజినీరింగ్ సీట్లను సాంకేతిక విద్యా డైరెక్టరేట్ భర్తీ చేస్తోంది. మే 6వ తేదీ నుంచి ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ వేదికగా దరఖాస్తులు స్వీకరించారు. గత నెల 13 నుంచి 30వ తేదీ వరకు విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. ఈనెల 10వ తేదీన టాపర్ల జాబితాతో పాటుగా కౌన్సెలింగ్‌కు అర్హత సాధించిన ర్యాంకర్ల జాబితాను ప్రకటించారు.

ఈ పరిస్థితుల్లో సోమ, మంగళవారం రిజర్వ్‌డ్ కోటా సీట్ల భర్తీ జరగనుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు 7.5 శాతం స్థానిక కోటా సీట్లు, ప్రత్యేక ప్రతిభావంతులు, మాజీ సైనికుల పిల్లలు క్రీడా కోటా సీట్లను భర్తీ చేయనున్నారు. ఈనెల 25 నుంచి 27వ వరకు ప్రత్యేక ప్రతిభావంతులు, మాజీ సైనికుల పిల్లలు, క్రీడా కోటా రిజర్వేషన్ జనరల్ కోటా సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ ఉంటుంది. ఈనెల 29వ తేదీ నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు జనరల్ కోటా సీట్ల భర్తీ జరగనుంది. కాగా కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నారు. ఇందుకోసం సాంకేతిక విద్యా డైరెక్టరేట్ సర్వం సిద్ధం చేసింది.

బడ్జెట్ ఆశలు

• నిధుల కోసం కేంద్రానికి సీఎం విజ్ఞప్తి



సీఎం ఎంకే స్టాలిన్

సాక్షి, చెన్నై: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించబోయే బడ్జెట్ మీద తమిళనాడు ఎదురు చూపులు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ అయితే, కొన్ని పథకాలకు నిధులు వస్తాయనే ఆశలతో ఎదురు చూస్తోంది. ఇందుకు అనుగుణంగా సీఎం స్టాలిన్ అనేక పథకాలను ఎత్తిచూపుతూ వీటికి నిధులను కేటాయించండి అని ఆర్థికశాఖ మంత్రికి ఎక్స్ పేజీ ట్వీట్ రూపంలో ఆదివారం వివరించారు. వివరాలు.. మూడవ సారి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పూర్తిస్థాయిలో వార్షిక బడ్జెట్ దాఖలుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సిద్ధమవుతున్నారు. మంగళవారం పార్లమెంట్‌లో ఈ బడ్జెట్ దాఖలు చేయనున్నారు. ఇందులో తమిళనాడుకు ప్రత్యేక కేటాయింపులు జరిగేనా? అన్న ఎదురు చూపులు పెరిగాయి. అదే సమయంలో గత మూడేళ్ల తరహాలోనే మొండిచేయి చూపిస్తారా? అన్న చర్చ జోరందుకుంది. ఈ పరిస్థితుల్లో తమిళనాడులో అమలులో ఉన్న కేంద్ర పథకాలను గుర్తు చేస్తూ, నిధుల వివరాలతో ఆర్థిక మంత్రికి ఎక్స్ పేజీలో ట్వీట్ రూపంలో సీఎం స్టాలిన్ అన్ని అంశాలను తెలియజేశారు. ఇందులో 2024 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం సమర్పించనున్న బడ్జెట్‌లో తమిళనాడు ప్రజల ఆశలను నెరవేర్చే విధంగా ఉండాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. చెన్నైలో జరుగుతున్న మెట్రో రైలు ప్రాజెక్టు పనులను గుర్తు చేస్తూ, గత మూడేళ్లలో మెట్రో పనులకు కేంద్రం నుంచి నిధులు విడుదల కాలేదన్న విషయాన్ని ప్రస్తావించారు. తాంబరం - చెంగల్పట్టు మధ్య వంతెన మార్గం ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్ట్‌కు ఆమోదం పడేనా? అని ఎదురు చూస్తున్నట్లు వివరించారు. ఆదాయ పన్ను భారం తగ్గుతుందా? అని ఎదురు చూస్తున్న మధ్య తరగతి కుటుంబాలకు, ఉద్యోగుల మీద ఇకనైనా కరుణ చూపించేనా? అని ప్రశ్నించారు. కోయంబత్తూర్, మదురై మెట్రో రైలు ప్రాజెక్టులకు ఆమోదం తెలపాలని, తమిళనాడులో ఇప్పటికే గుర్తించిన కొత్త రైల్వే ప్రాజెక్టుల సత్వర అమలుకు తగిన నిధులు కేటాయించాలని కోరారు. గ్రామీణ, పట్టణ గృహ నిర్మాణ పథకం అమలుకు నిమిత్తం ఖర్చు పరిమితిని పెంచడం, తమిళనాడు ప్రజల అంచనాలు, ఎదురు చూపులకు అనుగునంగా కేంద్ర బడ్జెట్‌లో నిధులను సంవృద్ధిగా కేటాయిస్తారని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

2026లో అధికారంలో వాటా తప్పదు

• కార్తీ చిదంబరం వ్యాఖ్య

సాక్షి, చెన్నై : 2026 అసెంబ్లీ ఎన్నికల తర్వాత తమిళనాడులో ఏర్పడే ప్రభుత్వంలో తమిళనాడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో భాగస్వామ్యం తప్పని సరిగా ఆశిస్తుందని ఆ పార్టీ ఎంపీ కార్తీ చిదంబరం వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను మాజీ ఎంపీ తిరునావుక్కరసర్ సమర్థించారు. శివగంగైలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తమిళనాడులో కూటమిగా ఎన్నికలను ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రస్తావించారు. డీఎంకే కూటమి కొనసాగుతుందని పేర్కొంటూ, 2026 అసెంబ్లీ ఎన్నికలలో అధికార పగ్గాలు డీఎంకే చేపట్టగానే అధికారంలో భాగస్వామ్యాన్ని ఈసారి తప్పని సరిగా కోరుతామని, ఆదిశగా ముందుకెళ్తామని వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ వ్యాఖ్యలను మాజీ ఎంపీ తిరునావుక్కరసర్ సమర్థించారు. ఇందులో తప్పేమీ లేదన్నారు. కాగా కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను డీఎంకే వర్గాలు నిశితంగానే పరిశీలిస్తున్నాయి.

'డిప్యూటీ'పై జోరందుకున్న చర్చ

• ఆ పదవి ఇస్తే ఎవరైనా వద్దంటారా?
• దురైమురుగన్ వ్యాఖ్య



దురై మురుగన్

సాక్షి, చెన్నై: డిప్యూటీ సీఎం రేసులో తాను ఉన్నట్లు జరుగుతున్న చర్చకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా ఆదివారం డీఎంకే సీనియర్ నేత, మంత్రి దురై మురుగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. డిప్యూటీ సీఎం పదవి ఇస్తే ఎవరైనా వద్దంటారా? అంటూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం డీఎంకేలో కొత్త చర్చకు దారి తీశాయి. వివరాలు.. త్వరలో మంత్రి వర్గంలో మార్పులు జరగనున్నట్లు, తన వారసుడు ఉదయనిధి స్టాలిన్‌కు డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టేందుకు సీఎం స్టాలిన్ సిద్ధమయ్యారనే సమాచారం గత రెండు మూడు రోజులుగా రాష్ట్ర సచివాలయంతో పాటు డీఎంకే కార్యాలయ వర్గాల్లో హల్ చల్ చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. అయితే తనకు డిప్యూటీ సీఎం పదవ అనే ప్రచారం వదంతే అని శనివారం జరిగిన కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ స్పష్టంచేశారు. తనకు ఎలాంటి పదవి దక్కినా, అత్యంత కీలకం డీఎంకే యువజన విభాగం చీఫ్ అని వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో డిప్యూటీ సీఎం రేసులో డీఎంకే సీనియర్ నేత దురై మురుగన్ ఉన్నట్లుగా ప్రచారం ఊపందుకుంది. డీఎంకేలో అన్నా, కరుణానిధి, స్టాలిన్ వంటి మూడు తరాల నేతల వద్ద దురై మురుగన్ పనిచేస్తున్నారు. నాలుగో తరం కూడా తాను సేవలు అందించేందుకు సిద్ధం అన్నట్టుగా ఆయన పయనం ఉంటోంది. డీఎంకేలో, మంత్రి వర్గంలో సీనియర్‌గా, పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న దురై మురుగన్ ఆదివారం అరక్కోణం సమీపంలో జరిగిన కార్యక్రమంలో మీడియా ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. డిప్యూటీ సీఎం పదవి గురించి ప్రశ్నించగా, ఆ పదవి ఇస్తే ఎవరైనా వద్దంటారా? అంటూ తనపై వస్తున్న చర్చలకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా వ్యాఖ్యలు చేశారు. అలాగే ఈ పదవి అనేది వ్యక్తిగత నిర్ణయంతో సంబంధం ఉండదని, దీని కోసం పార్టీలో చర్చించాలని, నిర్వాహకుల అభిప్రాయాలు స్వీకరించాలని, అందరూ కలిసి కట్టుగా నిర్ణయం తీసుకున్న తర్వాతే, అధ్యక్షుడు స్టాలిన్ ఓ అభిప్రాయానికి వచ్చే అవకాశం ఉందని అన్నారు.

ముమ్మరంగా రౌడీల వేట

• పొరుగు రాష్ట్రాలకు పరుగు
• పుదుచ్చేరిలోనూ జల్లెడ పట్టిన పోలీసులు





రౌడీల వేటలో పోలీసుల తనిఖీ, ఆమ్‌స్ట్రాంగ్ సమాధి వద్ద కుటుంబ సభ్యులు, బౌద్ధ గురువుల నివాళి

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో రౌడీల ఏరి వేతలో పోలీసులు దూకుడు పెంచారు. ఎన్‌కౌంటర్ భయంతో రౌడీలు పొరుగు రాష్ట్రాలకు పరుగులు తీసి తలదాచుకునే పనిలో పడ్డారు. పుదుచ్చేరిలో అధిక శాతం మంది తలదాచుకున్న సమాచారంతో అక్కడి పోలీసులు జల్లెడ పట్టే పనిలో పడ్డారు. బీఎస్పీ నేత ఆమ్ స్ట్రాంగ్ హత్య తదుపరి రాష్ట్రంలోని రౌడీలు, కిరాయి ముఠాల ఏరి వేత దిశగా పోలీసులు దూకుడు పెంచిన విషయం తెలిసిందే. అదే సమయంలో పుదుకోట్టై, చెన్నైలలో ఇద్దరు రౌడీల ఎన్‌కౌంటర్ జరగడం, 10 మందికి పైగా రౌడీలకు కాళ్లు చేతులు విరిగిన స్థితిలో ఆస్పత్రిలో చేర్పించడం వంటి పరిణామాలు ఇతర రౌడీలు, దాదాలలో భయాన్ని రేకెత్తించినట్లున్నాయి. దీంతో కొందరు పుదుచ్చేరి, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని సరిహద్దు జిల్లాల్లోకి చొరబడి తలదాచుకుని ఉన్నట్టుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో వీరి కోసం ఆయా రాష్ట్రాల సరిహద్దుల్లోని జిల్లాల పోలీసుల సాయంతో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి కటకటాలలోకి నెట్టే దిశగా తమిళ పోలీసులు కార్యాచరణలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో పెద్దసంఖ్యలో కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరికి చేరుకున్న తమిళ రౌడీలకు అక్కడి రౌడీలు శనివారం రాత్రి ఓ ఫాం హౌస్‌లో పార్టీ ఏర్పాటు చేయడం వెలుగులోకి వచ్చింది. దీంతో పుదుచ్చేరి పోలీసులు ఆదివారం ఉదయం నుంచి జల్లెడ పట్టే పనిలో పడ్డారు. అయితే, హోటళ్లు ఫామ్ హౌస్‌లను ఖాళీ చేసిన రౌడీలు, దాదాలు, వారి అనుచరులు జాలర్ల గ్రామాలోని రౌడీలతో కలిసి చేపల వేట పేరిట సముద్రంలోకి వెళ్లి ఉండవచ్చనే అనుమానాలు నెలకొన్నాయి.

ఆమ్‌స్ట్రాంగ్‌కు నివాళి

బీఎస్పీ నేత ఆమ్ స్ట్రాంగ్ హత్యకు గురై 16 రోజులైంది. వారి కుటుంబ సంప్రదాయపరంగా 16వ రోజు కర్మక్రియలను చెన్నై శివారులోని పొత్తూరు గ్రామంలోని ఆయన సమాధి వద్ద నిర్వహించారు. బౌద్ధ మత గురువులు అనేక మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. బీఎస్పీ నేతలు, ఆమ్‌స్ట్రాంగ్ సతీమణి పొర్కొడి, ఇతర కుటుంబ సభ్యులు సమాధి వద్ద నివాళులర్పించారు. సినీ రంగానికి చెందిన దర్శకుడు పా రంజిత్, గాయకుడు గానా బాల తదితరులు పాల్గొని కన్నీటి నివాళులర్పించారు. ఇదిలా ఉండగా ఈ కేసును విచారిస్తున్న పోలీసులు మరి కొంతమంది కీలక రౌడీలను గురి పెట్టారు. ఇప్పటికే శంభోసెంథిల్ కోసం గాలిస్తూ రాగా, ప్రస్తుతం బాంబు శరవణన్ కోసం వేట మొదలెట్టారు.

తిరువళ్లూరు సమీపంలోని కూవంనదిలో పడేసిన ఆరుసెల్‌ఫోన్లను బయటకు తీసిన పోలీసులు అందులోని సమాచారాన్ని సేకరించారు. మరో నాలుగు సెల్‌ఫోన్ల కోసం గాలింపు జరుగుతోంది. ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అధికంగా బీజేపీ, అన్నాడీఎంకే, తమిళ మానిల కాంగ్రెస్‌కు చెందిన వారు పట్టుబడడంతో ఆయా పార్టీల నేతలు అలర్ట్ అయ్యారు. నేర చరిత కలిగిన ద్వితీయ, కిందిస్థాయి నాయకులను గుర్తించి పార్టీ నుంచి సాగనంపే పనిలో ప్రధానంగా బీజేపీ నిమగ్నమైనట్లుగా సమాచారం వెలువడింది. ఈ కేసులో డీఎండీకే ప్రముఖుడి హస్తం ఉన్నట్లు వచ్చిన సమాచారంతో ఆ నేత ఎవరో అన్న చర్చ ప్రస్తుతం ఊపందుకుంది.

గోవిందా..గోవిందా..!



రథోత్సవ వైభవం

• పులకించిన మేలూరు

సాక్షి, చెన్నై: గోవిందా..గోవిందా.. నామస్మరణతో మదురై జిల్లా మేలూరు పరిసరాలు పులకించాయి. కళ్లలగర్ స్వామి రథోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగాయి. మదురై జిల్లా మేలూరులో కళ్లలగర్ స్వామి వారి ఆలయం ఉన్న విషయం తెలిసిందే. ఈ ఆలయం, మదురైలోని మీనాక్షి అమ్మవారి ఆలయ ఉత్సవాలకు మధ్య సంబంధాలు ఉన్నాయి. చిత్తిరై మాసంలో ఈ రెండు ఆలయాలలో మదురై మీనాక్షి అమ్మవారి కల్యాణ మహోత్సవ ఉత్సవం, కళ్లలగర్ స్వామి వైగై నదీ ప్రవేశం అద్వితీయంగా జరిగాయి. ఈ ఉత్సవాల అనంతరం కళ్లలగర్ స్వామి వారి ఆలయంలో ఆడి మాసం పెరుం విలా(పెద్ద పండుగ)గా ఉత్సవాలు ఈనెల 13వ తేదీ నుంచి జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి రథోత్సవం కనులు పండువగా జరిగింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని పునీతులయ్యారు. వేకువ జాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. సర్వాలంకారంతో స్వామి వారిని రథంపై అధిష్టింప చేశారు. గోవింద నామ స్మరణ మార్మోగగా మేలూరులోని కళ్లలగర్ స్వామి వారి ఆలయ మాడ వీధులలో రథోత్సవం వైభవంగా జరిగింది. వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

చెన్నై
సోమవారం ၊ 22 ၊ జూలై ၊ 2024
సాక్షి

క్లుప్తంగా

గంజాయి కేసులో అన్నాడీఎంకే నేత అరెస్టు

తిరువొత్తియూరు: నాగై జిల్లా మేళపిడగైలో కొద్ది రోజుల క్రితం 3 కార్లలో 200 కిలోల గంజాయిని శ్రీలంకకు తీసుకొచ్చిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద జరిపిన విచారణలో వేదారణ్యం కొడియక్కుడి ప్రాంతానికి చెందిన అరివళన్ గంజాయి స్మగ్లింగ్ కేసులో సంబంధం వున్నట్టు తెలిసింది. దీంతో పోలీసులు అరివళగన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా అతడు అన్నాడీఎంకే సభ్యుడు అని, వేదారణ్యం పంచాయతీ యూనియన్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలికకు లైంగిక వేధింపులు

• యువకుడిపై పోక్సో కేసు



విజయకుమార్ (ఫైల్)

తిరుత్తణి: తిరువళ్లూరు జిల్లా కావేరిరాజపురం గ్రామానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలిక స్నానం చేస్తుండగా తన సెల్‌ఫోన్‌లో అదే గ్రామానికి చెందిన విజయకుమార్(28) ఫొటోలు తీసినట్లు బాధితులు మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ మలర్ కేసు నమోదు చేసి విజయకుమార్‌ను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు.

కోళ్లఫారం గోడ కూలి ఇద్దరు మృతి

తిరువొత్తియూరు: కోవై జిల్లా జమీన్ కొట్టంపట్టి ప్రాంతానికి చెందిన మురుగానందం (45) రైతు. ఇతనికి గంగంపాలెంలో ఉన్న కులయంగాడు ప్రాంతంలో వ్యవసాయ పొలం ఉంది. ఇక్కడ ఇతను కొబ్బరి నార్లను ఎండబెట్టి వాటిని తాళ్లను చేసే పనులు చేస్తుంటారు. ఇందుకోసం ఇక్కడ ఉత్తరాది రాష్ట్రానికి చెందిన ముగ్గురు కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. మురుగానందం తోటలోని ఓ భాగంలో పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన కోళ్ల ఫారం ఉంది. గత కొన్ని రోజులుగా ఆనైమలై ప్రాంతంలో కురిసిన భారీ వర్షం కారణంగా కోళ్ల ఫారంలో పైకప్పు దెబ్బతింది. ఈ క్రమంలో శనివారం ఆ కోళ్ల ఫారం పైకప్పు కూల్చి వేత పనులు చేస్తున్నారు. ఆ సమయంలో హఠాత్తుగా కోళ్ల ఫారం 12 అడుగుల ఎత్తు కలిగిన గోడ మురుగానందం, ఉత్తరాధి మహిళా కూలీ మమత (30)పై పడింది. వీరిద్దరూ అదే చోట మృతి చెందారు. పైగా మురుగానందం భార్య రేవతి సహా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రిలో చేర్చి పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గిరివలయం రోడ్డు కిటకిట

వేలూరు: తమిళ ఆడి మాస పౌర్ణమిని పురస్కరించుకుని తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ గిరివలయం రోడ్డు భక్తులతో కిటకిటలాడింది. పంచభూత స్థలమైన అరుణాచలేశ్వరాలయంలో ప్రతి నెలా పౌర్ణమి రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గిరివలయం రోడ్డులోని 14 కిలో మీటరు దూరం నడిచి వెళ్లి స్వామి వారిని దర్శించుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా పౌర్ణమి శనివారం సాయంత్రం 6.05 గంటలకు ప్రారంభమై ఆదివారం సాయంత్రం 4.48 గంటలకు ముగియడంతో కార్తీక దీపం తరహాలోనే భక్తులు అధిక సంఖ్యలో వస్తారని ఆలయ అధికారులు ఆలయంలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లును సిద్ధం చేశారు. అదేవిధంగా ఆలయంలోని అన్నామలైయార్ సమేద ఉన్నామలై అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి పుష్పాలంకరణ చేశారు. ఇదిలా ఉండగా పౌర్ణమి సమయంలో 14 కిలోమీటరు దూరంలో ఉన్న గిరివలయం రోడ్డులో కాలి నడకన వచ్చి స్వామి వారిని దర్శించుకుంటే విశేష పుణ్యఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం. అందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తిరువణ్ణామలై చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో తరలి రావడంతో తిరువణ్ణామలైలో శనివారం రాత్రి గిరివలయం రోడ్డులో ఎటు చూసినా రద్దీ నెలకొంది. అదేవిధంగా భక్తులు ఆలయంలోనూ బారులుదీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వార్ల మాడ వీధుల్లో ఊరేగించడంతో భక్తులు అధిక సంఖ్యలో కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఇదిలా ఉండగా ఈనెల చిత్తూరు, తిరుపతి, తిరుమల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులను తిరువణ్ణామలైకి నడపడంతో ఆంధ్ర రాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు.



ఆలయ మాడ వీధుల్లో భక్తుల సందడి

వైభవంగా లక్ష పసుపు కొమ్ముల పూజ

కొరుక్కుపేట: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా వి502ఏ ఆధ్వర్యంలో గురు పూర్ణిమ సందర్భంగా వసుదైవ కుటుంబకం – త్రివేణి సంగమం పేరుతో ఆదివారం స్థానిక ఆళ్వార్ పేటలోని యతీరాజ్ కల్యాణ మండపంలో లోక కల్యాణం కోసం లక్ష పసుపు కొమ్ములు పూజ, శ్రీ సత్యనారాయణ వ్రతం, వైశ్య వ్యాపార్ 2024 కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. జిల్లా గవర్నర్ ఓలేటి రేష్మీ సునీల్, క్యాబినెట్ సెక్రటరీ ఎం.లావణ్య, క్యాబినెట్ ట్రెజరర్ అచ్చా ఆనంద్ దంపతుల పర్యవేక్షణలో వాసవీ క్లబ్‌ల తరపున తొలిసారిగా ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటలు వరకు విరామం లేకుండా సాగిన ఈ కార్యక్రమం వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కావడం విశేషం. ఈ పూజల్లో 40కి పైగా వాసవీ క్లబ్ ల నిర్వాహకులు, సభ్యులు భక్తిశ్రద్ధలతో పాల్గొని పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న 500 మందికి పైగా ముత్తయిదువులకు చీరలు, ఒడిబియ్యం పసుపు కుంకుమలు, వాసవీ అమ్మవారి ఫోటోలు, ప్రసాదాలను నిర్వాహకులు పంపిణీ చేశారు. జిల్లా గవర్నర్ ఓలేటి రేష్మి మాట్లాడుతూ వాసవీ క్లబ్‌ల నిర్వాహకులు, సభ్యులు, పలువురు దాతల సహకారంతో లక్ష పసుపు కొమ్ములు పూజ, సత్యనారాయణ వ్రతం, వైశ్య బజార్ కార్యక్రమాలను రాజధాని నగరంలో తొలిసారగా విశ్వశాంతిని కాంక్షిస్తూ విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.



వండర్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికేట్‌తో నిర్వాహకులు

కుక్కను ఢీకొని బైక్ బోల్తా

• ఇద్దరు దుర్మరణం

కొరుక్కుపేట: కుక్క అడ్డుగా పరుగెత్తడంతో బైక్ బోల్తా పడి ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. తెన్‌కాశి జిల్లా పులియంగుడి ప్రాంతానికి చెందిన సాహుల్ హమీద్ (53). అతని బామర్ది మహ్మద్ దివాన్ (38). ఇద్దరూ సౌదీ అరేబియాలో పనిచేస్తున్నారు. సాకుల్ కంటి సమస్య ఉండడంతో దాని చికిత్స కోసం ఇద్దరూ ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. తిరునేల్వేల్లిలో ఉన్న కంటి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం సాహుల్ హమీద్, దివాన్‌తో కలిసి బైక్‌పై బయలుదేరాడు. సాహుల్ బైక్ నడిపాడు. నెల్లై పక్కనే ఉన్న రామయ్యన్‌పట్టి శివాజీ నగర్ సమీపంలోకి వెళ్లగా ఒక్కసారిగా కుక్క అడ్డురావడంతో బైక్ బోల్తా ఇద్దరూ మృతి చెందారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎస్ఎంఈలకు మెండుగా అవకాశాలు



అశుతోష్ చౌదరిని సత్కరిస్తున్న శివకుమార్ ఈశ్వరన్

సాక్షి, చెన్నై: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు తమిళనాడు మెండుగా అవకాశాలు ఉన్నాయని ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశుతోష్ చౌదరి తెలిపారు. టీఎస్–5వ పారిశ్రామిక విప్లవం వైపు అన్న అంశంపై ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) తమిళనాడు రాష్ట్ర కౌన్సిల్ నేతృత్వంలో చెన్నైలో ఆదివారం బీఎఫ్ఎస్ఐ సదస్సు – 2024 జరిగింది. తమిళనాడు టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ సర్వీసెస్, ఆటోమొబైల్, ఆటోమోటివ్ ఉత్పత్తులకు కేంద్రంగా తమిళనాడు అవతరించిందని ఈ సందర్భంగా సదస్సులో అశుతోష్ చౌదరి ప్రసంగిస్తూ వివరించారు. రాష్ట్ర పారిశ్రామిక విధానం 2021 ప్రకారం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) కూడా పెద్దసంఖ్యలో రాష్ట్రంలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇండియన్ బ్యాంక్–కార్పొరేట్ ఇండిపెండెంట్ డైరెక్టర్, మాజీ ఛైర్మన్ సుందర రాజన్ మాట్లాడుతూ తమిళనాడులో అత్యధిక ఫ్యాక్టరీలు ఉన్నాయని, ఇందులో 60 శాతం పట్టణాలలో ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పారిశ్రామిక కారిడార్ ప్రాజెక్టుల విస్తృతమయ్యాయని వివరించారు. ఈ సదస్సులో ఐసీసీ తమిళనాడు స్టేట్ కౌన్సిల్ ఛైర్మన్ రిపబ్లిక్ ఆఫ్ ఆర్మేనియా కాన్సుల్ జనరల్ శివకుమార్ ఈశ్వరన్ మాట్లాడుతూ, ఒక దేశానికి మంచి బ్యాంకింగ్ వ్యవస్థ అవసరం అని, ఇదే దేశానికి వెన్నెముకగా పేర్కొంటూ, జాతీయ బ్యాంకులు దేశాల విజయానికి ఎంతో దోహదపడ్డాయని వివరించారు. ఈ సదస్సులో బీఎఫ్ఎస్ఐ కమిటీ ఛైర్మన్ ఆర్ శ్రీనివాసన్, బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ మోహన్ పాల్గొన్నారు.

వేడుకగా గురు పౌర్ణమి

తిరుత్తణి: గురు పౌర్ణమి సందర్భంగా కేజీ.కండ్రిగ షిర్డీ సాయి మందిర్‌లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామికి మహాదీపారాధన, పాలాభిషేకం చేశారు. ఇందులో తిరుత్తణి, పళ్లిపట్టు, ఆర్కేపేట పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని బాబాను దర్శించుకున్నారు. సాయంత్రం సంధ్యహారతి, రాత్రి దీపారాధన చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదం, అన్నదానం పంపిణీ చేశారు. సాయంత్రం భక్తి కచ్చేరి చేపట్టారు. ఆలయ ఛైర్మన్ సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ వేడుకల నిర్వహించారు.



విశేష అలంకరణలో షిర్డీ సాయిబాబా

ఐఓసీ మరో మైలు రాయి 'స్ట్రోమ్ ఎక్స్‌ని'

సేలం: ఇండియన్ ఆటో రేసింగ్ చాంపియన్‌షిప్ సందర్భంగా ఇండియన్ ఆయిల్ చెన్నై ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో రేసింగ్ కార్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన హై–ఆక్టేన్ రేసింగ్ ఇంధనం స్ట్రోమ్‌ఎక్స్‌ని విడుదల చేసింది. భారతదేశంలో మోటార్ స్పోర్ట్స్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ఉద్దేశించిన మద్రాస్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఒక ఒప్పందంపై సంతకం చేసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ డైరెక్టర్ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) అలోక్ శర్మ, మద్రాస్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ప్రెసిడెంట్ అజిత్ థామస్, సెక్రటరీ ప్రభాశంకర్, వైస్ ప్రెసిడెంట్ విక్కీ చందోక్ తదితరులు పాల్గొన్నారు. ఇండియన్ ఆయిల్ డైరెక్టర్ (కమర్షియల్) వి. సతీష్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి స్ట్రోమ్ ఎక్స్‌ని బ్రాండ్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐఓసీ మరో మైలు రాయి స్ట్రోమ్ ఎక్స్‌ని అని అభిప్రాయపడ్డారు. తమ కస్టమర్ల విభిన్న అవసరాలను తీర్చేందుకు అధిక నాణ్యత గల ఇంధనం, లూబ్రికెంట్లను అందించడంలో తాము ముందున్నామన్నారు. చాలా మందిలో మనమే మొదటి స్థానంలో ఉండడం గమనార్హమన్నారు. స్ట్రోమ్ ఎక్స్ ప్రయోగం మోటార్ స్పోర్ట్స్‌పై ఇండియన్ ఆయిల్ నిబద్ధతను పునరుద్ఘాటించిందని ఆయన పేర్కొన్నారు.



'స్ట్రోమ్ ఎక్స్‌ని' బ్రాండ్ లోగోను ఆవిష్కరిస్తున్న ఐఓసీ డైరెక్టర్ సతీష్ కుమార్

బంధాలకు ప్రాధాన్యం ఇచ్చే చిత్రాలు అవసరం

తమిళ సినిమా: వాస్తవ సంఘటనలతో కూడిన చిత్రాలు అరుదుగా వస్తుంటాయి అలా తాజాగా రూపొందిన చిత్రం వీరాయి మక్కళ్. ఏ వైట్ స్క్రీన్ ఫిలిమ్స్ పతాకంపై ఎస్ సురేష్ నందా నిర్మించి, కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి నాగరాజ్ కరుప్పయ్య దర్శకత్వం వహించారు. వేల రామ్మూర్తి ప్రధాన పాత్రను పోషించిన ఈ చిత్రంలో నటి దీప శంకర్, మారి ముత్తు, సురేష్ నందా, నందన, రామ్, సెంథిల్ కుమారి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. శ్రీనివాసన్ ఛాయా గ్రహణం, దీపన్ చక్రవర్తి సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణం కార్యక్రమాలను పూర్తి చేసుకొని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు ఇందులో పాటు దర్శకుడు పేరరసు, రామ్ సంగయ్య, దర్శకుడు గోకుల్ తదితర సినీ ప్రముఖులు అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా చిత్ర నిర్మాత కథానాయకుడు సురేష్ నంద మాట్లాడుతూ కథానాయకుడిగా నటిస్తూ నిర్మాణ బాధ్యతలను నిర్వహించడం చాలా బాధ్యతతో కూడిన కార్యం అన్నారు. దాన్ని తాము సమర్థవంతంగా నిర్వహించినట్లు భావిస్తున్నామని అన్నారు. చిత్ర దర్శకుడు నాగరాజ్ మాట్లాడుతూ సమాజంలో తాను చూసిన ప్రేమ, ,అభిమానం, ఆగ్రహం వంటి సంఘటనలే ఈ చిత్రం అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు పేరరసు మాట్లాడుతూ వీరాయి మక్కళ్ వంటి చిత్రాలు చాలా అవసరం అని పేర్కొన్నారు. ఇలాంటి చిత్రాలు చూసి చాలా కాలం అయ్యిందన్నారు. ఇప్పుడు వస్తున్న చిత్రాల్లో అనుబంధాలకు ప్రాముఖ్యత ఇవ్వడం లేదన్నారు. అన్ని కమర్షియల్ లైజ్ అవుతున్నాయి అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వీరాయి మక్కళ్ వంటి గ్రామీణ నేపథ్యంలో సహజత్వానికి దగ్గరగా చిత్రాన్ని రూపొందించిన దర్శక నిర్మాతలను అభినందిస్తున్నానన్నారు. మంచి కథా చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ ఎప్పుడు ఉంటుందన్నారు. అదేవిధంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మకం ఉందని దర్శకుడు పేరరసు పేర్కొన్నారు.



వీరాయి మక్కళ్ చిత్ర ఆడియోను ఆవిష్కరించిన పేరరసుతో యూనిట్ సభ్యులు

అధర్వ డీఎన్ఏ పూర్తి..!

తమిళ సినిమా: నటుడు అధర్వ కథానాయకుడుగా నటిస్తున్న తాజా చిత్రం డీఎన్ఏ. దీనికి నెల్సన్ వెంకటేశన్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈయన ఇంతకుముందు ఒరు నాళ్ కూత్తు, మాన్‌స్టర్, ఫర్హానా వంటి విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించారన్నది గమనార్హం. ఒలింపియా మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో చిత్తా చిత్రం ద్వారా ప్రశంసలు అందుకున్న నటి నిమిషా సజయన్ నాయకిగా నటిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని ఇటీవల నటుడు అధర్వ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేశారు. ఆ పోస్టులకు మంచి స్పందన వచ్చింది. ఇందులో నటుడు అధర్వ చాలా కొత్తగా కనిపిస్తారని దర్శకుడు పేర్కొన్నారు. ఆరంభ కాలం నుంచి ఆయన నటించిన చిత్రాలు చూస్తున్నానని అధర్వలో అద్భుతమైన నటుడు ఉన్నారని, ఈ చిత్రం ఆయన కెరియర్లో ప్రత్యేకంగా నిలిచిపోతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తన కథను నమ్మి ఈ అవకాశాన్ని ఇచ్చిన నిర్మాత ఎస్ అంబేద్ కుమార్ ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారమే చిత్రం షూటింగ్ పూర్తి చేయడంతో నిర్మాత సంతోషాన్ని వ్యక్తం చేసినట్లు చెప్పారు. కాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి అయినట్లు యూనిట్ వర్గాలు కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకుంటున్న ఫొటోలను మీడియాకు విడుదల చేశారు. కాగా పార్తీపన్ ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్రానికి సత్యప్రకాష్, శ్రీకాంత్, హరిహరన్, ప్రవీణ్ సైవి, ఆకాష్ తదితర ఐదుగురు సంగీత దర్శకులు ఈ చిత్రంలోని ఐదు పాటలకు సంగీతం అందించడం విశేషం. నిర్మాణాత్మక కార్యక్రమాలు పూర్తి చేసి, త్వరలోనే చిత్రం ఆడియో ట్రైలర్ విడుదల తేదీని వెల్లడించనున్నట్లు తెలిపారు. అలాగే డిఎన్ఏ చిత్రాన్ని త్వరలోనే తెరపైకి తీసుకురానున్నట్లు దర్శకుడు నెల్సన్ వెంకటేశన్ పేర్కొన్నారు.



డీఎన్ఏ చిత్ర యూనిట్

ఆవరించిన ఆత్మన్యూనత..

పదేళ్లుగా చెత్త మధ్యే జీవనం

• తల్లి కుమార్తెల అగచాట్లు
• ఇంటి నుంచి 4 టన్నుల చెత్త తొలగింపు
• మానసిక వైద్యుల కౌన్సెలింగ్
• కోయంబత్తూరులో వెలుగు చూసిన ఘటన

దుర్వాసన మధ్య దుర్భర జీవితం



ఇంట్లోని చెత్త, తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది



చేతినిండా డబ్బు.. ఇంటిలో కావాల్సిన సౌకర్యాలు కానీ నా అని పలకరించే వారే లేరు. అదే వారిలో ఆత్మన్యూనతకు దారి తీసింది. దీంతో దాదాపు పదేళ్లుగా ఇంటిలోనే ఉండిపోయారు. ఆన్‌లైన్‌లో ఫుడ్ డెలివరీ చేసుకుంటూ బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చీకట్ల మధ్యే బతుకీడుతున్నారు. ప్రపంచాన్ని గడగడలాండించిన కరోనా వచ్చిన విషయం కూడా తెలియదంటే ఎంతటి దుర్భర జీవితాన్ని అనుభవించారో? ఆ తల్లీ కూతుళ్లు..!

సాక్షి, చెన్నై: ఓ బహుళ అంతస్తుల భవనంలోని ప్లాట్‌లో తల్లికుమార్తెలు గత కొన్నేళ్లుగా టన్నుల కొద్ది చెత్తతో దుర్భర జీవితాన్ని గడుపుతూ వచ్చారు. తమకు కావాల్సినవన్నీ ఆన్‌లైన్ ద్వారా తెప్పించుకుని కడుపు నింపుకుంటూ బల్లులు, పురుగులు, ఎలుకలు, పిల్లులతో కలిసి చెత్త, దుర్గంధం మధ్య జీవనం సాగిస్తూ రావడం కోయంబత్తూరులో ఆదివారం వెలుగు చూసింది. వివరాలు.. రాష్ట్రంలో క్లాసిక్ సిటీ కోయంబత్తూరు నగరం నడ్డిబొడ్డున గాంధీపురంలోని రామ్ నగర్‌లో ఓ బహుళ అంతస్తుల భవనం ఉంది. ఇందులో 20 ప్లాట్‌లలో పలు కుటుంబాలు నివాసం ఉన్నాయి. ఇందులో తొలి అంతస్తులో 65 సంవత్సరాల తల్లి, 35 సంవత్సరాల కుమార్తె ఉంటున్నారు. ఇక్కడ పదేళ్లకు పైగా నివాసం ఉన్న వీరు ఇరుగు పొరుగు వారితో కలవరు. కనీసం బయటకు కూడా రారు. తలుపులు, కిటికీలు అన్నీ ఎప్పుడూ మూసే ఉంటాయి. దీంతో వీరిని అపార్ట్‌మెంట్‌లో ఉన్న వారెవ్వరూ పట్టించుకోరు. అయితే ఈ ఇంటికి రోజూ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ బాయ్స్ మాత్రం వచ్చి వెళ్తుంటారు. వీరు కూడా ఆ తల్లి కుమార్తెను చూసే వారు కాదు. వారి సూచన మేరకు ఇనుప గ్రిల్‌కు తగిలించిన బ్యాగ్‌లో ఫుడ్ పెట్టి వెళ్లే వారు. ఈ పరిస్థితుల్లో గత రెండు మూడు రోజులుగా ఈ ఇంట్లో నుంచి విపరీతమైన దుర్వాసన రావడాన్ని పక్కింటి వారు పసిగట్టారు. తమకు తెలిసిన సామాజిక కార్యకర్త ఒకరికి సమాచారం ఇచ్చారు.

ఇంట్లో నాలుగు టన్నుల చెత్త

కార్పొరేషన్ అధికారులు రంగంలోకి దిగడంతో ఆ తల్లి కూతుళ్ల తొలుత తీవ్ర ఆందోళన, ఆగ్రహానికి లోనైనా, చివరకు ఆ సామాజిక కార్యకర్త వారిని బుజ్జగించి నచ్చ చెప్పాడు. ఇంటిని శుభ్రం చేయించాడు. ఆ ఇంట్లో ఉన్న బొద్దింకలు, ఎలుకలు ఇతర ఫ్లాట్‌లలోకి వెళ్లకుండా కార్పొరేషన్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకుని శుభ్రం చేసే పనులపై దృష్టి పెట్టారు. తల్లి కుమార్తెను ఇద్దరినీ వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆ సామాజిక కార్యకర్త తమ వెన్నంటి ఉండడంతో ఆతల్లి కుమార్తె వైద్య సేవలకు సహకరించారు. మానసికంగా తీవ్ర మనోవేదనతో ఉన్న ఆతల్లికుమార్తెకు వైద్యులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

అన్నీ ఉన్నా.. నా అనే వారు లేరు..

ఈ తల్లి కుమార్తెలకు బంధువులు ఉన్నారు. ఆర్థిక సాయంచేసే వారు కూడా ఉన్నారు. అయితే, నా అని పలకరించే వారు లేరనే మనో వేదనతో వీరు గత కొన్నేళ్లుగా ఇంటి నుంచి బయటకు రావడం మానేశారు. కరోనా అన్నది ఒకటి వచ్చి వెళ్లినట్టుగా, కరోనా ఇంజెక్షన్ వేసుకోవాలన్న విషయం కూడా తెలియక వీరు చెత్త మధ్య దుర్భర జీవితాన్ని గడిపి ఉండడం వెలుగు చూసింది. ఈ విషయంపై ఆ సామాజిక కార్యకర్త మాట్లాడుతూ పదేళ్ల క్రితం ఈ ఇంటి పెద్ద మరణించడంతో తమకు ఎవ్వరూ లేరనే మనో వేదనలో ఆ 65 ఏళ్ల వృద్ధురాలు పడ్డారని తెలిపారు. ఆమెకు తోడుగా ఇంట్లో ఉన్న 35 ఏళ్ల కుమార్తె సైతం తీవ్ర మానసిక వేదనలో మునిగిపోయారు. బంధువులు, ఆప్తులు ఆన్‌లైన్ ద్వారా పంపించే నగదు ద్వారా తమకు కావాల్సినవి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని వాటిని స్వీకరిస్తూ కాలం గడుపుతూ వచ్చారని తెలిపారు. కాగా బాధితుల ఆ ఇంటిని పూర్తిగా శుభ్రంచేసి, ఆ తల్లికుమార్తెకు మరింత వైద్య పరంగా, మానసికంగా కౌన్సెలింగ్ ఇచ్చిన తర్వాత తాళం అప్పగించాలని కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు. కాగా వీరి దుర్భర స్థితిని చూసి ఇరుగు పొరుగు ప్లాట్‌లలో ఉన్న వాళ్లు సైతం అయ్యో.. అనుకున్నారే గానీ, వారికి తోడుగా తాము ఉన్నామనే భరోసా ఇవ్వక పోవడం గమనార్హం. కాగా తగ్గుతు న్న మానవ సంబంధాలకు ఈ ఘటన తార్కాణంగా చెప్పవచ్చని మనో విజ్ఞాన శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

మాటల్లో పెట్టి..

శనివారం మధ్యాహ్నం ఆ సామాజిక కార్యకర్త ఆ ప్లాట్ తలుపు తట్టారు. ఎంతకూ తెరచుకోలేదు. గంటల తరబడి అక్కడే వేచి చూశాడు. చివరకు రాత్రి సమయంలో ఫుడ్ డెలివరీ బాయ్ వచ్చిన వెళ్లినానంతరం ఆ ఇంట్లో నుంచి 35 ఏళ్ల యువతి అక్కడి బ్యాగ్‌లో ఉన్న ఫుడ్ తీసుకునే ప్రయత్నం చేయగా, ఈ సామాజిక కార్యకర్త పలకరించాడు. ఆమెను మాటలలో పెట్టి తన వైపుగా దృష్టిని మరల్చుకున్నాడు. ఎవరినీ ఇంట్లోకి అనుమతించని ఆమె ఆ సామాజిక కార్యకర్తను ఆహ్వానించింది. ఆ ప్లాట్‌లోకి వెళ్లగానే భరించ లేని దుర్వాసన, ఇళ్లంతా చెత్త కుప్పలు, బొద్దింకలు, బల్లులు, ఎలుకలు, పిల్లులు, జెర్రీలు, దోమలు, నల్లులు, మిగిలి పోయిన ఆహారంలో పురుగులు అంటూ దుర్భర పరిస్థితిని చూసి తీవ్ర ఆందోళనకు లోనయ్యాడు. వాటి మధ్యలోనే ఆ తల్లి కూతుళ్ల తామేదో మానసికం రోగులు అన్నట్టుగా వ్యవహరిస్తూ ఉండడంతో కలత చెందాడు. ఆ దుర్వాసనను భరిస్తూనే వారిని మాటల్లో పెట్టాడు. వారి పరిస్థితిని గుర్తించి తక్షణం కోయంబత్తూరు కార్పొరేషన్ అధికారులకు సమాచారం అందించారు.

క్లుప్తంగా

ఉద్యోగి ఆత్మహత్య

కొరుక్కుపేట: ప్రియురాలిపై కోపంతో ఓ ఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చెన్నైలోని రాయపేట ప్రభుత్వాస్పత్రిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తిరువళ్లూరు జిల్లా నల్లత్తూరుకు చెందిన ఆకాష్(25) చెన్నై రాయపేట ప్రభుత్వాస్పత్రిలో డ్రెస్సింగ్ విభాగంలో ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఆకాష్ కొంతకాలంగా ఓ మహిళతో ప్రేమలో ఉన్నట్టు సమాచారం. ఆమె పని నిమిత్తం అబుదాబి వెళ్లిన తర్వాత ఆకాష్‌తో సరిగా మాట్లాడలేదని తెలుస్తోంది. దీంతో ఆకాష్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. శనివారం రాత్రి పని నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన ఆకాష్ తన ప్రియురాలితో సెల్‌ఫోన్‌లో మాట్లాడాడు. అప్పుడు ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆకాష్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తరువాత ఆ యువతి చాలాసార్లు ఫోన్ చేసినా ఆకాష్ తీయలేదు. దీంతో మనోవేదనకు గురైన మహిళ ఆకాష్ స్నేహితుడికి ఈ విషయం చెప్పింది. అతడు వెంటనే ఆస్పత్రికి వెళ్లి చూడగా ఆకాష్ ఉరివేసుకుని, వేలాడుతూ కనిపించడంతో షాక్‌కు గురయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న రాయపేట ఆస్పత్రి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని అదే ఆస్పత్రిలోని పోస్టుమార్టం విభాగానికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో నుంచి పడి విద్యార్థినికి గాయాలు

తిరువొత్తియూరు: కన్యాకుమారి జిల్లాలో బస్సులో నుంచి కిందపడి ఓ విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే ఆల్వార్ కోవిల్ ప్రాంతానికి చెందిన తేజస్విని (19) ఓ కళాశాలలో చదువుతోంది. ఈమె శనివారం ఉదయం కండన్‌విలై ప్రాంతంలో ఉన్న కార్పెంటర్ శిక్షణ సంస్థకు వెళ్లారు. తర్వాత మధ్యాహ్నం ఇంటికి తిరిగి రావడానికి మిడాలం వెళ్లే బస్సు ఎక్కారు. బస్సులో రద్దీ ఎక్కువగా ఉండడంతో తేజస్విని ఫుట్‌బోర్డ్‌పై నిలబడి ప్రయాణం చేసినట్లు తెలిసింది. ఆ బస్సు ఇరానీయల్ వళ్లి ఏరు వంతెన మలుపు వద్ద వస్తున్న సమయంలో ఫుట్ బోర్డుపై నిలబడి ఉన్న తేజస్విని అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తేజస్విని తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30 మంది మహిళలకు అస్వస్థత

తిరువొత్తియూరు: తూత్తుకుడి సమీపంలోని ప్రైవే ట్ కర్మాగారం నుంచి పొగలు రావడంతో 30 మంది మహిళలు అస్వస్థకు గురయ్యారు. వారిని ఆస్పత్రిలో చేర్చారు. వివరాల్లోకి వెళితే.. తూత్తుకుడి పుదూర్ పాండియాపురం సమీపంలో ప్రైవే ట్ యాజమాన్యానికి చెందిన చేపల ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఉంది. ఇక్కడ మూడు షిఫ్ట్‌ల్లో 200 మంది కి పైగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో పరిశ్రమలో రాత్రి 11.50 గంటలకు ఏర్ కండీషన్ యంత్రం వద్ద మహిళలు పని చేస్తున్నారు. ఆ సమయంలో ఊహించని రీతిలో పైకప్పునకు వేసిన థర్మాకోల్ షీట్‌లో మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని ఎ వరూ గమనించకపోవడంతో యంత్రాలకు మంటలు వ్యాపించడంతో గది మొత్తం పొగలు కమ్ముకున్నాయి. అక్కడ పని చేస్తున్న మహిళా కార్మికులు కళ్ల మంట, ఊపిరాడక అవస్థలు పడ్డారు. ఇందులో 30 మంది స్పృతప్పి పడిపోయారు. ఈవిషయమై తూత్తుకుడి సిప్కాట్ అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని, అస్వస్థతకు గురైన 30 మంది మహిళా కార్మికులను రక్షించి తూత్తుకుడిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఫ్యాక్టరీలో పనులు నిలిపివేసి ఉద్యోగులందరినీ ఖాళీ చేయించాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీపతి ఆదేశించారు. కాగా, మంత్రి కల్సిన్.వి.గణేశన్, గీతా జీవన్, అనితారాధాకృష్ణన్ ఆస్పత్రిలో బాధిత మహిళలను పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

జూనియర్ అసిస్టెంట్ అరెస్టు

కొరుక్కుపేట: దిండిగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.4.68 కోట్ల స్వాహా చేసిన జూనియర్ అసిస్టెంట్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దిండిగల్‌లోని సోలై హాల్ రోడ్‌లోని నెట్టుతేరుకు చెందిన శరవణన్ (44) దిండిగల్ కార్పొరేషన్ అకౌంట్స్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ విభాగంలో, తాగునీరు, ఆస్తి, కిరాణా దుకాణం, అద్దె జాతుల పన్ను వసూలు చేస్తారు. ఇలా సేకరించిన మొత్తం మరుసటి రోజు ఉదయం బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఈ విధులు నిర్వహిస్తున్న శరవణన్ తాను వసూలు చేసిన పన్ను మొత్తాన్ని బ్యాంకులో చెల్లించినట్లు నకిలీ చలాన్ తయారు చేసి, రూ.4.68 కోట్ల మోసానికి పాల్పడ్డాడు. దీంతో కార్పొరేషన్ కమిషనర్ రవిచంద్రన్ అతన్ని విధుల నుంచి తప్పించారు. దీంతో ఫైనాన్స్ విభాగంలో పనిచేసిన ఆఫీస్ అసిస్టెంట్ సతీష్, పర్యవేక్షణలో విఫలమైన ఇన్‌స్పెక్టర్ శాంతిని కూడా సస్పెండ్ చేశారు. అలాగే జిల్లా ఎస్పీ ప్రదీప్‌కు ఈ విషయమై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రవిచంద్రన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా క్రైం బ్రాంచ్ పోలీసులు కేసు నమోదు చేసి శనివారం రాత్రి శరవణన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అరుంబాక్కంలో ఇద్దరు రౌడీలు..

అన్నానగర్: అరుంబాక్కం ప్రాంతంలో ఆదివారం ఇద్దరు రౌడీలను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలోని అరుంబాక్కం ప్రాంతంలో పోలీసులు ఆదివారం నిఘా పెట్టారు. దీంతో ఆ ప్రాంతానికి చెందిన రౌడీ అజిత్ కుమార్ (24)ని అరెస్టు చేశారు. అరుంబాక్కం పోలీస్ స్టేషన్‌లో ఇతనిపై ఇప్పటికే రెండు హత్య, దాడి కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా అరుంబాక్కం ప్రాంతానికి చెందిన మరో రౌడీ అభినేష్ (23)ని అరెస్ట్ చేశారు. అతనిపై కూడా హత్య, దాడి కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆదర్శ నియోజక వర్గంగా కాట్పాడి

• మంత్రి దురై మురుగన్


రేషన్ దుకాణాన్ని ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి దురై మురుగన్

వేలూరు: రాష్ట్రంలోనే కాట్పాడి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర సీనియర్ మంత్రి దురై మురుగన్ అన్నారు. వేలూరు జిల్లా కాట్పాడి నియోజక వర్గంలోని అరిముత్తు మోటూరులో ఎమ్మెల్యే నిధులతో నూతనంగా నిర్మించిన రేషన్ దుకాణ భవనాన్ని ఆయన ప్రారంభించి, కార్డుదారులకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాట్పాడి నియోజక వర్గంలోని ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రజలు మరిన్ని సౌకర్యాలు కోరినా కల్పించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అనంతరం కాట్పాడి ప్రాంతంలో గత పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో ఎంపీని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమంలో సెంగొట్టు, అశోక్‌నగర్, మోటూరు, తదితర ప్రాంతాల్లో పార్లమెంట్ సభ్యులు జగద్రక్షగన్‌తో పాటు వెళ్లి ప్రజలు తరచూ డీఎంకే పార్టీని కాటాప్పడిలో ఆదరించి, అత్యధిక మెజారిటీతో గెలిపించడం అభినందనీయమన్నారు. తాము ఎన్నటికీ కాట్పాడి నియోజక వర్గ ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. దురై మురుగన్ మాట్లాడుతూ రాష్ట్ర డిప్యూటీ సీఎం పదవి ఇస్తే మీరు అంగీకరిస్తారా? అనే విషయంపై విలేకరులు ప్రశ్నించగా అందుకు ఆయన మాట్లాడుతూ పదవి ఇస్తానంటే ఎవరు వద్దంటారని సమాధానం ఇచ్చారు. తమ పార్టీలో ఏక పక్ష నిర్ణయం కాదని, తామందరూ చర్చించి, ఎవరికి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కార్తికేయన్, నందకుమార్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, యూనియన్ చైర్మన్ వేల్‌మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం


రోగులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: చెన్నై పాత చాకలిపేటలోని ట్యాంక్ వీధిలో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాబాకు అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. దేవాలయం తరపున తండయార్‌పేటలోని మానసిక పునరావాస కేంద్రంలో రోగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి దేవీమాధవయ్య ఈ కార్యక్రమానికి దోహదపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇందులో జక్కుల హరి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరుక్కుపేట: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా చెన్నైలోని నాలుగు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పవర్ జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ పేర్కొంది. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తండయార్‌పేట, ఐటీ కారిడార్, పల్లవరం, అడయార్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఒక ప్రకటనలో తెలిపింది.

సర్పంచ్‌పై దాడి

తిరువొత్తియూరు: సర్పంచ్‌పై ఇనుప కమ్మీతో దాడి చేసిన ఇద్దరు వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. తిరువణ్ణామలై జిల్లా పెరనమల్లూర్‌లోని మాలిగై పట్టు గ్రామానికి చెందిన జెమిని (54) మాళిగైపట్టు గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. ఇతనికి అదే ప్రాంతానికి చెందిన శివరామన్, చిన్రాసుతో విరోధం ఉంది. ఈ క్రమంలో శనివారం రాత్రి అదే ప్రాంతంలోని నేతి అమ్మన్ ఆలయంలో వీధి నాటకానికి వచ్చిన జెమినితో శివరామన్, చిన్రాసు వాగ్వాదానికి దిగారు. దీంతో ఆగ్రహించిన వారు జెమినిపై ఇనుప రాడ్‌తో దాడిచేశారు. గాయపడిన జెమినిని పక్కనే ఉన్నవారు రక్షించి సెయ్యారం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెరనమల్లూరు పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి శివరామన్, చిన్రాసు కోసం గాలిస్తున్నారు.

రూ. 6.38 లక్షల స్వాధీనం

తిరువొత్తియూరు: మహిళా రిజిస్ట్రార్ కారులో సరైన ఆధారాలు లేకుండా ఉన్న రూ.6.38 లక్షలను అవినీతి నిరోధక శాఖ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ధర్మపురి ఎస్వీ రోడ్డుకు చెందిన సాయిగీత (58) కృష్ణగిరి జిల్లా డెంకనికోట రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. ఈమె ఇటీవల కాలంలో పత్రాల రిజిస్ట్రేషన్‌కు లంచాలు తీసుకుంటున్నట్టు అవినీతి నిరోధక పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో జిల్లా అవినీతి నిరోధక శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు వడివేల్ నేతృత్వంలో పోలీసులు శనివారం రాత్రి డెంకనికోట రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిఘా పెట్టారు. రాత్రి సాయిగీత కార్యాలయం నుంచి తన కారులో ఇంటికి బయలుదేరారు. దారిలో కేలమంగళం రోడ్డు వద్ద కారు ఆపి అక్కడ నిలబడిన వ్యక్తి వద్ద నుంచి నగదు సంచిని తీసుకున్నారు. ఏసీబీ పోలీసులు ఆమెను వెంబడించి, కేలమంగళంలోని పాత రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద అడ్డగించి, సోదాలు చేశారు. ఆ సమయంలో కారులో రూ.6,38,500 ఉండగా గుర్తించిన అవినీతి నిరోధక పోలీసులు సాయిగీతను విచారించగా డబ్బుకు సంబంధించిన పత్రాలు లేవని తేలింది. దీంతో ఆ నగదును స్వాధీనం చేసుకుని, కృష్ణగిరి కోర్టులో అప్పగించారు. అలాగే సాయిగీతపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు.

నా భర్తను రక్షించండి

అన్నానగర్: దుబాయ్ టెర్మినల్ నుంచి బయలుదేరిన ఆయిల్ ఓడ ఒమన్‌లోని అడెన్ టెర్మినల్ సమీపంలో సముద్రంలో బోల్తా పడిన ప్రమాదంలో 13 మంది భారతీయ నావికులు సహా 16 మంది చిక్కుకున్నారు. వీరిలో 10 మందిని రక్షించగా, మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంలో కడలూరు ముదునగర్ భగవన్ మహావీర్ వీధికి చెందిన ధనంజయన్ కూడా చిక్కుకుపోయాడు. ఈ స్థితిలో ధనంజయన్‌ను తిరిగి రప్పించేందుకు అతని భార్య ఎళిలరసి (31) రెండు రోజుల క్రితం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి, వినతి పత్రం ఇచ్చింది. అయితే ఆ పిటిషన్‌పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తుంది. దీంతో ఎళిలరసి శనివారం మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ప్రమాదంలో అదృశ్యమైన తన భర్తను తిరిగి పొందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగింది. ఆమె మాట్లాడుతూ ప్రమాదం జరిగి 6 రోజులు గడిచినా తన భర్త గురించి ఎలాంటి సమాచారం లేదన్నారు. తన భర్తను రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రయాణికుల నిరసన

కొరుక్కుపేట: చెన్నై, నగర శివారు ప్రాంతాల వాసులు వారాంతాలు, ప్రధాన సెలవు దినాల్లో తమ స్వస్థలాలకు వెళ్లేందుకు వీలుగా కీలాంబాక్కం బస్ స్టేషన్ నుంచి అదనపు బస్సులను నడుపుతున్నారు. ఈ క్రమంలో శనివారం తిరువణ్ణామలై, కళ్లకురిచ్చి, జయంగ్‌కొండం, విల్లుపురం, సేలం తదితర ప్రాంతాలకు సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అర్ధరాత్రి వరకు కుటుంబ సభ్యులతో ఉన్నారు. దీంతో కోపోద్రిక్తులైన ప్రయాణికులు బస్ స్టేషన్‌లోని డ్రైవర్, కండక్టర్లతో వాగ్వాదానికి దిగారు. అనంతరం బస్టాండ్ ఎదుట బైఠాయించి, నిరసన తెలిపారు. దీంతో స్పందించిన అధికారులు ప్రయాణికులు అధిక సంఖ్యలో వేచి ఉండే ప్రాంతాలకు అదనపు బస్సులను నడిపారు.

పొడి దోసెలో జెర్రి : స్పృహతప్పిన యువకుడు

తిరువొత్తియూరు: ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి, తెప్పించుకున్న పొడిదోసెలో జెర్రి ఉన్న విషయం గుర్తించకుండా తిన్న యువకుడు స్పృహతప్పి పడిపోయాడు. వివరాల్లోకి వెళితే.. తిరువారూరు జిల్లా మన్నార్గుడి ఆర్‌బి శివమ్ నగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ (23) వడసేరి రోడ్డులోని ప్రైవేట్ స్కూల్ సమీపంలో పుస్తకాల షాపు నడుపుతున్నాడు. శనివారం షాప్ ఓపెన్ చేయగానే ప్రముఖ ఫుడ్ కంపెనీ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో పొడి దోసె ఆర్డర్ చేశాడు. కొద్దిసేపటికే మన్నార్‌గుడిలోని ప్రముఖ శాఖాహార రెస్టారెంట్ నుంచి కంపెనీ ఉద్యోగి ద్వారా పొడి దోసె వచ్చింది. అది తింటున్న ప్రవీణ్ కుమార్‌కు గొంతులో మంట వచ్చింది. అప్పుడు పొడి దోసెలో చనిపోయిన సగం జెర్రి ఉండడాన్ని గుర్తించాడు. అయితే అప్పటికే సగం దోసె తిన్న ప్రవీణ్ కుమార్ వాంతులు చేసుకుని, కొద్దిసేపటికి స్పృహతప్పి పడిపోయాడు. అనంతరం దుకాణానికి వచ్చిన వారు ప్రవీణ్‌కుమార్‌కు చికిత్స కోసం మన్నార్గుడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఆహార భద్రత అధికారి అలగువేలు సంబంధిత హోటల్‌కు వెళ్లి పరిశీలించి ఆహార పదార్థాల నమూనాలను సేకరించారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ


వడకుప్పంలో దుర్యోధన వధ నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

పళ్లిపట్టు: వడకుప్పం ద్రౌపదీదేవి ఆలయ అగ్నిగుండ వేడుకల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం దుర్యోధన వధ నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. పళ్లిపట్టు యూనియన్ వడకుప్పంలోని ద్రౌపదీదేవి ఆలయంలో ఏటా ద్రౌపదీదేవి తిరునాళ్లను వడకుప్పం, సామినాయుడు కండ్రిగ, మునుస్వామి నాయుడు కండ్రిగ, గొల్లపల్లె గ్రామస్తులు సంయుక్తంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ నాటక ప్రదర్శన భక్తులను అలరించింది. సాయంత్రం కంకణాలు ధరించిన 200 మంది భక్తులు అగ్నిగుండం ప్రవేశం చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త మండలపు ఏకనాథం నాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేశారు. వేడుకల్లో డీఎంకే సెంట్రల్ మండల కార్యదర్శి బీడీ. చంద్రన్ తదితరులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు.

ఏడాది బిడ్డ హత్య

తిరువొత్తియూరు: కోడలి ప్రవర్తనపై సందేహంతో ఏడాది వయస్సున్న మనుమరాలి నోట్లో మట్టి కుక్కి హత్య చేసిన అవ్వను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. అరియలూరు జిల్లా కోటయ్యాడు గ్రామానికి చెందిన రాజాకు భార్య సత్య (21), కుమారుడు మోనీష్ (2), కుమార్తె కృతిక (1) ఉన్నారు. రాజా విదేశాల్లో పనిచేస్తూ ఉన్నాడు. కొన్ని రోజుల క్రితం సత్య తన బిడ్డలు ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో డిపోకు పాలు పోయడానికి వెళ్లారు. కొద్ది సమయం తర్వాత సత్య ఇంటికి తిరిగి వచ్చి చూడగా కృతిక స్పృహ తప్పి నోట్లో మట్టితో పడి ఉంది. దీంతో దిగ్భ్రాంతి చెందిన సత్య తన కుమార్తెను చికిత్స కోసం పెన్నాడం ప్రాంతంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు చిన్నారి కృతిక మృతి చెందినట్లు తెలిపారు. ఈ సంఘటన గురించి సత్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపారు. పైగా తన బిడ్డను మృతిపై అత్త విరుదంబాల్ (60)పై సందేహం ఉన్నట్లు ఆమె తెలిపారు.

దీంతో పోలీసులు విరుదంబాల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. బిడ్డ నోట్లో మట్టి కుక్కి హత్య చేసినట్లు అంగీకరించారు. విరుదంబాల్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో కృతిక తన కుమారుడికి పుట్టలేదన్న సందేహంతో కోడలి వద్ద గొడవలు చేస్తున్నట్లు తెలిసింది. సంఘటన జరిగిన రోజున మనవడు మోనిష్‌పై కృతిక మట్టిని పోస్తూ ఆడుకుంకుటుండగా చూసిన విరుదంబాల్ ఆగ్రహం చెంది, కృతిక నోట్లో మట్టి కుక్కడంతో స్పృహతప్పి మృతి చెందినట్లు తెలిపారు. దీంతో తాల్వాయి పోలీసులు విరుదంబాల్‌ను అరెస్టు చేసి చందురై కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

విద్యార్థినిని గర్భవతిని చేసిన యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి విద్యార్థినిని గర్భవతిని చేసిన యువకుడిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. విరుదునగర్ జిల్లా తిరుచ్చి సమీపంలోని కె.విలక్కు ప్రాంతానికి చెందిన ముత్తురాజ్ (24). ఓ ప్రైవేట్ మినరల్ వాటర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆ సమయంలో ఇతనికి తిరుచ్చిలి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన ప్లస్ -1 విద్యార్థికి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. వివాహం చేసుకుంటానని చెప్పి ముత్తురాజ్ విద్యార్థినిపై పలు సార్లు లైంగిక దాడి చేశాడు. ఈ క్రమంలో విద్యార్థిని తనకు కడుపునొప్పి వస్తోందని తల్లికి చెప్పింది. ఆ తర్వాత విద్యార్థినిని ఆమె తల్లి అరుపుక్ కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ పరీక్షించగా 5 నెలల గర్భిణి అని తేలింది. దీంతో తల్లి దిగ్భ్రాంతికి గురైంది. విద్యార్థిని ప్రశ్నించగా జరిగిన విషయాన్ని వివరించింది. విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ముత్తురాజ్‌ని అరెస్టు చేసి జైలుకు తరలించారు.

అన్నాడీఎంకే నాయకుల కరపత్రాల పంపిణీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ హరి

తిరుత్తణి: డీఎంకే ప్రభుత్వంలో సారా మరణాలు, హత్యలు, నిత్యావసర వస్తువుల పెరుగుదలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేలా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆదివారం ఆర్కేపేటలో కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల అన్నాడీఎంకే కన్వీనర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎంపీ హరి పాల్గొన్నారు.

ముగిసిన జెట్ –చెన్నై వార్షిక పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న రవీంద్రకుమార్‌రెడ్డి, కృష్ణారావు

కొరుక్కుపేట: జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్)–చెన్నై ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు నిర్వహించిన 30వ వార్షిక ఆధ్యాత్మిక పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో నగరంలోని వివిధ పాఠశాల నుంచి సుమారు 1200 మంది విద్యార్థులు పాల్గొని, ప్రతిభను చాటారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జెట్–చెన్నై అధ్యక్షుడు రవీంద్ర కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఈనెల 14న భజన పోటీలు నిర్వహించగా, శని,ఆదివారాల్లో రామాయణంలోని సుందరకాండపై డ్రాయింగ్, క్విజ్ పోటీలు, విష్ణుసహస్రనామం, అష్టకాలు, రామాయణం, నాలాయిర దివ్య ప్రబంధం తదితర అంశాల్లో ఆధ్యాత్మిక పోటీలు నిర్వహించారు. శనివారం జరిగిన పోటీలకు శ్రీత్రిదండి అహోబిల రామానుజజీయర్ స్వామి పాల్గొని పోటీలను ప్రారంభించి, చిన్నారులను ఆశీర్వదించారు. అలాగే ఆదివారం పోటీలను గురుపూర్ణిమ సందర్భంగా చిన్నజీయర్ స్వామికి అష్టోత్తర పూజలు చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి మంగళాశాసనాలతో జెట్ చెన్నై వార్షిక పోటీలు –2024 మూడు రోజులు పాటు నిర్వహించామన్నారు. విద్యార్థుల ఉత్సాహంగా, ఆసక్తిగా పాల్గొడంతోపాటు తల్లిదండ్రులు ప్రోత్సాహం మెండుగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ఈ వార్షిక ఆధ్యాత్మిక పోటీలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రధానంగా జెట్ వార్షిక పోటీలకు దాతలు సహకారం మరువలేనిదని, వారికి ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఇందులో ఎస్‌కేపీడీ చారిటీస్ ట్రస్టీలు కిషోర్, ఊటుకూరు శరత్ కుమార్, ఎస్ఎల్ సుదర్శనం, డీఆర్‌బీసీసీసీ చారిటీస్ మేనేజింగ్ ట్రస్టీ ముక్కాల కన్నయ్య శెట్టి, పీఆర్సీ చారిటీస్‌కి చెందిన కోటా సుధాకర్, కాకుమాని చారిటీస్ నిర్వాహకులతో పాటు ప్రముఖులు జెట్ సభ్యులు పీవీఆర్ కృష్ణారావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ కలయిక


తిరుత్తణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తిరుత్తణి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు మూడు దశాబ్దాల తరువాత ఆదివారం చదుకున్న కళాశాల వేదికగా కలుసుకుని, తమ ఆనందాన్ని పంచుకున్నారు. తిరుత్తణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1992–95 విద్యా సంవత్సరంలో బీఏ ఎకనామిక్స్ చదువుకున్న 30మందికి పైగా పూర్వ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో స్థిరపడ్డారు. వారిలో జయలాబ్దీన్ అనే పూర్వ విద్యార్థి ప్రస్తుతం చదువుకున్న కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. అతను కొందరి మిత్రుల సాయంతో కళాశాల పూర్వ విద్యార్థులను ఏకం చేసి, ఆదివారం కళాశాల వేదికగా అపూర్వ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన తమ పూర్వ ఆధ్యాపకులను ఘనంగా సన్మానించి, వారికి జ్ఞాపికలు అందజేసి, పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆధ్యాపకులు తమ కళాశాల జీవితంలో చోటుచేసుకున్న మధుర క్షణాలు, స్మృతులు, కళాశాల నేర్పిన క్రమశిక్షణ గురించి మనుసు విప్పి మాట్లాడుకున్నారు. మధ్యాహ్నం అందరూ కలిసి భోజనం చేసి గ్రూప్ ఫొటో తీసుకున్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

• ఆంధ్రా వ్యక్తుల నుంచి రూ.48 లక్షలు స్వాధీనం

అన్నానగర్: గుమ్మిడిపూండి బజార్‌లో ఆదివారం ఉదయం ఇన్‌స్పెక్టర్ వడివేల్ మురుగన్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా ఉంచిన పెద్ద ట్రావెల్ బ్యాగులను తనిఖీ చేశారు. అందులో రూ. 500 నోట్ల కట్టలు ఉన్నాయి. విచారణలో వారిద్దరు

ఆంధ్రప్రదేశ్ రాజమండ్రికి చెందిన ప్రశాంత్ (42), వెంకట్ పవన్ (25) అని తెలిసింది. వారి నుంచి మొత్తం రూ.48 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ నగదు విషయమై చెన్నై ఆదాయ పన్ను శాఖ అధికారులకు తెలియజేశారు. దీంతో ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, విచారణ జరుపుతున్నారు.

పలు రైళ్ల రద్దు

కొరుక్కుపేట: తాంబరం వద్ద సిగ్నల్ అభివృద్ధి పనులు చేయనున్న నేపథ్యంలో దక్షిణాది జిల్లాల నుంచి చెన్నైకు వచ్చే కొన్ని రైళ్లు సోమవారం నుంచి రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. మరికొన్ని రైళ్ల మార్గం మార్పులు చేసినట్లు పేర్కొంది. ఈ మార్పులు ఆగస్టు 18వ తేదీ వరకు కొనసాగనున్నాయి. పలు రైళ్లను ఆలస్యంగా నడపనున్నామని, కొన్ని రైళ్లను ప్రత్యామ్నాయ మార్గాల్లో నడపనున్నట్లు అధికారులు తెలిపారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు తాంబరం–ఎగ్మోర్ సబర్బన్ రైలు మార్గంలో నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ రైలు దాదాపు 30 నిమిషాలు ఆలస్యంగా ఎగ్మోర్ చేరుకుంటుంది. సెంచర్ ఎక్స్‌ప్రెస్ తిరుచెందూర్ నుంచి విల్లుపురం వరకు ఆగస్టు 14, 15 , 16 తేదీల్లో మాత్రమే నడుస్తుందన్నారు. ఆగస్ట్ 17 వ తేదీన చెంగల్పట్టు నుంచి కాంచీపురం, అరక్కోణం వరకు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ఎగ్మోర్ వెళ్తుందన్నారు. అదే సమయంలో రాత్రి వేళల్లో నడిచే దక్షిణ జిల్లా దక్షిణ జిల్లా రైళ్లైన నెల్లై, పొతికాయి, అనంత పురి, పాండియన్, ముత్తునగర్, సిలంబు ఎక్స్‌ప్రెస్ రైళ్లు తాంబరం సిగ్నల్ వర్క్ పూర్తయ్యే వరకు 20 నుంచి 30 నిమిషాలు ఆలస్యంగా నడుస్తాయన్నారు. తాంబరం–నాగర్‌కోయిల్ అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం నుంచి 31వ తేదీ వరకు పూర్తిగా రద్దు చేసినట్లు ప్రకటించారు.

అలాగే కోచ్ నంబర్ 20692 నాగర్‌కోవిల్ నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు బయలుదేరే అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సోమవారం నుంచి 31 వరకు పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు. సెంగోట్టై నుంచి తాంబరం వరకు సాయంత్రం 4.15 గంటలకు బయలుదేరే సెంగోట్టై–తాంబరం ఎక్స్‌ప్రెస్ రైలు పాక్షికంగా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

గంజాయి కేసులో అన్నాడీఎంకే నేత అరెస్టు

అన్నానగర్: గంజాయి కేసులో అన్నాడీఎంకే నేతను పోలీసులు అరెస్టు చేశారు. నాగై జిల్లాలోని వెలంగన్ని ఈస్ట్ కోస్ట్ రోడ్డులో ప్రత్యేక పోలీసు బలగాలు శనివారం వాహన తనిఖీలు చేపట్టాయి. ఆ సమయంలో ఓ కారులో గంజాయి ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తున్నట్లు తేలింది. దీనిపై విచారణ చేపట్టిన ఇంటిలిజెన్స్ పోలీసులు తిరుపూర్‌కు చెందిన మణిరాజ్ (36), పుదుకోట్టైకు చెందిన గౌతమన్ (36), విల్లుపురం కు చెందిన దక్షిణ మూర్తి (41), శివమూర్తి (38)గా గుర్తించి, 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని వేదారణ్యం నుంచి బోటులో శ్రీలంకకు అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించినట్లు వెలుగులోకి వచ్చింది.

అనంతరం నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు 200 కిలోల గంజాయి, స్మగ్లింగ్‌కు వినియోగించిన 3 కార్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వారిని సంప్రదించగా, వేదారణ్యం ఏడీఎంకే యూనియన్ కమిటీ సభ్యుడు అరివళగన్ గంజాయి స్మగ్లింగ్‌లో పాల్గొన్నట్లు వెలుగులోకి వచ్చింది. తదనంతరం, అరివళగన్‌ని శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి తిరుచ్చి సెంట్రల్ జైలులో ఉంచారు.

ఐటీ ఉద్యోగిపై మందుబాబుల దాడి

తిరువొత్తియూరు: మద్యం తాగుతున్న వారిని ప్రశ్నించిన ఐటీ ఉద్యోగిపై ముగ్గురు యువకులు రాళలతో దాడి చేశారు. వివరలు.. చెన్నై పెరంబూర్ మాణిక్య వినాయగర్ వీధికి చెందిన శివ రామన్ (41). ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి శివరామన్ ఉంటున్న ఇంటి డాబాపై ఆయన నివాసముంటున్న ఇంటి యజమాని కుమారుడు కెవిన్ స్నేహితులు గౌరీశంకర్, విగ్నేష్ లు మద్యం సేవిస్తున్నారు. ఇది చూసిన. శివరామన్ వెళ్లి మద్యం తాగడంపై అభ్యంతరం తెలిపాడు. దీంతో వాగ్వాదం జరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. తర్వాత పెద్ద రాయిని తీసుకుని శివరామన్ తలపై కొట్టి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన శివరామన్ పెరియార్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు సెంబియం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

చెన్నైలో జీఎం మాడ్యులర్ కేంద్రం


మీడియాతో మాట్లాడుతున్న సునీల్ శెట్టి

సాక్షి, చెన్నై : ఎలక్ట్రిక్ పరిశ్రమలకు సంబంధించిన సమగ్ర సమాచారాలను, ఉత్పత్తుల అనుభవాలను స్వయంగా వీక్షించేందుకు వీలుగా చెన్నై అన్నాసాలైలో జీఎం మాడ్యులర్ ఎక్స్ పీరియన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ఆదివారం బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కేంద్రంను సందర్శించి అన్ని రకాల ఉత్పత్తులను వీక్షించేందుకు , పరస్పరం ఎలక్ట్రిక్ పరిశ్రమలోని తాజా పోకడలు, సాంకేతికతలను స్వయంగా తెలుసుకునేందుకు వీలు కల్పించారని వివరించారు. జీఎం మాడ్యులర్ సీఈఓ జయంత్ జైన్ మాట్లాడుతూ, పెరుగుతున్న డిమాండ్, వినియోగ దారులకు అన్ని రకాల తమ ఉత్పత్తులను ఒకే చోట్ల కొలువు దీర్చి అందించేందుకు వీలుగా ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

క్లుప్తంగా...

బాలికపై లైంగిక దాడి

పుంగనూరు (చిత్తూరు జిల్లా): పులిచెర్ల మండలంలోని ముప్పిరెడ్డిగారిపల్లెలో తొమ్మిదేళ్ల బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసు వివరాలు... గ్రామంలోని సచివాలయం వద్ద శనివారం సాయంత్రం బాలిక ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన రెడ్డి హుస్సేన్ (25) అనే యువకుడు మాయమాటలు చెప్పి సమీపంలోని మామిడి తోటలోకి తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై లైంగికదాడికి పాల్పడుతుండగా భయంతో కేకలు వేసింది. దగ్గరలోనే ఉన్న బాలిక తల్లి వచ్చి కేకలు వేయడంతో హుస్సేన్ పారిపోయాడు. బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడు రెడ్డి హుస్సేన్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు.

అత్యాచారాలు.. హత్యలు.. విధ్వంసాలు

- నెలన్నర పాలనలో ఇదీ మీ ఘనత
- బాబు, లోకేశ్ మెప్పు కోసం దిగజారి మాట్లాడొద్దు
- హోం మంత్రి అనితకు మాజీ హోం మంత్రి వనిత హితవు



తాడేపల్లిగూడెం: 'రాష్ట్రంలో చిన్నారులపై అత్యాచారాలు.. యువతులపై అఘాయిత్యాలు.. పట్టపగలే దారుణంగా హత్యలు.. ఎంపీలపై రాళ్ల దాడులు.. వాహనాలకు నిప్పు పెట్టడాలు.. ఊరూరా విగ్రహాల ధ్వంసం.. ఇళ్లు, దుకాణాలు కూల్చివేత.. ఇదీ 45 రోజుల్లో చంద్రబాబు ప్రభుత్వ ఘనత. ఈ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితులు దారుణంగా దిగజారాయి' అని మాజీ హోం శాఖ మంత్రి తానేటి వనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని తన నివాసంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఫ్రస్టేషన్‌తో మాట్లాతున్నారని చెప్పారు. టీడీపీ అగ్ర నాయకులు ఆమెను మందలించారో ఏమో.. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ, ఏకవచనంతో గౌరవ మర్యాదలు లేకుండా మాట్లాడుతుండటం దారుణం అన్నారు. మంత్రి హోదాలో ఉన్నందున సభ్యతతో మాట్లాడాలని హితవు పలికారు. చంద్రబాబు, లోకేశ్‌ల ప్రశంసల కోసం దిగజారుడుతనంతో మాట్లాడటం సరికాదన్నారు. హోం మంత్రి వాడే పదజాలం చూస్తుంటే బాధ కలుగుతోందన్నారు. రాష్ట్రంలో విధ్వంసకాండ కొనసాగుతోంటే హోం మంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. శాంతి భద్రతలు పరిరక్షించాలన్న ఆలోచన ఏ కోశానా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేస్తే, కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించే తీరిక కూడా హోం మంత్రికి లేదా అని ప్రశ్నించారు. సన్మానాలు చేయించుకోవడానికి మాత్రం సమయం ఉందని ఎద్దేవా చేశారు. పోలీసులకు స్వేచ్ఛ ఇస్తే పరిస్థితులు చక్కబడ తాయని చెప్పారు.

ఉగ్రవాదుల కట్టడికి యువరక్తం!

సాక్షి, హైదరాబాద్: ఉగ్రవాదులపై నిఘా పెట్టడంలో ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) పాత్ర అత్యంత కీలకం. దేశంలోని అనేక నగరాలతోపాటు హైదరాబాద్‌లోనూ ముష్కర మూకల కుట్రలను తిప్పికొట్టడంలో ఐబీ తన మార్కు చూపించింది. ప్రస్తుతం నెలకొన్న పరిణామాలు, 'ఆన్‌లైన్ ఉగ్రవాదం' నేపథ్యంలో ఈ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని కేంద్రం నిర్ణయించింది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన మల్టీ ఏజెన్సీ కమిటీ(మ్యాక్) సమావేశంలో దీనికి సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కీలక ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర పరిధిలో ఉన్న వివిధ ఏజెన్సీల అధినేతలు ఈ ఉన్నతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఐబీ వంటి నిఘా విభాగాల్లో అనుభవానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. కొన్ని ఆపరేషన్లు సక్సెస్ కావడం అనేది అందులో పనిచేసిన వారి అనుభవం మీదే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న అనుభవజ్ఞులకు తోడు సాంకేతిక సవాళ్లను ఎదుర్కోవడానికి యువ అధికారులను ఎంపిక చేయాలని నిర్ణయించారు.

డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి 'కెప్టెన్ చైర్'తో సత్కారం



సాక్షి, హైదరాబాద్: ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. యూకేకు చెందిన జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాల యానికి చెందిన 'కెప్టెన్ చైర్'ను డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి అందజేశారు. గ్యాస్ట్రోఎంటరాలజీ రంగంలో డాక్టర్ రెడ్డి విశేష సేవలకు గుర్తింపుగా ఈ సన్మానం చేశారు. ఆ యూనివర్సిటీకి చెందిన గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ అన్నే మేరీ లెన్నాన్ ఆ కుర్చీని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి ఆదివారం అందజేశారు. 1874లో జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ వ్యవస్థాపక ప్రొఫెసర్ సర్ విలియం ఓస్లర్ కాలం నాటి ఈ కుర్చీ చారిత్రాత్మక ప్రాధాన్యాన్ని కలిగి ఉంది. వైద్య విద్యలో కృషికి పేరుగాంచిన సర్ ఓస్లర్ కెప్టెన్ కుర్చీని అందించే సంప్రదాయాన్ని ప్రారంభించారు. ప్రపంచంలో వైద్యరంగంలో విశేషకృషి చేసిన అధ్యాపకు లు, పూర్వ విద్యార్థులకు దీన్ని అందజేస్తారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లెన్నాన్ మాట్లాడుతూ, గ్యాస్ట్రోఎంటరాలజీలో డాక్టర్ రెడ్డి మార్గదర్శకత్వాన్ని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ గుర్తించిందని చెప్పారు.

గోదా'వడి'.. జింకల్లో అలజడి



గోదావరి లంకల్లో కృష్ణ జింకల సందడి

- కోనసీమ లంకల్లో అరుదైన కృష్ణ జింకలు
- కంటికి రెప్పలా చూసుకుంటున్న రైతులు
- వరదలతో గ్రామాల్లోకి వస్తున్న ప్రాణులు



సాక్షి అమలాపురం: చుట్టూ ఇసుక తిన్నెలు.. వాటి మధ్య ఒంపులు తిరుగుతూ ప్రవహించే గోదావరి.. అక్కడక్కడా నీటి చెలమలు.. ఆరు అడుగుల ఎత్తున పెరిగే గడ్డి దుబ్బులు.. వాటి కొసన తెల్లటి వింజామరల్లాంటి గడ్డి పువ్వులు. ప్రకృతి స్వర్గధామమైన కోనసీమలో గోదావరి లంకల్లో కనిపించే సహజ దృశ్యాలు ఇవి. చూసిన కనులదే భాగ్యం అన్నట్టు అప్పుడప్పుడూ చెంగుచెంగున గెంతే కృష్ణ జింకల సమూహాలు కనువిందు చేస్తాయి. గోదావరి నదీ పాయల్లోని మధ్య ప్రాంతంలో సహజ సిద్ధంగా ఏర్పడిన కొన్ని లంకల్లో జనం నివాసముండరు. ఆ లంకల్లో కృష్ణ జింకలు నివాసముంటున్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం, కొత్తపేట, అయినవిల్లి, ఆత్రేయపురం, ఆలమూరు, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాల్లోని గౌతమీ గోదావరి లంకల్లో వీటి ఉనికి అధికం. ఇటీవల మొక్కజొన్న పట్టుబడికి వెళ్లిన రైతులు ఊబలంక, నారాయణలంక, రావులపాలెం, కేదార్లంక సమీపంలో కృష్ణ జింక గుంపులు ఉండటాన్ని గుర్తించారు. లంక రైతులకు ఇవి పెంపుడు జంతువులుగా మారిపోయాయి. వీటి ఆలనాపాలనా స్థానిక లంక రైతులే చూస్తుంటారు. వీటిని వేటాడేందుకు వచ్చిన వారిని రైతులే అడ్డగిస్తారు. అవసరమైతే పోలీసులకు, అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించిన సందర్భాలున్నాయి.

ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టాలి

గోదావరిలో లంక భూములను రెవెన్యూ అధికారులు సొసైటీలకు అప్పగిస్తున్నారు. ఇక్కడ వరదలకు ఇసుక మేటలు వేస్తుంది. ఇది వ్యవసాయానికి యోగ్యం కాదంటూ ప్రజాప్రతినిధులతో కలిసి ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. తవ్వకాల వల్ల ఇక్కడ ఉండే చీమచింత చెట్లు, తుమ్మ చెట్లు, రేగి చెట్లు, రెల్లు గడ్డి దుబ్బులు కనుమరుగవుతున్నాయి. దీంతో కృష్ణ జింకలకు సహజ సిద్ధమైన ఆవాసాలు లేకుండా పోతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇవి నివాసముంటున్న లంక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలను ప్రభుత్వం నిలిపి వేయాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు. లంకలను అటవీ ప్రాంతాలుగా మార్పు చేయాలని, అప్పుడే ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టేందుకు వీలు కలుగుతుందని వారంటున్నారు. దీంతోపాటు వరదల సమయంలో వీటి రక్షణకు సరైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వరదలతో ముప్పు

వేటగాళ్ల కన్నా గోదావరి వరద కృష్ణ జింకల ఉనికికి ప్రమాదంగా మారింది. ప్రస్తుతం గోదావరికి వరద పోటెత్తడంతో కృష్ణ జింకల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. పోలవరం పరిసర ప్రాంతాల్లో కృష్ణ జింకలు వరదలు వచ్చిన సమయంలో అటవీ ప్రాంతాలకు వెళ్లిపోయేవి. కాని కోనసీమ జిల్లాలో ఆ పరిస్థితి లేదు. ఇవి వరదల్లో కొట్టుకుపోవడం లేదా ఏటిగట్లలో సురక్షిత ప్రాంతాల్లో రక్షణ పొందుతుంటాయి. 2022లో భారీ వరదలకు అధికంగా కృష్ణ జింకలు మృత్యువాత పడ్డాయని లంక రైతులు చెబుతున్నారు. వరదల సమయంలో రైతులను, పశువులను పడవల మీద మెరక ప్రాంతాలకు, ఏటిగట్ల మీదకు తరలిస్తుంటారు. అయితే జింకలను పట్టుకోవడం నేరం కావడం.. అవి వేగంగా పరుగు పెట్టడం వల్ల వీటిని మెరకకు తరలించడం ఇక్కడ రైతులకు అసాధ్యంగా మారింది.

మంత్ర ముగ్ధులను చేసే కృష్ణ జింకలు

కృష్ణ జింక అరుదైన జంతువు. మన రాష్ట్ర అధికార జంతువు కూడా. నలుపు.. తెలుపు.. గోధుమ వర్ణాల్లో మెలికలు తిరిగిన కొమ్ములతో... చెంగుచెంగున గెంతుతూ చూపరులను విశేషంగా ఆకర్షిస్తాయి. ఇవి మన దేశంతోపాటు పాకిస్తాన్, నేపాల్‌లో కూడా ఉంటాయి. పచ్చగడ్డితోపాటు పండ్లను ఆహారంగా తీసుకునే ఈ జింకలు 15 నుంచి 20 కలిసి మందగా తిరుగుతుంటాయి. వీటి కొమ్ములు మూడు నాలుగు మెలికలు తిరిగి 28 అంగుళాల పొడవు ఉంటాయి. మగ జింకలు పైభాగం నలుపు, లేదా గోధుమ రంగులో ఉంటుంది. దిగువన తెల్లరంగులో ఉంటుంది. ఆడజింకలు పూర్తిగా గోధుమ రంగులో ఆకట్టుకునేలా ఉంటాయి.

లంకలను అటవీ ప్రాంతాలుగా గుర్తించాలి



జింక రక్షణ కోసం అటవీ, జీవవైవిధ్య మండలిని, జిల్లా రెవెన్యూ అధికారులను పలు దఫాలుగా కోరుతున్నా ప్రయోజనం లేకుండా పోయింది. జింకలు నివాసముంటున్న లంకలను అటవీ ప్రాంతాలుగా గుర్తిస్తే ఆ చట్టాలతో కొంత రక్షణ కలుగుతుంది. లేకపోతే భవిష్యత్ తరాలు కృష్ణ జింకలను కేవలం ఫొటోల్లోనే చూడాల్సి వస్తుంది. – పెదపూడి బాపిరాజు, వాడపాలెం, కొత్తపేట మండలం

ప్రభుత్వానికి నివేదిస్తాం



కృష్ణ జింకల రక్షణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిస్తాం. వరదల సమయంలో కృష్ణ జింకలు అవి ఎంపిక చేసుకున్న సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోతాయి. వరదలు తగ్గిన తరువాత తిరిగి తమ నివాస ప్రాంతాలకు వెళతాయి.
– వరప్రసాద్, కోరంగి వైల్డ్ లైఫ్ రేంజ్, కాకినాడ జిల్లా

రెడ్ బుక్ కాదది బ్లడ్ బుక్

రాష్ట్రంలో రక్తపుటేరులు పారిస్తున్న టీడీపీ శ్రేణులు



- హత్యలు, దాడులతో రాష్ట్రం అల్లకల్లోలం
- ఇది ట్రైలరే.. సినిమా ముందుంది అంటూ బెదిరింపులు
- కనీసం శాంతి–భద్రతలను సమీక్షించని సీఎం చంద్రబాబు
- అసత్య ప్రచారంతో ఎదురు దాడి చేయాలని మంత్రులకు ఆదేశం
- ఫొటో ఆధారాలున్నా రాజకీయ హత్య కాదంటూ బుకాయింపు
- మరింత బరి తెగించమని చంద్రబాబు సంకేతం

సాక్షి, అమరావతి: 'పోలింగ్, కౌంటింగ్ మధ్య రెడ్ బుక్ టీజర్ చూపించాం.. చంద్రబాబు అధికారం చేపట్టిన తర్వాత రెడ్ బుక్ ట్రైలర్ చూపించాం.. అంతటితో అయిపోలేదు.. అసలు రెడ్ బుక్ సినిమా ముందుంది' అని టీడీపీ రౌడీ మూకలు బరి తెగిస్తున్నాయి. చంద్రబాబు ప్రభుత్వ అధికార గూండాగిరీకి పోలీసు శాఖ దాసోహమవడంతో టీడీపీ రెడ్‌బుక్ ఏకంగా బ్లడ్ బుక్‌గా రూపాంతరం చెంది విశృంఖలత్వం సృష్టిస్తోంది. రెడ్‌బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో రక్తపుటేరులు పారిస్తూ టీడీపీ నేతల రక్తదాహం తీరుస్తోంది. అయినా సరే ఇది చాలదు.. అంతకు మించి అంటూ ప్రభుత్వ నేతే వ్యాఖ్యానించడంతో పచ్చ మూకలు మరింతగా మరణ మృదంగం మోగించేందుకు బరి తెగిస్తున్నాయి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రంలో ఇప్పటికే 36 హత్యలు.. నలుగురిపై అత్యాచారం, ఆపై హత్యలు.. 16 అత్యాచారాలు.. వెయ్యికి పైగా దాడులతో రాష్ట్రం హడలెత్తిపోతోంది. అరాచకం రాజ్యం చేస్తుంటే రాక్షస గణం గంగవెర్రులెత్తిపోతూ సృష్టిస్తున్న విధ్వంసకాండకు రాజ్యాంగబద్ధ వ్యవస్థలు మౌన సాక్షిగా మిగిలి పోతుండటం పరిస్థితిని మరింతగా దిగజారుస్తోంది.

ఎదురు దాడి చేయండని మంత్రులకు ఆదేశం

హత్యలు, హత్యాయత్నాలు, దాడులతో రాష్ట్రం అట్టుడుకుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం బాధ్యతాయుతంగా స్పందించనే లేదు. పోలీసు ఉన్నతాధికారులతో శాంతిభద్రతలపై సమీక్షించ లేదు. పైగా విధ్వంసకాండను వెనకేసుకొచ్చే రీతిలో మంత్రి మండలి సమావేశంలో మాట్లాడటం విభ్రాంతి కలిగించింది. హత్యలు జరుగుతున్నా జరగలేదన్నట్టుగా మాట్లాడాలి కదా.. అని మంత్రులపై ఆగ్రహం వ్యక్తం చేయడం విస్మయ పరుస్తోంది. అసలు 36 హత్యలు ఎక్కడ జరిగాయని ఎందుకు ప్రశ్నించలేదని కూడా ఆయన మంత్రులను నిలదీశారు. వినుకొండలో వైఎస్సార్‌సీపీకి చెందిన రషీద్‌ను టీడీపీ వర్గీయుడు జిలానీ.. నడి వీధిలో దారుణంగా హత్య చేస్తే, అది అసలు రాజకీయ హత్యేకాదని వితండవాదం చేయడం టీడీపీకే చెల్లింది. టీడీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో క్రియాశీలకంగా పాల్గొన్న జిలానీ, అసలు తమ పార్టీకి చెందిన వ్యక్తే కాదని అడ్డగోలు వాదన చేయడం విడ్డూరం. అతను టీడీపీ ఎమ్మెల్యే సతీమణి జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆమెకు కేకు తినిపిస్తున్న ఫొటోలు, వీడియోలు బయటకు వచ్చినా సరే తమ పార్టీ నేత కాదనడం కంటే బుకాయింపు ఇంకేముంటుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే హోమ్ మంత్రి అనిత ఆదివారం హడావిడిగా మీడియా సమావేశం నిర్వహించి, అసలు 36 హత్యలు ఎక్కడ జరిగాయని ప్రశ్నించడం చంద్రబాబు పన్నాగానికి నిదర్శనం.

దాడులు, విధ్వంసానికి చంద్రబాబు 'పచ్చ'జెండా

పచ్చ మూకలు 45 రోజులకుపైగా యథేచ్ఛగా సాగిస్తున్న విధ్వంసకాండతో చంద్రబాబు ప్రభుత్వం సంతృప్తి చెందినట్టు లేదు. అందుకే ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గిన పోలీసులు బాధితుల ఫిర్యాదులే స్వీకరించడం లేదు. హత్యలు, హత్యాయత్నాలు, విధ్వంసం సృష్టిస్తున్న టీడీపీ, జనసేన నేతలపై కేసులు పెట్టే ధైర్యం పోలీసులకు లేదన్నది సుస్పష్టం. తద్వారా దాడులు కొనసాగించండి.. మేమున్నాం.. అనే రీతిలో టీడీపీ గూండాలను ప్రభుత్వ పెద్దలు ప్రోత్సహిస్తున్నారు. వినుకొండలో నడి వీధిలో హత్య చేసిన టీడీపీ వర్గీయుడు జిలానీని పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని అరెస్ట్ చూపిస్తూ పోలీసులు కనీసం ప్రెస్ మీట్ కూడా పెట్ట లేదు! ప్రెస్ మీట్ పెడితే ఎందుకు హత్య చేశారని మీడియా ప్రతినిధులు అతన్ని, పోలీసులను అడుగుతారు. అప్పుడు రాజకీయ కక్షతోనే హత్య చేశాడనే విషయం చెప్పాల్సి వస్తుంది. అందుకే గోప్యంగా రిమాండ్‌కు తరలించారు. చిత్తూరు జిల్లాలో టీడీపీ గూండాలు 37 ప్రదేశాల్లో రాళ్ల దాడులతో బీభత్సం సృష్టించారు. ఆ దాడుల్లో పాల్గొన్న ఒక్క టీడీపీ నేత, కార్యకర్త మీద కూడా కేసు నమోదు చేయనే లేదు. ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్పపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై కూడా పోలీసులు కేసు నమోదు చేయలేదు. పైగా బాధితులైన ఎంపీ మిథున్‌రెడ్డి, రెడ్డెప్పపైనే అక్రమ కేసులు బనాయించడం గమనార్హం. తిరుపతి జిల్లాలో టీడీపీ రౌడీ మూకలు 40 చోట్ల దాడులకు పాల్పడ్డాయి. ఒక్క సంఘటనలో కూడా టీడీపీ వర్గీయులను పోలీసులు అరెస్ట్ చేయలేదు. పైగా బాధితులైన 35 మంది వైఎస్సార్‌సీపీ వర్గీయులపై అక్రమ కేసులు పెట్టారు. ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం శంకరనగరంలో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్, ఆయన బంధువులపై దాడి చేస్తే.. ఆ కేసులో వైఎస్సార్‌సీపీ వర్గీయులు 13 మందిని అరెస్ట్ చేశారు. నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో టీడీపీ నేతలు వందల సంఖ్యలో దాడులకు తెగబడినా సరే వారిపై కేసులు నమోదు చేయనే లేదు. ఇటువంటి ఉదంతాలు రాష్ట్ర వ్యాప్తంగా వందల్లో ఉన్నాయి. తద్వారా రానున్న రోజుల్లో మరింత పెను విధ్వంసం సృష్టించేందుకు.. దాడులతో తెగబడేందుకు.. పచ్చ రౌడీలకు ప్రభుత్వం లైసెన్స్ ఇచ్చినట్టేనని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి, సామాన్యుల ప్రాణాలకు న్యాయ వ్యవస్థ, రాజ్యాంగబద్ధ సంస్థలే అండగా నిలబడాలని వారు కోరుతున్నారు.

పాఠశాల భవనానికి పచ్చ రంగు!



వైఎస్సార్ జిల్లా తెల్లపాడు ప్రాథమిక పాఠశాల భవనం ఇది. తెలుగుదేశం పార్టీ నేతలు ఇలా తమ పార్టీ రంగును పులిమారు. కొత్తగా పాఠశాలను నిర్మించడంతో ఇప్పటి వరకూ దీనిని గ్రామస్తులు మినరల్ వాటర్ ప్లాంట్‌గా వాడుకున్నారు. అయితే టీడీపీ నేతలు దీనిని పార్టీ కార్యాలయంగా మార్చుకుంటున్నారని తెలిసింది. – కలసపాడు

పేదల ఇళ్లకు సర్కారు షాక్!



పేదలకు సొంతింటి కల సాకారం కావాలంటే ప్రభుత్వం చేయూతనిస్తే తప్ప సాధ్యం కాదు. ఆ కలను నిజం చేయడానికి గత వైఎస్ జగన్ ప్రభుత్వం ఇదివరకెన్నడూ లేని రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలో అనపర్తి రోడ్డును ఆనుకుని ఉన్న స్థలంలో 435 మందికి నివాస స్థలాలను పంపిణీ చేశారు. ఎన్నికలకు ముందు సుమారు 40 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. చాలా వరకు ఇళ్ల నిర్మాణం తుది దశకు వచ్చాయి. ఈ దశలో ఎవరో ఫిర్యాదు చేశారని ఉన్నట్లుండి ఆ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ తొలగించారు. బాధితులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. 'మీ ఇళ్ల నిర్మాణ పనులను ఆపించేశానని బీజేపీ నాయకుడెవరో తప్పుడు ప్రచారం చేస్తున్నాడట. అతనెవరో ముందు తేల్చుకుని రండి. అప్పుడు చూద్దాం' అనడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. – రాజానగరం

నాని గాయాలన్నీ 'కట్టు' కథలే

- నాడు ఒక్క దెబ్బ కూడా తగల్లేదని స్విమ్స్ వైద్య నివేదికల్లో వెల్లడి
- మే 14న పులివర్తి నాని నటనతో అనేక మంది ఇక్కట్లపాలు
- ఎక్స్‌రే, ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్.. చేతికి కట్లు, కాళ్లకు బ్యాండేజ్‌తో నాడు హడావుడి
- జైల్లో మగ్గుతున్న 37 మంది.. పలువురు ఉద్యోగుల సస్పెన్షన్
- ఇప్పుడు నిజం నిగ్గు తేలడంతో మండిపడుతున్న జనం




చేతికి కట్టుతో పులివర్తి నాని (ఫైల్)

తిరుపతి రూరల్ (తిరుపతి జిల్లా): చేతులకు కట్లు, కాళ్లకు బ్యాండేజీలు, మూతికి మాస్క్‌తో తాను తీవ్రంగా గాయపడ్డానని పులివర్తి నాని చేసిన హడావుడి అంతా ఒట్టి నాటకమని తేలిపోయింది. నాని తల, శరీరం, చేయి, కాలు.. ఇతరత్రా ఆయన శరీరంలో ఎక్కడా చిన్న దెబ్బ కూడా లేదని తేటతెల్లమైంది. స్విమ్స్ వేదికగా ఆయన సాగించిన హంగామా అంతా ఉత్తుత్తి నటనేనని అదే స్విమ్స్‌లో ఆయనకు తీసిన ఎక్స్‌రే, ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్.. తదితర వైద్య పరీక్షలు స్పష్టం చేస్తున్నాయి. నాని 'కట్టు' కథలతో 37 మంది జైలు పాలయ్యారు. పలువురు ఉద్యోగులు బదిలీకి గురయ్యారు. ఇంతకూ ఏం జరిగిందంటే.. పోలింగ్ అనంతరం మే 14వ తేదీన మధ్యాహ్నం 3 గంటల సమయంలో తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీ వద్ద గొడవ జరిగింది. టీడీపీ అభ్యర్థి అయిన నాని ఆ తర్వాత రెండు గంటలపాటు వర్సిటీ పరిసరాల్లోనే హుషారుగా తిరిగారు. అనుచరులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. స్వయంగా ధర్నాలో నేలపై కూర్చుని ఆందోళనలు చేశారు. నాడు ఆ వీడియోలు విస్తృతంగా వైరల్ అయ్యాయి. అనంతరం గొడవ సద్దుమణిగాక ఇంటికి వెళ్లిపోయారు. ఇంట్లో కాసేపు సేద తీరాక ఒక వ్యూహం రూపొందించుకుని హుటాహుటిన స్విమ్స్‌కు బయలుదేరారు. అక్కడ వాహనం నుంచి దిగగానే.. నడవలేనట్లు.. శరీరం అంతా నొప్పులున్నట్లు అక్కడి వైద్యులకు చెప్పారు. వారు ఆయన తలకు, శరీరానికి, చేతికి, భుజాలకు, పొట్టకు, కాలికి.. ఇలా అన్ని రకాల వైద్య పరీక్షలు, ఎక్స్‌రేలు, సీటీ స్కానింగ్, ఎంఆర్ఐ సైతం చేశారు. ఆ గొడవలో తాను తీవ్రంగా గాయపడినట్టు పబ్లిసిటీ ఇచ్చుకుని తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. ఆ తర్వాత నానిపై దాడి జరిగిందని, ఆయనకు ఏమో అయిపోయిందని ఎన్నికల కమిషన్ అనేక మంది పోలీసులు, ఉద్యోగులను సస్పెండ్ చేసింది. అమాయకులైన 37 మందిపై పోలీసులు కేసులు పెట్టి, జైలుపాలు చేశారు. వారు ఇప్పటికీ జైలులో మగ్గుతున్నారు.

ఒక్క గాయం లేదని వైద్య నివేదికలు వెల్లడి

పులివర్తి నాని స్విమ్స్‌లో చేయించుకున్న వైద్య పరీక్షల నివేదికలు ఇటీవల వెలుగు చూశాయి. నాని తలకు, శరీరానికి, చేతికి, భుజానికి, పొట్టకు, కాలికి ఎక్కడా ఎలాంటి గాయాలు లేవని ఆ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఎక్స్‌రేలు, ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్.. ఇతరత్రా వైద్య పరీక్షలు అన్నిటిలోనూ నానికి ఎలాంటి గాయాలు లేవని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్లు స్పష్టమైంది. దీంతో నాని స్వార్థంతో ఆడిన నాటకం వల్ల ఇబ్బంది పడిన వారంతా ఇప్పుడు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్య నివేదికలను ముఖ్యమంత్రికి, హైకోర్టు, గవర్నర్, ప్రధానమంత్రి, రాష్ట్రపతికి పంపించేందుకు సిద్ధం అవుతున్నారు. తమ కుటుంబానికి పెద్ద దిక్కు అయిన వారు అనవసరంగా నెలల తరబడి జైలులో మగ్గుతున్నారని బాధితుల కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు. సస్పెండ్ అయి జీతాలు రాక, ఎన్నికల కమిషన్ చేసిన సస్పెన్షన్ ఎప్పుడు ఎత్తివేస్తారో తెలియక పలువురు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాని తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.



పులివర్తి నానికి నిర్వహించిన వివిధ వైద్యపరీక్షలు

అన్ని వైద్యపరీక్షల్లోను నార్మల్ అని వచ్చిన రిపోర్టులు

నాని నాటకం బట్టబయలు



రాజకీయ స్వార్థంతోనే నాని గాయపడినట్లు నాటకాలు ఆడారు. గాయం కాని ఘటనలో అమాయకులు 37 మందిపై కేసులు నమోదు చేయించి వేధించారు. దాడి చేయడానికి 37 మంది వస్తే ఏ చిన్న గాయం కాకుండా బయటకు వస్తారా? సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఉంటారా? ప్రజలు, ప్రభుత్వం, అన్ని పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు అందరూ ఆలోచించాలి. నాని అద్భుత నటనతో ఉద్యోగులు, పోలీసులను బలిపశువులు చేశాడు. 37 మందిని జైలుకు పంపించాడు. ఆ కుటుంబాల శాపం ఆయనకు తగిలి తీరుతుంది. దేవుడు, ప్రకృతి చాలా గొప్పవి.
– చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, చంద్రగిరి

మంచి మాట



ఉరుకులు పరుగులతో ఉరవడిగా వచ్చి తనని చేరిన నదిని సముద్రుడు ఒక ప్రశ్న అడుగుతాడు. "నీ ప్రవాహ వేగానికి మహావృక్షాలు విరిగి పడిపోతూ ఉంటాయి. ప్రబ్బలి మొక్కలు అలాగే ఉంటాయి. వాటిని నువ్వు ఏమీ చేయవా?" అని. నది ఈ విధంగా సమాధానం చెపుతుంది. "ప్రబ్బలి మొక్కలు వేగంగా ప్రవాహం వస్తుంటే ఎదురు నిలవక తలవంచి ఉంటాయి. ప్రవాహ వేగం తగ్గగానే యథాప్రకారం తలెత్తుతాయి. మహావృక్షాలు తలవంచవు" అని!

ఒదిగితేనే ఎదుగుదల

నది చెప్పినది వృక్షాలకి సంబంధించినదే అయినా మనకి కూడా వర్తిస్తుంది. ఎగిరెగిరి పడినా, ఎదిరించి నిలిచినా, ఎదురొడ్డి నిలిచినా విరిగి పడటం జరుగుతుంది. పొగరుబోతు గొర్రెపొటేలు కొండని గెలవగలనని కుమ్మి తల చిట్లి నశించినట్టు అవుతుంది. తమకి శక్తి లేకపోయినా అహంకారంతో ఎదుటివారి శక్తి సామర్థ్యాలని తక్కువగా అంచనా వేసి దెబ్బతింటూ ఉంటారు మహావృక్షాల వంటి వారు. పైగా తమ నీడలో మరి ఏ మొక్కకి కూడా పెరిగే అవకాశం ఇవ్వరు. దానితో ఆపదలో ఆదుకునే వారు, తోడ్పడేవారు ఉండక కూలిపోక తప్పదు. తల ఎగరేసి, తల పొగరుతో ఉండక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు తలవంచటం, పరిస్థితులు అనుకూలంగా మారినప్పుడు తలెత్తటం చేస్తారు తెలివిగల వారు గడ్డిపోచల లాగా. పెరుగుతున్న మొక్కకి ఏదైనా అడ్డు వస్తే, కొన్ని పక్కకి వంగి వెలుగు వచ్చే దారి చూసుకుని ఎదుగుతాయి. నిటారుగా మాత్రమే ఎదుగుతాము, వంగము అనుకున్న మొక్కలు గిడసబారతాయి.

> ఎదురీత నదిలోనే కాదు ఎక్కడైనా శ్రమతో కూడుకున్నదే. జీవితమనే ప్రవాహంలో కదిలే మనిషి అనుకూలమైన దిశలో సాగితే ప్రయాణం సుకరంగా ఉంటుంది. వ్యతిరేక దిశలో వెళ్ళటానికి ఎంతో శక్తిని వెచ్చించ వలసి ఉంటుంది. జీవితం సంఘర్షణ అవుతుంది. కొన్ని సందర్భాలలో ప్రవాహం ముందుకి తోస్తుంటే, తాను వెనక్కి వెళ్ళే ప్రయత్నం చేస్తుంటే అంగుళం కూడా కదలక ఉన్న చోటనే నిలిచి పోవలసి రావచ్చు. నిలదొక్కుకోలేక కూలబడవచ్చు. అప్పుడు ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. వీలు, వాలు చూసుకోవాలని పెద్దలు చెప్పేది అందుకే!


సముద్రంలో స్నానం చేయటానికి గాని, ఈత కొట్టటానికి గాని వెళ్ళేవారు అలకి అనుకూలంగా వెడతారు. అలతో పాటు లేచి పడతారు. అలకి వ్యతిరేక దిశగా ఈత కొడితే జరిగే అనర్థాలు అందరికీ తెలుసు. నదుల్లోనూ, కాలవల్లోనూ ఈతకి వెళ్ళేవారు ప్రవాహం ఎటువైపు ఉంటే అటే వెడతారు. వ్యతిరేక దిశలో వెడితే అది ఎదురీత. పడవలు కూడా ప్రవాహం వెళ్ళే దిశలో వేగంగా వెడతాయి. వ్యతిరేక దిశలో ప్రయాణం శ్రమతో కూడుకొని ఉంటుంది.

పరిస్థితులని గమనించకుండా ఉండే ఈ ప్రవర్తనకి మనిషిలో ఉండే అహంకారమే కారణం. నా అంతటి వారు లేరు అనే గుణం. నన్ను ఎదిరించగల వారు లేరు అనే పొగరు. ఎదుటివారి సామర్థ్యాన్ని గుర్తించలేని గుడ్డితనం. ఎగిరెగిరి పడుతూ ఉంటారు. అదిరిపాటుకి అంతూ దరీ ఉండవు. దీనినే 'మదం' అని కూడా అంటారు. విరగబాటుతనం ఉంటే ప్రవాహానికి ఎదురొడ్డిన మహావృక్షాల లాగా విరిగి పడటం తప్పదు.

అంటే ఎప్పుడూ పరిస్థితులకి, అవతలి వారి ఇష్టానిష్టాలకి తల ఒగ్గి, వ్యక్తిత్వం అన్నది లేకుండా బతక వలసిందేనా? అన్న సందేహం రావటం సహజం. పరిస్థితులని మార్చగల శక్తిసామర్థ్యాలు ఉంటే మంచిదే. ఎప్పుడూ అట్లా ఉండటం అసంభవం. ప్రతికూలంగా ఉన్న సందర్భాలలో ఎట్లా ఉండాలి అన్నది కూడా తెలియాలి కదా! రోగాన్ని తగ్గించే అవకాశం లేకపోతే ఉపశమనం కలిగించాలి. అనుకూల వాతావరణం వచ్చే దాకా ఊరుకోవటం ఉత్తమం. ''కొంచెముండుటెల్ల కొదువ కాదు'' అన్న వేమనని అనుసరించటం శ్రేయస్కరం.

– డా॥ ఎన్. అనంత లక్ష్మి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం



... అదే మనల్ని పట్టుకున్నది

ఇంద్రియాలను నిగ్రహించడం అంత తేలికకాదు. రావణాసురుడు రాముడి చేతిలో పది తలలు తెగి పడిపోయి ఉన్నాడు యుద్ధభూమిలో. మండోదరిని పల్లకీలో తీసుకొచ్చారు. అక్కడ ఆమె దిగింది. కాస్త దూరంలో రామలక్ష్మణులు నిలబడి ఉన్నారు. అందరూ అనుకున్నారు.. ''నా భర్తను నువ్వే చంపేసావ్ ... దుర్మార్గుడివి..'' అని రాముణ్ణి తిడుతుందనుకున్నారు. ఎంతయినా భర్త కదా, ఆక్రోశంలో నిందిస్తుందనుకున్నారు. ఆమె నేరుగా నేలపై పడి ఉన్న రావణుడి దగ్గరకు వెళ్లి..'' ఇంద్రియాణి పురా జిత్వా జితం త్రిభువనం త్వయా / స్మరద్భిరవ తద్వైరమింద్రియైరేవ నిర్జితః'' అన్నది. నీవు ఒకప్పుడు త్రిభువన సామ్రాజ్యాన్ని కోరుకున్నావు. ఆ కోరిక తీరడానికి తపస్సు చేసావు. ఆ సమయంలో ఇంద్రియాలను బలవంతంగా నిగ్రహించావు. కాలికింద తల దించుకుని పాము అవకాశం కోసం ఎదురు చూసినట్లు నీవు కోరుకున్న సామ్రాజ్యం రాగానే నీ ఇంద్రియాలే నిన్ను కాటేసాయి. మహాపతివ్రత సీతమ్మను వేధించావు. రాముని చేతిలో చచ్చిపోయావని అందరూ అనుకుంటున్నారు. నీ భార్యగా నాకు తెలుసు. రాముడి చేతిలో కాదు, నీ ఇంద్రియాల చేతిలోనే నీవు చచ్చిపోయావు'' అంది. ఈ మాటలను సీతమ్మ కూడా ముందే ఇంచుమించు ఇలాగే చెప్పింది..''నీ కామం నీ భార్యయందుంచుకో. ధర్మానికి కట్టుబడి ఉండు. దోషం లేదు. నీ కామం నీ భార్యను దాటిపోయిందా నీకు మహాపాపం చుట్టుకుంటుంది... వద్దు. ధూర్త విషయాలజోలికి వెళ్ళకు' అని హెచ్చరించింది కూడా..

అందువల్ల ఇంద్రియాలను నిగ్రహించడం అంత తేలికయిన పనేం కాదు. అరిషడ్వర్గాలకు దూరంగా ఉండాలని చెప్పడం చాలా తేలికే. అంటే కామానికీ, కోపానికీ... దూరంగా ఉండమంటున్నారు.. సరే.. అసలు కామాన్ని పట్టుకుని ఉంటే కదా... ఈ మాట అనవలసింది. మరి ....మనం పట్టుకోవడం కాదు... అదే మనల్ని పట్టుకుంటున్నది. అది వదలాలి అంటే... మొదట అది మనల్ని పట్టుకుందని గుర్తించాలి. తరువాత మనం ఏం చేస్తే అది పట్టు వదులుతుందో కూడా తెలుసుకోవాలి. ఇది అందరికీ అన్వయం అవుతుందా లేదా.. పక్కనబెట్టి గృహస్థుకు ఏ ధర్మం అన్వయం అవుతుందో అదే అన్వయం చేసుకోవాలి.

అందుకే ప్రహ్లాదుడు హిరణ్యకశిపుడితో మాట్లాడుతూ ...''లోకములన్నియున్ గడియలోన జయించినవాడవింద్రియా / నీకము జిత్తమున్ గెలువ నేరవు నిన్ను నిబద్ధు జేయు నీ/ భీకర శత్రు లార్వుర బ్రభిన్నుల జేయుము ప్రాణికోటిలో/ నీకు విరోధి లే డొకడు నేర్పున? జూడుము దానవేశ్వరా!' అంటాడు. నీవు లోకాలన్నీ గెలిచానంటున్నావు కదా... ముందు నీ ఇంద్రియాలను నీవు గెలిచావా? నీ మనసును గెలిచావా? అది చెప్పు.. వాటిని గెలవడం అంత తేలిక కాదు. వాటిని గెలువు. గెలిస్తే... అప్పుడు నీకు శత్రువన్న వాడెవడూ ఎదురుగా కనబడడు. అందరూ మిత్రులే...అంటాడు. కాబట్టి అది అనుష్ఠానం చేత గెలవాలి. అంటే సుఖాన్ని ధర్మంతో కట్టేసి ఉంచాలి. అప్పుడు ధర్మబద్ధమైన అర్థం ప్రభవిస్తుంది. కామం ధర్మబద్ధమైనప్పుడు సంతానం కూడా ధర్మబద్ధంగానే ఉంటుంది. సమాజం నైతికంగా ఒక క్రమ పద్ధతిలో, సుఖసంతోషాలతో, ప్రశాంతంగా పురోగమిస్తుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి



దానంలో ఘటికుడు

పూర్వం కశ్యపబుద్ధుని కాలంలో వేగళింగ అనే నగరం ఉండేది. ఆ నగర శివారులో ఘటికారుడు అనే కుమ్మరి ఉండేవాడు. అతనికి జ్యోతిపాలుడు అనే మిత్రుడు ఉండేవాడు. అప్పుడు ఆ ప్రాంతాన్ని కికీలుడు అనే రాజు పాలిస్తూ ఉండేవాడు.

ఘటికారుడు కశ్యప బుద్ధుని ఉపాసకుడు. కశ్యపుని ధర్మ ప్రబోధాలు విని ధార్మికంగా జీవిస్తూ ఉండేవాడు. కుండలు చేయడానికి కావలసిన మట్టిని పలుగు పారలతో తవ్వి తీసేవాడు కాదు. క్రిమికీటకాలు తన పలుగు కింద పడి చనిపోతాయని. ఎలుకలు తవ్వి పోసిన మట్టిని మాత్రమే తీసుకుని పోయి కుండలు చేసేవాడు. ఆ కుండల్ని కూడా ఎక్కువ ధరకు అమ్మేవాడు కాదు. వాటిని అరుబయట ఉంచేవాడు. కావలసిన వాళ్లు కుండల్ని తీసుకుని అక్కడ ఉంచిన గంపల్లో తాము చెల్లించాల్సిన ధరకు సరిపడే ధనాన్ని గానీ, నూకల్ని గానీ, ధాన్యాన్ని గానీ ఉంచి వెళ్ళేవారు. అలా... నిజాయితీగా, ధర్మబద్ధంగా తాను జీవిస్తూ అందరూ జీవించాలని కోరుకునేవాడు.

అతని తల్లిదండ్రులు ఇద్దరూ అంధులు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వారి ఆలనా పాలనా చూసేవాడు. వారు కూడా ధార్మికులే. ఇతరులు లేని సమయంలో ఎవరైనా భిక్షువులు గానీ, యోగులుగానీ భిక్షకు వస్తే...''అయ్యా! మేము ఇద్దరం గుడ్డివాళ్ళం. లేవలేని ముసలివాళ్ళం. అదిగో ఇంట్లో ఉట్టిమీద ఆహారం ఉంది. మీకు కావలసినంత మీరే తీసుకోండి. మేము ఇచ్చే భిక్షగా భావించండి'' అనేవారు.

ఒకరోజున కికీలుడు తన రాజభవనం ముందు నిలబడ్డాడు. అటుగా కశ్యపబుద్ధుడు తన శిష్యగణంతో వెళ్తున్నాడు. కికీలక మహారాజు వారి ముందుకు వచ్చి నమస్కరించి- ''భగవానులు మమ్ము అనుగ్రహించాలి. భిక్షుసంఘంతో వచ్చి మా ఆతిథ్యం స్వీకరించాలి'' అని వేడుకున్నాడు.

''లేదు మహారాజా! నేను వేరొకరికి మాట ఇచ్చాను'' అన్నాడు.

''ఎవరికి భగవాన్? నేను ఈ దేశానికి రాజుని. ప్రభువుగా వెళ్ళి వారిని అర్థిస్తాను. ఈరోజు ఆ అవకాశం నాకు ఇవ్వమంటాను. మరోమారు వారిని తీసుకోమంటాను'' అన్నాడు.

''లేదు మహారాజా! ఈ రోజు నేను వారి ఇంటనే భిక్ష స్వీకరించాలి'' అని ముందుకు నడిచాడు. భిక్షుగణం ఊరి చివరకు వెళ్ళింది. అప్పటికే పట్టిన మబ్బుల్నుండి సన్నని చినుకులు రాలుతున్నాయి. భిక్షు సంఘం వెళ్ళేసరికి... ఘటికారుని పూరిపాక మీద పరచిన ఎండు గడ్డిని తీసివేసి కట్టలు కట్టారు. ఆ కట్టల్ని ఎవరో మోసుకుపోతున్నారు. గడ్డి తీయడంతో పాక మీద ఖాళీలు కనిపిస్తున్నాయి. కశ్యప బుద్ధుణ్ణి వారు గౌరవంగా ఇంటి వసారాలోకి ఆహ్వానించారు. ఆ చూరు కిందే కూర్చుని పచ్చడి మెతుకుల భిక్ష స్వీకరించారు. వర్షం పెరిగింది. తడుస్తూనే ధర్మోపదేశం చేశాడు కశ్యపుడు. ఘటికారుడు కశ్యపునికి పాదాభివందనం చేశాడు. భిక్షాగణం తిరిగి బయలుదేరింది. దారిలో చెట్టుకింద కికీలమహారాజు కనిపించాడు.

''చూశావా! మహారాజా! ఘటికారుడు ఎంతటి దానపరుడో! ఎవరో గడ్డి అడిగారు. తన దగ్గర లేదు. అయినా తన ఇంటి మీద పరచిన గడ్డిని తీసి దానం చేశాడు. అతను మహాదాత. అతని భిక్ష స్వీకరించడం మాకు ఎంతో సంతోషం.'' అంటూ ముందుకు కదిలాడు.

తాను సమర్పించే గొప్ప భోజనాన్ని కాదని, పూరిగుడిసెలో పచ్చడి మెతుకుల కోసం కశ్యప బుద్ధుడు ఎందుకు వెళ్ళాడో రాజుకి అర్థమైంది. తనకంటే ఘటికారుడే గొప్పవాడని గ్రహించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

ఏ దివిలో విరిసిన పారిజాతమో



జూలై 22
దాశరథి శత జయంతి ప్రారంభం

ఏ దివిలో విరిసిన పారిజాతమో
ఏ కవిలో మెరిసిన ప్రేమ గీతమో
నా మదిలో నీవై నిండిపోయెనే...

ఈ పాట ఉన్న సినిమా పేరు చాలామందికి తెలియకపోవచ్చు. సినిమా విడుదలయ్యి 50 సంవత్సరాలయ్యిందని కూడా తెలియకపోవచ్చు. హీరో ఎవరో. హీరోయిన్ ఎవరో. కాని పాట నిలిచింది. రాసిన దాశరథి నిలిచారు. పాడిన గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కూడా. '*నిదుర మబ్బును మెరుపు తీగవై కలను రేపినది నీవే*' అని ఇదే పాటలో రాశారు దాశరథి. సినిమా సంగీత ఆకాశంలో కొన్ని నిదుర మబ్బులను తన రాకతో దాశరథి చెదరగొట్టారు. కొన్ని దివ్య పద ద్వారాలను తెరిచారు.

దివి నుంచి భువికి దిగి వచ్చె దిగి వచ్చె
పారిజాతమే నీవై నీవై

ఇది 'తేనె మనసులు' కోసం దాశరథి రాశాక కె.వి.మహదేవన్ ట్యూన్ చేసిన పాట. కాని 'ఇద్దరు మిత్రులు' కోసం సాలూరి రాజేశ్వరరావు హార్మోనియం పెట్టెను ముందరేసుకుని 'మీరు ట్యూన్‌కి రాస్తారా, రాస్తే నన్ను ట్యూన్ చేయమంటారా?' అని అడిగారు దాశరథిని. బహుశా దాశరథి ఆ క్షణంలో నవ్వుకుని ఉంటారు. నిజాము మీద యుద్ధగళం విప్పి వరంగల్ జైలులో బందీ అయినపుడు ఒక రాత్రి ఆయనను ఉన్నట్టుండి ఇతర రాజకీయ ఖైదీలతో కలిపి నిజామాబాద్ జైలుకు బయలుదేరదీశారు పోలీసులు. అది డిసెంబర్ నెల. రాత్రి. భయంకరమైన చలి. ఎక్కడకు తీసుకెళుతున్నారో తెలియని అయోమయం. దాశరథి ఆ చలిలో, బిక్కచచ్చిన తోటి రాజకీయ ఖైదీలను ఉత్తేజపరుస్తూ కవిత్వం అందుకున్నారు. ఆశువుగా. తెగిపడే కంఠంతో. ఒక్కో కవితా కాగడ. వెచ్చదనం రాజేస్తున్న నెగడు. అలాంటి దాశరథికి- పళ్ల తోముకోవడానికి బొగ్గుముక్క ఇస్తే జైలు గోడలను కవిత్వంతో నింపిన దాశరథికి- ట్యూన్ ఇస్తే ఎంత. నేరుగా రాయమంటే ఎంత. 'ఎలాగైనా పర్వాలేదండీ' అన్నారు దాశరథి. సాలూరు ట్యూన్ ఇచ్చారు. 'నేను తాంబూలం వేసుకు వస్తాను. ఆలోచిస్తూ ఉండండి' అని బయటకు వెళ్లి వచ్చిన ఆయన ఎర్రబడ్డ నోటిని ఆశ్చర్యంతో తెరిచారు. పల్లవి రెడీ!

ఖుషీ ఖుషీగా నవ్వుతూ చెలాకి మాటలు రువ్వుతూ
హుషారు గొలిపేవెందుకే నిషా కనులదానా

ఈ ఖుషీ ఆ నిషా అప్పటి వరకూ తెలుగు పాట ఎరగదు. ఇది దాశరథి ఇచ్చిన హైదరాబాద్ టచ్. దక్కనీ మిఠాస్. పాట హిట్ అయ్యింది. దాశరథి నుంచి 'గాలిబ్ గీతాల' సంపుటిని అంకితం తీసుకున్నందుకు అక్కినేని 'ఇద్దరు మిత్రులు' ద్వారా ఇచ్చిన అవకాశం కవికి విజయావకాశంగా మారింది. తెలుగు పాట దాశరథిని చూసి ఇలా అంది –

నా కంటి పాపలో నిలిచిపోరా
నీ వెంట లోకాల గెలవనీరా

ఇద్దరు హైదరాబాద్ కవులు ఒక సంవత్సరం తేడాలో తెలుగు పరిశ్రమలో అడుగు పెట్టారు. మొదట అక్కినేని ద్వారా దాశరథి (1961). తర్వాత ఎన్టీఆర్ ద్వారా సి. నారాయణ రెడ్డి (1962). దాశరథిది మొదటి నుంచి పోరుగీతం. ఆయన స్వయంగా నిజాం వ్యతిరేక ఉద్యమకారుడు. అజ్ఞాతంలో ఉన్నారు. జైలులో బాధలు పడ్డారు. ఆల్ ఇండియా రేడియోలో 1956 నుంచి '71 వరకూ ఉద్యోగాన్ని కాపాడుకుంటూ సినిమా కవిగా అవకాశాలు ఉపయోగించుకున్నారు. 1977 నుంచి '83 వరకు అంటే ఎన్టీఆర్ వచ్చి రద్దు చేసే దాకా దాశరథి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆఖరు ఆస్థానకవి. ఆ పదవిలో ఉండగా సినిమా గీతాలు ఆయన పెద్దగా రాయలేదు. దానికి తోడు 1987లో 62 ఏళ్ల వయసులో ఎదురైన అకాల మరణం దాశరథికి సుదీర్ఘ సినిమా కెరీర్ లేకుండా చేసింది. ఆయన సుమారు 620 పాటలు రాసి ఉండవచ్చు. రాసింది తక్కువైనా హిట్ అయినవి ఎక్కువ. చెట్టు పిట్ట కూడా పాడుకున్న పాట ఆయనది.

గోదారి గట్టుంది గట్టు మీన సెట్టుంది
సెట్టు కొమ్మన పిట్టుంది పిట్ట మనసులో ఏముంది

అన్నపూర్ణ, ఆదుర్తి ఇలా ఒకటి రెండు అనుబంధాలు తప్ప దాశరథి ప్రత్యేకంగా ఏదో ఒక గ్రూప్‌తో లేదా సంస్థతో కలిసి ఉన్నట్టు లేదు. సినిమా రంగంలో ప్రతిభతో పాటు పి.ఆర్ కూడా ముఖ్యం. తిరగబడే కవికి అలాంటి స్వభావం తక్కువ. ఆశ్చర్యం ఏమిటంటే ఇంత ఉడుకునెత్తురు కవికి సినిమాలో ఆవేశ కావేశాల పాటలు ఏమాత్రం దక్కలేదు. చాలా మటుకు ప్రేమగీతాలు, ఎన్నటికీ మాయని యుగళ గీతాలు.

ఎన్నెన్నో జన్మల బంధం నీది నాది
ఎన్నటికీ మాయని మమత నాది నీది

దాశరథి కుటుంబ అనుబంధాలను రాశారు. '*అన్నా నీ అనురాగం ఎన్నో జన్మల పుణ్యఫలం*' ఆయనదే. '*బాబూ వినరా... అన్నాదమ్ముల కథ ఒకటి*'... '*అమ్మ అన్నది ఒక కమ్మని మాట*'.... అలాగే కవ్వింతలూ రాశారు... '*అది ఒక ఇదిలే అతనికి తగులే*'... భార్య అలక భర్త వేడుకోలు... '*ఓ చెలి కోపమా... అంతలో తాపమా*'... ఊరడింపు '*గోరొంక గూటికే చేరావు చిలకా... భయమెందుకే నీకు బంగారు మొలకా*'... దరఖాస్తు... '*విన్నవించుకోనా... చిన్న కోరిక*'... 'కాజల్' సినిమా కోసం సాహిర్ రాసిన '*ఛూలేనేదో నాజూక్ హోటోంకో*' విఖ్యాత గీతాన్ని దాశరథి ఎంత కోమలంగా తెలుగు చేశారో చూడండి. 'తాగాలి' కాదు 'తాకాలి' అన్నారు.

నీ లేత గులాబి పెదవులతో
కమ్మని మధువును తాకాలి

దాశరథికి కృష్ణ అనుబంధం ఉంది. దైవబంధం ఉంది. ఆయన పాటలు ఆలయాల్లో నేటికీ సుప్రభాత గీతాలు. '*పాడెద నీ నా నామమే గోపాల*'... '*రారా కృష్ణయ్య రారా కృష్ణయ్య*', '*కన్నయ్యా... నల్లని కన్నయ్య*'... '*మనసే కోవెలగా... మమతలు మల్లెలుగా... నిన్నే కొలిచెదరా... కృష్ణా*'... '*నేనె రాధనోయి గోపాలా*'... '*నడిరేయి ఏ జాములో స్వామి నిను చేర దిగి వచ్చునో*'... '*మము పాలింపగ నడిచి వచ్చితివా*'... వాణీ జయరామ్‌కు దాశరథి వల్ల దక్కిన పూలసజ్జ వంటి గీతం చూడండి.

పూజలు చేయ పూలు తెచ్చాను
నీ గుడి ముందే నిలిచాను
తీయరా తలుపులను రామా...

దాశరథికి వీణ ఇష్టం. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్నారు. సినిమా గీతాల్లో కూడా ఆయన ఈ వీణానాదాన్ని పలికించారు. '*మదిలో వీణలు మ్రోగె*'... '*నీవు రావు నిదుర రాదు*'.. '*వేణుగాన లోలునిగన వేయి కనులు చాలవులే*'.... ఇక ఈ పాట?

మ్రోగింది వీణ పదే పదే హృదయాలలోనా
ఆ దివ్యరాగం అనురాగమై సాగిందిలే....

నేటి నుంచి దాశరథి శతజయంతి సంవత్సర వేడుకలు మొదలుకానున్నాయి. సినిమా రంగం, సినీ సంగీత రంగం, సినీ గేయకర్తలు, అభిమానులు సమావేశాలు, సంగీత విభావరులు నిర్వహించుకుని దాశరథి పాటలను మళ్లీ తలుచుకుని పాడుకోవాల్సిన సందర్భం ఇది. అయితే మన సినిమా రంగానికి పెద్దగా ఇటువంటి వాటికి సమయం ఉండదు. కాని ప్రజల వద్ద శ్రోతల వద్ద ఉంటుంది. సత్కవిని తమ నాల్కల యందు నుంచి కడిగేసే మూర్ఖులు ఎంత మాత్రం కారు వారు. పాడుకుంటూ ఉంటారు. పాడుతూనే ఉంటారు. వారికి తనివి తీరదు.

తనివి తీరలేదే నా మనసు నిండలేదే
ఏనాటి బంధమీ అనురాగం

– కె

బచ్చన్ ఫిక్స్



రవితేజ

'మిస్టర్ బచ్చన్' ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ఫిక్స్ అయ్యాడు. రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లు ఆదివారం ప్రకటించారు మేకర్స్. ''మిస్టర్ బచ్చన్' పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మూవీని విడుదల చేస్తున్నాం. ఆగస్టు 14న ప్రీమియర్ షోలు వేస్తున్నాం. ఆగస్టు 19న రక్షా బంధన్ సెలవు ఉంటుంది. 5 రోజుల లాంగ్ వీకెండ్ మా మూవీకి ప్లస్ అవుతుందనుకుంటున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది.

నేను చేసిన తప్పులకు కృతజ్ఞతలు

– ధనుష్



సందీప్, ప్రకాశ్‌రాజ్, ధనుష్, దుషారా విజయన్, అపర్ణా బాలమురళి, సురేష్‌బాబు, జాన్వీ

''నా మొదటి సినిమా నుంచి ఇప్పటివరకూ మంచి దర్శకులతో పనిచేశాను. వాళ్లందరి దగ్గరి నుంచి ఒక్కో విషయం నేర్చుకుంటూ వచ్చి డైరెక్టర్ అయ్యాను. నాకు నటనకంటే కూడా డైరెక్షన్ అంటే ఎక్కువ ఇష్టం'' అని ధనుష్ అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'రాయన్'. ప్రకాశ్ రాజ్, దుషారా విజయన్, అపర్ణా బాలమురళి, విష్ణు విశాల్, సందీప్ కిషన్ కీలక పాత్రలు పోషించారు. కళానిధి మారన్ నిర్మించిన 'రాయన్' ధనుష్ కెరీర్‌లో 50వ సినిమా. ఈ మూవీ తెలుగు, తమిళ, మలయాళ, కన్నడలో ఈ నెల 26న విడుదల కానుంది. తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో రిలీజ్ అవుతోంది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ధనుష్ మాట్లాడుతూ–''నేను ముఖ్యంగా రెండు విషయాలకు కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నాను. ఒకటి.. నా మొదటి సినిమా నుంచి 49వ సినిమా వరకూ నేను పని చేసిన దర్శకులందరికీ కృతజ్ఞతలు. రెండోది.. నేను చేసిన తప్పులకు కృతజ్ఞతలు. ఈ వేడుకలో నా గత చిత్రాలకు సంబంధించిన ఏవీ వేసినప్పుడు నాకు చాలా తప్పులు కనిపించాయి. ఆ తప్పుల నుంచి చాలా నేర్చుకున్నాను. ఇక గొప్పగా చెప్పుకునే సినిమా ఇవ్వాలనే 'రాయన్' చేశాను. తెలుగులో ఎన్టీఆర్‌తో మల్టీస్టారర్ చేయాలనుంది. నాకు తెలుగు వంటకాల్లో ఆవకాయ పప్పన్నం అంటే ఇష్టం'' అన్నారు. ''ధనుష్ సౌత్ ఇండియా, నార్త్ ఇండియా అని కాకుండా ఇండియన్ ఇండస్ట్రీలోనే ఫైనెస్ట్ హీరో అండ్ ఫైనెస్ట్ ఆర్టిస్ట్ అనిపించుకున్నారు. క్రిస్మస్‌కి 'గేమ్ చేంజర్' సినిమాతో కలుద్దాం'' అన్నారు 'దిల్' రాజు. ''రాయన్' ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా'' అన్నారు డి. సురేష్‌బాబు. నిర్మాతలు సునీల్ నారంగ్, భరత్ నారంగ్, డైరెక్టర్ గోపీచంద్ మలినేని తదితరులు పాల్గొన్నారు.

రాకీ ప్రపంచంలోకి...

విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. కాగా శ్రద్ధా శ్రీనాథ్‌ని స్వాగతిస్తూ, ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''మెకానిక్ రాకీ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నా'' అని ఈ సందర్భంగా శ్రద్ధా శ్రీనాథ్ పేర్కొన్నారు. ''ముక్కోణపు ప్రేమకథగా రూపొందుతోన్న చిత్రం 'మెకానిక్ రాకీ'. మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది. దీపావళి కానుకగా అక్టోబర్ 31న సినిమాని విడుదల చేయనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మనోజ్ కాటసాని.



శ్రద్ధా శ్రీనాథ్

సాక్షి
సోమవారం
22-7-2024

స్పోర్ట్స్



బీసీసీఐ నుంచి ఐఓఏకు రూ. 8 కోట్ల 50 లక్షలు

పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడనున్న భారత క్రీడాకారులకు ఆర్థిక సహకారం అందించాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘానికి (ఐఓఏ) రూ. 8 కోట్ల 50 లక్షలు ఇస్తామని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. ఈనెల 26న మొదలయ్యే పారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో దేశం గర్వపడేలా చేయాలని జై షా ఆకాంక్షించారు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ నుంచి 16 క్రీడాంశాల నుంచి 117 మంది క్రీడాకారులు బరిలో ఉన్నారు.

రన్నరప్ సహజ జోడీ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ75 మహిళల టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచింది. అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలోని ఇవాన్స్‌విల్లె పట్టణంలో ఈ టోర్నీ జరిగింది. డబుల్స్ ఫైనల్లో సహజ (భారత్)-హిరోకో కువాటా (జపాన్) జోడీ 2-6, 0-6తో అలీసియా లినానా (స్పెయిన్)-మెలానీ క్రివోజ్ (అర్జెంటీనా) ద్వయం చేతిలో ఓడిపోయింది. సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సహజ 7-5, 2-6, 6-7 (6/8)తో ఇరీనా షమనోవిచ్ (రష్యా) చేతిలో పోరాడి ఓడిపోయింది.



'హాల్ ఆఫ్ ఫేమ్'లో పేస్, విజయ్ అమృత్‌రాజ్

న్యూపోర్ట్ (అమెరికా): భారత దిగ్గజ టెన్నిస్ క్రీడాకారులు లియాండర్ పేస్, విజయ్ అమృత్‌రాజ్‌లకు గొప్ప గౌరవం లభించింది. ఈ ఇద్దరికీ అంతర్జాతీయ టెన్నిస్ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు కల్పించారు. ఆసియా నుంచి ఈ గౌరవం పొందిన టెన్నిస్ క్రీడాకారులు వీరిద్దరే కావడం విశేషం. 51 ఏళ్ల పేస్ వరుసగా ఏడు ఒలింపిక్స్ క్రీడల్లో (1992 బార్సిలోనా నుంచి 2016 రియో వరకు) పోటీపడ్డ ఏకైక టెన్నిస్ క్రీడాకారుడిగా రికార్డు నెలకొల్పాడు. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో వ్యక్తిగత సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం నెగ్గిన పేస్ డేవిస్‌కప్‌లో భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించాడు. తన సుదీర్ఘ కెరీర్‌లో పురుషుల డబుల్స్‌లో 8 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో 10 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌ను గెల్చుకున్న పేస్‌కు 'ప్లేయర్ కేటగిరీ'లో హాల్ ఆఫ్ ఫేమ్‌లోకి ఎంపిక చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో మహిళా దిగ్గజ టెన్నిస్ ప్లేయర్ మార్టినా నవ్రతిలోవా చేతుల మీదుగా పేస్ 'హాల్ ఆఫ్ ఫేమ్' పతకాన్ని అందుకున్నాడు. మరోవైపు 70 ఏళ్ల విజయ్ అమృత్‌రాజ్ 1974, 1987లలో భారత జట్టు డేవిస్‌కప్ ఫైనల్‌కు చేరుకోవడంలో కీలకపాత్ర పోషించారు. ఇప్పటి వరకు 28 దేశాల నుంచి 267 మంది టెన్నిస్ ప్లేయర్లకు 'హాఫ్ ఆఫ్ ఫేమ్'లో స్థానాన్ని కల్పించారు.

ఎదురులేని భారత్

- 78 పరుగులతో యూఏఈపై ఘనవిజయం
- రిచా, హర్మన్‌ప్రీత్ మెరుపులు
- టి20ల్లో తొలిసారి 200 స్కోరు దాటిన టీమిండియా
- మంగళవారం నేపాల్‌తో చివరి మ్యాచ్



దంబుల్లా: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత మహిళా క్రికెటర్లు ఆసియా టి20 టోర్నీలో మరో భారీ విజయం సాధించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టుతో ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 78 పరుగుల తేడాతో ఘనవిజయం నమోదు చేసింది. వరుసగా రెండో గెలుపుతో భారత జట్టుకు సెమీఫైనల్ బెర్త్ దాదాపు ఖరారైంది. యూఏఈ కెప్టెన్ ఇషా ఓజా ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు చేసింది. అంతర్జాతీయ టి20ల్లో భారత్‌కిదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఓపెనర్లు షఫాలీ వర్మ (18 బంతుల్లో 37; 5 ఫోర్లు, 1 సిక్స్), స్మృతి మంధాన (9 బంతుల్లో 13; 1 ఫోర్, 1 సిక్స్) మెరుపు ఆరంభాన్నిచ్చారు. స్మృతి వెనుదిరిగిన కాసేపటికి టీమిండియా వరుస బంతుల్లో షఫాలీ, హేమలత వికెట్లను చేజార్చుకుంది. దాంతో భారత్ 5.1 ఓవర్లలో 52 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (47 బంతుల్లో 66; 7 ఫోర్లు, 1 సిక్స్), జెమీమా రోడ్రిగ్స్ (13 బంతుల్లో 14) భారత్‌ను ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 54 పరుగులు జోడించారు. జెమీమా అవుటయ్యాక హర్మన్‌తో కలిసిన వికెట్ కీపర్ రిచా ఘోష్ (29 బంతుల్లో 64 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) యూఏఈ బౌలర్ల భరతం పట్టింది. వీరిద్దరు ఐదో వికెట్‌కు 45 బంతుల్లో 75 పరుగులు జత చేశారు. చివరి ఓవర్ తొలి బంతికి హర్మన్‌ప్రీత్ రనౌటవ్వగా... మిగిలిన ఐదు బంతుల్లో రిచా ఐదు ఫోర్లు కొట్టింది. ఈ క్రమంలో రిచా 26 బంతుల్లో తన అర్ధ సెంచరీని పూర్తి చేసుకుంది. అంతేకాకుండా తొలిసారి టి20ల్లో భారత జట్టు స్కోరును 200 పరుగులు దాటించింది. 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసి ఓడిపోయింది. ఇషా ఓజా (38; 5 ఫోర్లు, 1 సిక్స్), కవీషా (40 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. రిచా ఘోష్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. లెగ్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ ఎడమ చేతికి గాయం కావడంతో ఆమె ఈ టోర్నీ నుంచి వైదొలిగింది. శ్రేయాంక స్థానంలో తనూజా కన్వర్ ఈ మ్యాచ్‌తో టీమిండియా తరఫున అరంగేట్రం చేసింది. భారత జట్టు తమ చివరి లీగ్ మ్యాచ్‌ను మంగళవారం నేపాల్ జట్టుతో ఆడుతుంది. గ్రూప్ 'ఎ'లో జరిగిన మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో నేపాల్ జట్టును ఓడించి సెమీఫైనల్ అవకాశాలను సజీవంగా నిలబెట్టుకుంది.

స్కోరు వివరాలు

భారత ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (సి) తీర్థ (బి) సమైరా 37; స్మృతి మంధాన (సి) రినిత (బి) కవీషా 13; హేమలత (బి) హీనా 2; హర్మన్‌ప్రీత్ కౌర్ (రనౌట్) 66; జెమీమా (సి) రినిత (బి) కవీషా 14; రిచా ఘోష్ (నాటౌట్) 64; పూజ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1-23, 2-52, 3-52, 4-106, 5-181. **బౌలింగ్:** సమైరా 4-0-42-1, ఖుషీ శర్మ 1-0-15-0, కవీషా 4-0-36-2, హీనా 4-0-40-1, వైష్ణవి 3-0-28-0, ఇషా ఓజా 2-0-26-0, ఇందుజ 2-0-14-0.

యూఏఈ ఇన్నింగ్స్: ఇషా ఓజా (స్టంప్డ్) రిచా (బి) తనూజా 38; తీర్థ (సి) హర్మన్‌ప్రీత్ (బి) రేణుక 4; రినిత (బి) పూజ 7; సమైరా (సి) తనూజా (బి) దీప్తి 5; కవీషా (నాటౌట్) 40; ఖుషీ శర్మ (సి) స్మృతి (బి) రాధ 10; హీనా (సి) షఫాలీ (బి) దీప్తి 8; రితిక (రనౌట్) 6; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 123. వికెట్ల పతనం:** 1-11, 2-24, 3-36, 4-76, 5-95, 6-107, 7-123. **బౌలింగ్:** రేణుక సింగ్ 4-0-30-1, తనూజా కన్వర్ 4-0-14-1, పూజా వస్త్రకర్ 4-1-27-1, దీప్తి శర్మ 4-0-23-2, రాధా యాదవ్ 4-0-29-1.

'పంచ్' పతకం తెచ్చేనా!

ఆశల పల్లకిలో భారత బాక్సర్లు

- అందరి కళ్లు నిఖత్ పైనే
- లవ్లీనా, అమిత్, నిశాంత్‌లపై కూడా దృష్టి

మరో 4 రోజుల్లో...








వందేళ్లకంటే ఎక్కువ చరిత్ర ఉన్న ఒలింపిక్స్ బాక్సింగ్ క్రీడాంశంలో భారత్ నుంచి తొలిసారి 1948 లండన్ ఒలింపిక్స్‌లో ఏకంగా ఏడుగురు బాక్సర్లు పోటీపడ్డారు. ఆ తర్వాత 1952 హెల్సింకి ఒలింపిక్స్‌లో నలుగురు భారత బాక్సర్లు బరిలోకి దిగారు. అయితే ఈ రెండు ఒలింపిక్స్‌లో మన బాక్సర్లు ఆకట్టుకోలేకపోయారు. హెల్సింకి ఒలింపిక్స్ తర్వాత మరో నాలుగు ఒలింపిక్స్ క్రీడల్లో భారత్ నుంచి ప్రాతినిధ్యం కరువైంది. మళ్లీ 1972 మ్యూనిక్ ఒలింపిక్స్‌లో భారత బాక్సర్లు పోటీపడ్డారు. అప్పటి నుంచి ప్రతి ఒలింపిక్స్‌లో భారత బాక్సర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో విజేందర్ సింగ్ (75 కేజీలు) కాంస్యం రూపంలో భారత్‌కు బాక్సింగ్‌లో తొలి పతకాన్ని అందించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో మేరీకోమ్ (51 కేజీలు)... 2020 టోక్యో ఒలింపిక్స్‌లో లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు) కాంస్య పతకాలు గెలిచారు. ఈసారి పారిస్ ఒలింపిక్స్‌కు భారత్ నుంచి ఆరుగురు బాక్సర్లు అర్హత పొందారు. పురుషుల విభాగంలో అమిత్ పంఘాల్ (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు)... మహిళల విభాగంలో నిఖత్ జరీన్ (50 కేజీలు), ప్రీతి పవార్ (54 కేజీలు), జైస్మిన్ లంబోరియా (57 కేజీలు), లవ్లీనా (75 కేజీలు) భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ ఆరుగురిలో అమిత్, లవ్లీనాలకు ఇవి రెండో ఒలింపిక్స్‌కాగా... నిశాంత్, నిఖత్, ప్రీతి, జైస్మిన్ తొలిసారి ఒలింపిక్స్‌లో ఆడనున్నారు. వరుసగా రెండుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నిఖత్ జరీన్‌పైనే అందరి దృష్టి ఉంది. ఆసియా క్రీడల్లో, కామన్వెల్త్ గేమ్స్‌లో, ఆసియా చాంపియన్‌షిప్‌లో పతకాలు నెగ్గిన నిఖత్ తొలి ప్రయత్నంలోనే ఒలింపిక్ పతకం సాధించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.





టోక్యోలో కాంస్యం నెగ్గిన లవ్లీనా ఈసారి కూడా అద్భుతం చేస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. పురుషుల విభాగంలో అమిత్ పంఘాల్, నిశాంత్ తమ స్థాయికి తగ్గట్టు ఆడితే కాంస్యాలు సాధించే చాన్స్ ఉంది. పారిస్ ఒలింపిక్స్‌లో బాక్సింగ్ పోటీలు జూలై 27 నుంచి ఆగస్టు 10 వరకు జరుగుతాయి.

–సాక్షి క్రీడా విభాగం



ఆస్కార్‌కు తొలి ఎఫ్1 విజయం

బుడాపెస్ట్: మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి తన కెరీర్‌లో తొలిసారి ఫార్ములావన్ (ఎఫ్1) రేసులో విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన హంగేరి గ్రాండ్‌ప్రిలో 23 ఏళ్ల ఈ ఆస్ట్రేలియన్ డ్రైవర్ అగ్రస్థానాన్ని పొందాడు. కెరీర్‌లో 35వ రేసులో పోటీపడ్డ ఆస్కార్ నిర్ణీత 70 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంటా 38 నిమిషాల 01.989 సెకన్లలో పూర్తి చేసి టైటిల్ దక్కించుకున్నాడు. మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ రెండో స్థానంలో నిలిచాడు. హామిల్టన్ (మెర్సిడెస్), లెక్‌లెర్క్ (ఫెరారీ), వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. సీజన్‌లోని తదుపరి రేసు బెల్జియం గ్రాండ్‌ప్రి ఈనెల 28న జరుగుతుంది.



యూకీ-ఒలివెట్టి జోడీకి టైటిల్

స్టాడ్ (స్విట్జర్లాండ్): భారత అగ్రశ్రేణి టెన్నిస్ ప్లేయర్ యూకీ బాంబ్రీ తన కెరీర్‌లో మూడో ఏటీపీ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ముగిసిన స్విస్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం విజేతగా నిలిచింది. 66 నిమిషాలపాటు జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో మూడో సీడ్ యూకీ-ఒలివెట్టి జంట 3-6, 6-3, 10-6తో 'సూపర్ టైబ్రేక్'లో హంబెర్ట్-మార్టిన్ (ఫ్రాన్స్) జోడీని ఓడించింది. యూకీ-ఒలివెట్టిలకు 30,610 యూరోల (రూ. 27 లక్షల 87 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

241 పరుగులతో నెగ్గిన ఇంగ్లండ్

నాటింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు 241 పరుగుల ఆధిక్యంతో ఘన విజయం సాధించింది. మూడు టెస్టుల సిరీస్‌ను ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో ఇంగ్లండ్ సొంతం చేసుకుంది. నాలుగో రోజు ఇంగ్లండ్ నిర్దేశించిన 385 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 36.1 ఓవర్లలో 143 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ 41 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి విండీస్‌ను దెబ్బ తీశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 248/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 92.2 ఓవర్లలో 425 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (109; 13 ఫోర్లు), జో రూట్ (122; 10 ఫోర్లు) సెంచరీలు సాధించారు.



ఉచిత పంటల బీమాపై నీలి నీడలు



కేంద్రం కొనియాడిన పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్రలు

- రూ.1,384 కోట్ల ప్రీమియం చెల్లింపునకు విముఖత
- అధ్యయనం పేరిట సబ్ కమిటీ వేసిన రాష్ట్ర ప్రభుత్వం
- నేడు సచివాలయంలో కేబినెట్ సబ్ కమిటీ భేటీ
- ఈ పథకాన్ని కొనసాగించాలంటున్న రైతులు, రైతు సంఘాలు
- పాత పద్ధతినే అమలు చేస్తే ఆందోళనలకు సిద్ధం

సాక్షి, అమరావతి: రైతులపై పైసా భారం పడకుండా ఐదేళ్లుగా విజయవంతంగా అమలు చేస్తోన్న వైఎస్సార్ ఉచిత పంటల బీమాకు మంగళం పాడేందుకు చంద్రబాబు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. పంటల బీమాపై అధ్యయనం కోసం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ సోమవారం సచివాలయంలో సమావేశం కాబోతోంది. రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత పంటల బీమా పథకంతో పాటు వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న పంటల బీమాపై ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. ఐదేళ్లుగా విజయవంతంగా అమలవుతున్న వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేస్తున్నట్టుగా తొలి సమీక్షలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకం స్థానంలో 2019కి పూర్వం రైతుల భాగస్వామ్యంతో అమలైన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) తీసుకొస్తున్నట్టు స్వయంగా వెల్లడించారు. ఈ ప్రకటనకు కొనసాగింపుగా ఇటీవల జరిగిన కేబినెట్ మీటింగ్‌లో ఉచిత పంటల బీమా పథకం స్థానంలో మెరుగైన బీమా పథకం కోసం అధ్యయనం పేరిట వ్యవసాయ, పౌర సరఫరాలు, ఆర్థిక శాఖా మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాల్లో అమలులో ఉన్న క్రాప్ ఇన్సూ్యరెన్స్ చట్టాలపై ఈ కమిటీ సమగ్ర అధ్యయనం చేసి నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని కేబినెట్‌లో తీర్మానించారు. పథకాలన్నీ మరింత మెరుగ్గా అమలు చేస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం.. ఆ తర్వాత ఒక్కొక్కొటిగా వాటికి మంగళం పాడుతోంది.

అత్యుత్తమ పథకంగా కొనియాడిన కేంద్రం

ప్రస్తుతం రాష్ట్రంలో అమలులో ఉన్న ఉచిత పంటల బీమా పథకం దేశంలోనే ది బెస్ట్ క్రాప్ ఇన్సూ్యరెన్స్ పథకమని కేంద్రమే అధికారికంగా ప్రకటించింది. ఇన్నోవేషన్ కేటగిరి కింద 2023లో అవార్డును సైతం అందించింది. ఏపీ స్ఫూర్తితో నోటిఫై చేసిన పంటలకు యూనివర్సల్ కవరేజి కల్పించేందుకు ఫసల్ బీమాలో పలు మార్పులు కూడా చేసింది. ఈ క్రాప్ నమోదే ప్రామాణికంగా నోటిఫై చేసిన ప్రతీ పంటకు, సాగు చేసిన ప్రతీ ఎకరాకు యూనివర్సల్ కవరేజి కల్పిస్తూ రైతులపై పైసా భారం పడకుండా 2019 రబీ నుంచి వైఎస్ జగన్ ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని విజయవంతంగా అమలు చేసింది.

రూ.7802 కోట్ల పరిహారం

ఈ పథకం కింద రికార్డు స్థాయిలో దాదాపు 5 కోట్ల ఎకరాలకు బీమా కవరేజ్ కల్పించడం ద్వారా 2.04 కోట్ల మంది రైతులకు ఉచితంగా బీమా రక్షణ కల్పించింది. ఐదేళ్లలో వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్న 54.55 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7802.08 కోట్ల బీమా పరిహారం నేరుగా జమ చేసింది. 2023-24 సీజన్‌కు సంబంధించి రైతుల వాటాతో కలిపి ప్రీమియం రూపంలో రూ.1,384 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలు చెల్లించకుండా ఎగ్గొట్టాలనే ఆలోచనతో ఉన్న కూటమి ప్రభుత్వం రైతుల భాగస్వామ్యంతో పాత పంటల బీమాను పునరుద్ధరిస్తున్నట్టుగా ప్రకటించింది. ఇందులో భాగంగానే ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సోమవారం భేటీ కానుంది. పైసా భారం పడకుండా ఐదేళ్లుగా వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలంటూ రాష్ట్రంలోని రైతులు, రైతు సంఘాలు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నాయి.

ప్రపంచం గర్వించేలా గొప్ప ఆవిష్కరణలు

- తిరుపతి ఐఐటీ 6వ స్నాతకోత్సవంలో ఇన్ఫోసిస్ కోఫౌండర్ క్రిస్ గోపాలకృష్ణన్
- 338 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం



డిగ్రీ పట్టాను అందుకుంటున్న విద్యార్థి

రేణిగుంట/ఏర్పేడు: ప్రఖ్యాతిగాంచిన విద్యాసంస్థలో సాంకేతిక విద్య అభ్యసించిన ఐఐటీ విద్యార్థులు ప్రపంచం గర్వించే ఆవిష్కరణలతో దేశఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆక్సిలర్ వెంచర్స్ చైర్మన్, ఇన్ఫోసిస్ కో ఫౌండర్ క్రిస్ గోపాలకృష్ణన్ సూచించారు. తిరుపతి ఐఐటీ 6వ స్నాతకోత్సవం ఆదివారం సాయంత్రం ఏర్పేడు సమీపంలోని క్యాంపస్‌లో ఘనంగా జరిగింది. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్రిస్ గోపాలకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొనగా జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ స్నాతకోత్సవ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్‌గా పాల్గొన్నారు. తిరుపతి ఐఐటీ ప్రగతి, వసతులు, సాధించిన విజయాలు, అధిగమించిన అవరోధాల గురించి డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా గిరాకీ ఉన్న ఉత్పత్తులు మనదేశం నుంచి అందించేందుకు ప్రతి విద్యార్థీ గొప్ప ఆవిష్కర్తగా తయారు కావాలని క్రిస్ గోపాలకృష్ణన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చైర్ ప్రొఫెసర్ షిప్ ఏర్పాటుకు అమరరాజా కంపెనీ, ఐఐటీ మధ్య ఒప్పందం కుదిరింది.

- స్నాతకోత్సవ వేడుకల సందర్భంగా తిరుపతి ఐఐటీలో కోర్సు పూర్తి చేసుకున్న 338 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు.
- అత్యుత్తమ ప్రతిభ కనబరచిన బీటెక్ విద్యార్థిని స్నేహ ఎంఎస్‌కు గవర్నర్ పతకాలను అందజేశారు. ఆర్వీ అసోసియేట్ ప్రైజ్ బీటెక్ విద్యార్థి ఆర్.విశ్వనాథ్‌కు లభించగా ఇన్‌స్టిట్యూట్ ప్రైజ్‌లను ఎంటెక్ విద్యార్థిని ఇందుకూరి నాగమహిత, బీటెక్ విద్యార్థి అనుష్ మంగళ్, ఎంటెక్ విద్యార్థిని జనపాటి వినీలాదేవి, శ్రీరాం, అభిషేక్‌గుప్తా, శ్రీగణేష శర్మ సాధించారు. అమరరాజ ప్రైజ్‌ను డేవిడ్‌సన్ పాల్, ఐటీసీ లిమిటెడ్ ప్రైజ్‌ను స్నేహ ఎంఎస్ దక్కించుకున్నారు. శ్రీనివాసన్ నటరాజన్ అవార్డును దేబాశిష్ రోల్, ఏ.కుమారస్వామి అందుకోగా సీతారావమ్మ మెమోరియల్ ప్రైజ్‌ను ఆర్య ఏ పిళ్లైకి ప్రదానం చేశారు. బీటెక్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినందుకు అనూష్ మంగళ్‌కు ప్రెసిడెంట్ మెడల్, ప్రశంసాపత్రం లభించాయి.

పోలీసుల అదుపులో నాగార్జున యాదవ్



సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి ఆయనను కుప్పం పోలీసుస్టేషన్‌కు తరలించారు. నాగార్జునయాదవ్ ఓ టీవీ ఛానెల్ చర్చలో సీఎం చంద్రబాబు గురించి మాట్లాడినందుకు టీడీపీకి చెందిన ఓ వ్యక్తి కుప్పం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దానిపై అక్కడి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కానీ, ఈ కేసును కొట్టివేయాలని హైకోర్టులో వైఎస్సార్‌సీపీ నేతలు పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన న్యాయస్థానం ఈనెల 25 వరకు అతన్ని అరెస్టుచేయరాదని ఆదేశించింది. ఇంతలోనే బెంగళూరు నుంచి విజయవాడ వస్తుండగా ఆదివారం రాత్రి చిత్తూరు జిల్లా వికోట సమీపంలో పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఆయన కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇది హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమేనని, పోలీసులిచ్చిన 41ఏకి కూడా విరుద్ధంగా ఉందని వైఎస్సార్‌సీపీ తప్పుబడుతోంది. దీనిపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నట్లు తెలిపింది.

గోవా మద్యం పట్టివేత

- 'సాక్షి' కథనంతో తనిఖీలు చేపట్టిన పత్తికొండ పోలీసులు
- అక్రమంగా గోవా మద్యాన్ని విక్రయిస్తున్న నలుగురు అరెస్టు
- నిందితులంతా టీడీపీ నేతల అనుచరులని సమాచారం



పట్టుకున్న గోవా మద్యం

సాక్షి ప్రతినిధి కర్నూలు: మద్యం మాఫియా డొంక కదులుతోంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధనార్జనే ధ్యేయంగా కర్ణాటక, గోవా నుంచి అక్రమంగా మద్యాన్ని లారీలు, కంటైనర్లలో తెప్పించి గ్రామగ్రామాన విక్రయిస్తుండటంపై ఈ నెల 21న 'సాక్షి'లో 'కర్ణాటక నుంచి భారీగా అక్రమ మద్యం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో పత్తికొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఆదివారం దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామంలో అక్రమంగా గోవా మద్యాన్ని విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. నిందితులు గుడికటి హనుమంతు, ఈడిగ కేశవయ్య, ఆవుల రాంబాబు, బోయ చిరంజీవిని పోలీసులు విచారిస్తున్నారు. వీరిలో హనుమంతు ఆలూరు నియోజకవర్గం దేవనకొండకు చెందిన వ్యక్తి కాగా.. కేశవయ్య, రాంబాబు డోన్ నియోజకవర్గానికి చెందినవారు. చిరంజీవి పత్తికొండ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి. వీరి నుంచి 28 బాటిళ్ల మాన్షన్‌హౌస్ బ్రాందీ, 30 బాటిళ్ల రాయల్‌స్టాగ్ విస్కీ, 48 బాటిళ్ల కింగ్‌ఫిషర్ బీర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మూడు బ్రాండ్లు గోవా మద్యమే. హనుమంతు, చిరంజీవి మద్యాన్ని విక్రయిస్తుండగా.. రాంబాబు, కేశవయ్య గోవా నుంచి మద్యాన్ని రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులంతా కర్నూలు జిల్లాలో మద్యం వ్యాపారంలో ఆరితేరిన ఓ టీడీపీ సీనియర్ నేత, ఆయన కుమారుడి అనుచరులని సమాచారం. 2014లో టీడీపీ ప్రభుత్వం ఉండగానే గోవా నుంచి కర్నూలు జిల్లాకు వెళ్తున్న మద్యం కంటైనర్‌ను అధికారులు సీజ్ చేశారు. కానీ ఆ టీడీపీ నేత ప్రమేయంతో కేసును నీరుగార్చారు. గోవాలోని బ్రూవరేజి కంపెనీలో వీరికి భాగస్వామ్యం ఉందని సమాచారం.

జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీపై దాడికి యత్నం

- చిత్తూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ నేతలపై కొనసాగుతున్న టీడీపీ దౌర్జన్యకాండ
- జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీ కారు అడ్డగింత.. దుర్భాషలు
- యాదమరి మండల సర్వసభ్య సమావేశానికి అడ్డంకులు



కారును అడ్డుకున్న తెలుగు తమ్ముళ్లు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం యాదమరి మండలంలో టీడీపీ దౌర్జన్యకాండ కొనసాగుతోంది. అధికారం అండతో జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీ కారును అడ్డగించి.. ఆపై దాడికి యత్నించారు. యాదమరి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అయితే సభను అడ్డుకోవాలని టీడీపీ శ్రేణులు ముందుగానే కుట్రపన్నాయి. కత్తులతో కార్యాలయం లోపలికి వచ్చాయి. సభకు వస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి, ఎంపీపీ సురేష్‌ను కార్యాలయం లోపలికి అనుమతించకుండా టీడీపీ శ్రేణులు గేటు బయటే అడ్డుకున్నాయి. కారుపై దాడికి యత్నించారు. కారు కార్యాలయం లోపలికి రాకూడదని, నడుచుకుంటూ రావాలని హుకుం జారీ చేశారు. నోటికొచ్చినట్లు కొంతమంది తమ్ముళ్లు వారిని దుర్భాషలాడారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్దుబాటు చేశారు. కాగా, జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీ వెనుదిరగడంతో ఎంపీటీసీలు, సర్పంచులు ఇంటి బాట పట్టారు. కాగా, జెడ్పీటీసీ, ఎంపీపీని అడ్డుకోవడాన్ని టీడీపీలోని ఒక వర్గం వ్యతిరేకించింది. వారు ప్రజాప్రతినిధులు.. వారిని అడ్డుకుంటే సభ ఎలా జరుగుతుందని అడ్డుకున్న వర్గాన్ని గట్టిగా ప్రశ్నించింది. దీంతో సభను అడ్డుకున్న వర్గం.. ప్రశ్నించిన వర్గంపై చిందులేసింది. ఇరువర్గాల్లో కుమ్ములాట మొదలైంది. పోలీసులు రంగప్రవేశం చేసి లాఠీలకు పనిచెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మురళీమోహన్ అధికారులతో సమీక్ష నిర్వహించే క్రమంలో తమ్ముళ్లు కొట్టుకున్నారు. దీంతో ఆయన ఐదు నిమిషాల్లోనే సమావేశాన్ని ముగించి వెళ్లిపోయారు.

సాక్షి పేపర్లో వార్తలొస్తే.. అంతుచూస్తాం

టీడీపీ కుమ్ములాటను ఫొటో తీస్తున్న స్థానిక సాక్షి విలేకరిపై ఓ సర్పంచ్ భర్త, ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ రాజేంద్రనాయుడు దాడికి యత్నించాడు. నోటికొచ్చినట్లు తిడుతూ.. మొబైల్ ఫోన్ లాక్కున్నాడు. గొడవ ఫొటోలను తొలిగించడంతో పాటు.. ఫోన్ ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడ్డారు. మండలంలో అడుగుపెడితే నరికేస్తామంటూ బెదిరించాడు. సాక్షి పేపరులో వార్తలొస్తే.. నీ అంతుచూస్తానన్నారు. ఆపై కులం పేరుతో దూషించడంతో బాధిత విలేకరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా టీడీపీ దౌర్జన్యంపై ఎంపీపీ సురేష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏ నాడూ ఇలాంటి దౌర్జన్యాలు చేయలేదని, అన్ని సమావేశాలకు టీడీపీ వాళ్లను కూడా స్వాగతించామని గుర్తు చేశారు.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
22-7-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
739	270
80,605	24,531

విదేశీ సూచీలు

నాస్‌డాక్	17,727	▽	144
డోజోన్స్	40,288	▽	377
ఎఫ్‌టీఎస్ఈ 100	8,156	▽	49
డాక్స్	18,172	▽	183
షాంఘై	2,982	△	5
నికాయ్	40,046	▽	63


అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.23	84.25
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.09	109.61
€	యూరో	ఎస్‌బీఐ	89.93	92.38
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.80	54.60
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.15	57.10
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.57	64.14
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.40	22.95
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.87	23.66
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.46

బడ్జెట్ 'హల్వా' మెప్పిస్తుందా?





ఒక పక్క ధరాభారం... మరోపక్క పన్నుల మోత! దేశంలో వేతన జీవుల నుండి సామాన్యుల వరకు ఈ సెగ గట్టిగానే తగులుతోంది. వికసిత భారతదేశమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్న మోదీ 3.0 సర్కారుకు ఉపాధికల్పన ఇప్పుడు చాలా కీలకంగా మారింది. పారిశ్రామికంగా దేశాన్ని పరుగులు పెట్టిస్తూనే.. ప్రజలకు ఆర్థిక ఉపశమనం కల్పించాల్సిన అవసరం కూడా నెలకొంది. ఈ నేపథ్యంలో రికార్డు స్థాయిలో వరుసగా ఏడో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వైపు అన్ని వర్గాలూ ఆశగా ఎదురుచూస్తున్నాయి. మరి సీతమ్మ బడ్జెట్ 'హల్వా' అందరినీ మెప్పిస్తుందా? వివిధ రంగాలు, పరిశ్రమ వర్గాల అంచనాలు సాకారమవుతాయా? మధ్యతరగతి ఆశలు నెరవేరుతాయా? అనేది మరికొద్ది గంటల్లో తేలిపోనుంది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

మోదీ 3.0 తొలి బడ్జెట్‌పై ఎన్నో అంచనాలు

- పన్నుల భారం తడిసిమోపెడు..
- తగ్గింపునకు డిమాండ్లు
- ఈ దిశగా ప్రకటనలకు వీలు..
- తయారీ, మౌలికానికి ప్రాధాన్యం
- గృహ రుణాలపై ప్రోత్సాహకాలు
- బీమాపైనా ఇవే ఆశలు
- చరిత్రాత్మక నిర్ణయాలు అంటూ రాష్ట్రపతి సంకేతం

భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా అవతరించాలి'.. కేంద్రంలోని మోదీ సర్కారు దీర్ఘకాలిక లక్ష్యం ఇది. అమెరికా, యూరప్, చైనా ఆర్థికవ్యవస్థలు ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్న తరుణంలోనూ భారత్ ప్రపంచంలోనే వేగవంతమైన వృద్ధి (7% పైనే)తో సాగిపోతోంది. ప్రస్తుతం ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న దేశం అమెరికా, చైనా తర్వాత మూడో స్థానానికి చేరుకుంటుందని అంచనా. ఈ స్వప్నం సాకారం కావాలంటే ఉపాధి అవకాశాల కల్పన, పరిశ్రమల ఏర్పాటు, మౌలిక వసతులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం అవసరం. పన్నుల ఉపశమనం కల్పించాలన్న డిమాండ్లు ఉండనే ఉన్నాయి. రానున్న బడ్జెట్‌లో చరిత్రాత్మక, ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలు ఉంటాయంటూ పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇప్పటికే సంకేతం పంపారు. దీంతో ఈ నెల 23న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించే 2023–24 పూర్తి స్థాయి బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పన్నుల భారం తగ్గించరూ..

ప్రస్తుత పరిస్థితి: ఆదాయపన్ను, జీఎస్టీ తదితరాల రూపంలో ప్రజలపై ప్రత్యక్ష, పరోక్ష పన్నుల బాదుడు గడిచిన పదేళ్లలో గణనీయంగా పెరిగిపోయింది. ఇది ఏ స్థాయిలో అంటే.. 2023–24లో కేంద్ర సర్కారు రూ.34.6 లక్షల కోట్ల భారీ మొత్తాన్ని ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రూపంలో సమకూర్చుకుంది. ఒక వస్తువు చేతులు మారుతున్న ప్రతి దశలోనూ పన్ను పరిధిలోకి వెళుతోంది. ఉదాహరణకు డీజిల్, పెట్రోల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్సైజ్, వ్యాట్ ట్యాక్స్ విధిస్తుంటాయి. వాహనం వాడే ప్రతి ఒక్కరూ ఇంధనం కొనుగోలుపై పన్ను చెల్లిస్తున్నట్టే. వస్తు రవాణాకు వినియోగించే లారీలు, ట్రక్కులు, రైల్వే డీజిల్, విద్యుత్‌ను ఇంధనంగా వినియోగిస్తుంటాయి. ఆ దశలో అవి డీజిల్, విద్యుత్‌పై పన్ను చెల్లిస్తుంటాయి. ఆ చార్జీల భారం వస్తువులపై పడి, చివరికి వినియోగదారుడు తన వంతు కూడా చెల్లించాల్సి వస్తోంది. ఒక కంపెనీ తన లాభం నుంచి 25 శాతం పన్ను చెల్లించాలి. ఆ తర్వాతే డివిడెండ్ పంపిణీ చేస్తుంది. ఈ డివిడెండ్ అందుకున్న వారు దానిపై తమ ఆదాయ స్థాయికి అనుగుణంగా పన్ను చెల్లించాలి. అంటే రెండు దశల్లో డివిడెండ్‌పై పన్ను పడినట్టు అవుతోంది. ఇలా ప్రత్యక్షం కంటే, పరోక్ష పన్నుల భారం ప్రజలపై బాగా పెరిగిపోయింది.



అంచనాలు: పాత పన్ను విధానం నుంచి ప్రజలను క్రమంగా కొత్త విధానంలోకి తీసుకురావాలన్నది కేంద్రం ఆశయం. పాత విధానంలో పీపీఎఫ్, ఫిక్స్‌డ్ డిపాజిట్, చిన్న మొత్తాల పొదుపు పథకాలు, పిల్లల స్కూల్ ట్యూషన్ ఫీజులు, ఈఎల్ఎస్ఎస్, జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియం, గృహ రుణం చెల్లింపులపై గణనీయమైన పన్ను ప్రయోజనాలున్నాయి. అందరూ వీటిని వినియోగించుకోలేరు. కనుక అందరికీ ఉపయోగపడే విధంగా, పారదర్శకంగా ఉండేందుకు మినహాయింపుల్లేని కొత్త పన్ను విధానాన్నే అంతిమంగా అమలు చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉంది. అందుకని నూతన పన్ను విధానంలోకి మళ్లే దిశగా పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించేందుకు ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు చేయవచ్చని అంచనాలున్నాయి. పరిశ్రమ భాగస్వాములు కూడా ఆర్థిక మంత్రిని ఇదే కోరాయి. స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50వేల నుంచి రూ. లక్షకు పెంచొచ్చన్న అంచనాలున్నాయి. పాత పన్ను విధానంలో రూ.2.5 లక్షల ప్రాథమిక పన్ను మినహాయింపు పదేళ్ల నుంచి అదే స్థాయిలో కొనసాగుతోంది. దీన్ని పెంచాలన్న డిమాండ్లు ఉన్నాయి. కానీ, పాత పన్ను విధానాన్ని నిరుత్సాహపరిచేందుకు అందులో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చని భావిస్తున్నారు. పన్ను మినహాయింపులను పెంచడం వల్ల ప్రజల చేతుల్లో ఖర్చు చేసే ఆదాయం పెరిగి, అది వినియోగంలోకి వస్తుందని.. అంతిమంగా దేశ వృద్ధికి దోహదం చేస్తుందని నిపుణులు అంటున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన 8.2 శాతం వృద్ధి రేటు ఇక మీదటా గరిష్టాల్లో నిలదొక్కుకునేందుకు ఈ తరహా చర్యలు అవసరమన్న వాదన వినిపిస్తోంది.

బీమాపై డిమాండ్లు ఇవీ..



ఇక జీవిత బీమా, ఆరోగ్య బీమాపై జీఎస్టీ భారం తగ్గించాలన్న బలమైన డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. వీటిపై 18 శాతం జీఎస్టీ అమలవుతోంది. దేశంలో ప్రతి ఒక్కరికీ బీమాను చేరువ చేసేందుకు పన్ను రేటును 5 శాతానికి తగ్గించాలని పరిశ్రమ కోరుతోంది. ఆరోగ్యం, వైద్యం కోసం చేసే ఖర్చులు గణనీయంగా పెరిగిపోయినప్పటికీ సెక్షన్ 80డీ కింద హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలకు కల్పిస్తున్న వెసులుబాటులో (60ఏళ్లలోపు ఉంటే రూ.25 వేలు, 60 ఏళ్లు నిండిన వారికి రూ.50 వేలు) గత తొమ్మిదేళ్లుగా ఎలాంటి మార్పులు లేకపోవడాన్ని ఆర్థిక మంత్రి దృష్టికి పరిశ్రమ తీసుకెళ్లింది. ద్రవ్యోల్బణానికి ముడిపెట్టి, ఈ సెక్షన్ కింద హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై పన్ను మినహాయింపు ఏటా ఆటోమేటిక్‌గా పెరిగే విధంగా ఉంటే బావుంటుందని తెలిపింది. ఇంటి అద్దెలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో హౌస్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ) మినహాయింపును పెంచాలన్న డిమాండ్ ఉంది. భారీ పన్ను వసూళ్ల అంచనాల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకునేందుకు బడ్జెట్‌కు వెసులుబాటు ఉంటుందన్నది విశ్లేషణ.

దీర్ఘకాల మూలధన ఆస్తుల నిర్వచనం మారుతుందా?

దీర్ఘకాల మూలధన ఆస్తుల నిర్వచనం మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈక్విటీ పెట్టుబడులు ఏడాదిలోపు విక్రయించినట్టయితే స్వల్పకాల, ఏడాది ముగిసిన తర్వాత విక్రయించినట్టయితే దీర్ఘకాల మూలధన ఆస్తులుగా ఆదాయపన్ను చట్టం పరిగణిస్తోంది. స్వల్పకాల మూలధన లాభాలపై 15 శాతం పన్ను, దీర్ఘకాల మూలధన లాభం రూ.మొదటి లక్ష తర్వాత మొత్తంపై 10 శాతం పన్ను అమలవుతోంది. అదే రియల్ ఎస్టేట్‌ను 24 నెలలు నిండినప్పుడే దీర్ఘకాల మూలధన ఆస్తిగా చూస్తున్నారు. వివిధ సాధనాల మధ్య గందరగోళం లేకుండా ఏకరూపత తీసుకురావచ్చన్న అంచనాలున్నాయి. అంటే ఈక్విటీల్లో దీర్ఘకాల మూలధన ఆస్తుల కాలాన్ని రెండేళ్లకు పెంచడం లేదంటే రియల్ ఎస్టేట్ సాధనానికి రెండేళ్లకు బదులు ఏడాది కాలాన్ని దీర్ఘకాల ఆస్తిగా నిర్ణయించొచ్చని భావిస్తున్నారు. రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు ఏడాదికే దీర్ఘకాల మూలధన లాభాల పన్ను ప్రయోజనాలు కల్పిస్తే మార్కెట్లోకి ఎక్కువ ప్రాపర్టీలు విక్రయానికి వచ్చి, రేట్ల పెరుగుదల ఒత్తిడి తగ్గుతుందనే అంచనాలు సైతం ఉన్నాయి. ఒకవేళ ఈక్విటీ పెట్టుబడులకు రెండేళ్లకు పెంచితే అది కొంత నిరుత్సాహపరిచే అవకాశం లేకపోలేదు. ఈక్విటీల్లో దీర్ఘకాల మూలధన లాభం మొదటి రూ.లక్షకు పన్ను ఉపశమనం ఉండగా, దీన్ని రూ.2 లక్షలు చేయాలని మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ఆర్థిక మంత్రిని కోరింది.

వ్యవసాయం- గ్రామీణం



ప్రస్తుత పరిస్థితి: రైతుల ఆదాయాన్ని, వారి ఆర్థిక స్థితిగతులు పెంచేందుకు కృషి చేస్తామంటున్న మోదీ సర్కారు.. ఈ రంగానికి ఆశించిన స్థాయిలో కేటాయింపులు చేయడం లేదు. 2023–24 బడ్జెట్‌లో సాగు రంగానికి రూ.1.25 లక్షల కోట్లు కేటాయించారు. దీంతో పోల్చితే కేవలం 0.6 శాతం పెంచి 2024–25 మధ్యంతర బడ్జెట్‌లో రూ.1.27 లక్షల కోట్లు కేటాయించారు. గ్రామీణాభివృద్ధి కేటాయింపులు మాత్రం 4.2 శాతం పెంచి 1.80 లక్షల కోట్లు చూపించారు.

అంచనాలు: పంట నష్టాన్ని తగ్గించి, మెరుగైన రేటు వచ్చే దిశగా బడ్జెట్‌లో చర్యలు ప్రకటిస్తారన్న ఆశలు రైతన్నల్లో నెలకొన్నాయి. దేశవ్యాప్తంగా రైతులు అందరికీ నానో డీఏపీ ఎరువులను అందుబాటులోకి తీసుకురావడం, పంట ఉత్పత్తి అనంతరం నిల్వ, సరఫరా వ్యవస్థ, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సాహిస్తామని మధ్యంతర బడ్జెట్‌లో చేసిన ప్రకటనలు ఈ రంగానికి బలాన్నిచ్చేవే. ఇవి కాకుండా పూర్తి స్థాయి బడ్జెట్లో అదనపు చర్యలు ఏమి ప్రకటిస్తారో చూడాలి. ముఖ్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు పెంచాలన్న డిమాండ్‌ను పరిశీలించవచ్చు.



ప్రస్తుత పరిస్థితి: తలసరి ఆదాయాన్ని పెంచడం ముందున్న ప్రధాన సవాళ్లలో ఒకటి. ప్రపంచంలో టాప్–10 ఆర్థిక వ్యవస్థల్లో జీడీపీ పరిమాణం పరంగా 3,942 బిలియన్ డాలర్లతో (2024 జూలై 1 నాటికి ఐఎంఎఫ్ డేటా) భారత్ ఐదో స్థానంలో ఉంది. కానీ, తలసరి ఆదాయం 2730 డాలర్లతో (రూ.2.27 లక్షలు) టాప్–10లో చివరి స్థానంలో ఉంది. 2014 నుంచి చూస్తే తలసరి ఆదాయం రెట్టింపైనప్పటికీ.. అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే ఇది గణనీయంగా మెరుగుపడాల్సి ఉంది. దీనికి ప్రభుత్వం వద్దనున్న ఏకైక అస్త్రం ఉపాధి కల్పన. సేవల రంగంపై ఆధారపడిన ఎకానమీని తయారీ వైపు మళ్లించడం ద్వారా ఉపాధి కల్పనను సాధించాలన్నది లక్ష్యం.

అంచనాలు: ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కింద వివిధ రంగాల్లో కొత్తగా తయారీ కేంద్రాల ఏర్పాటు, అదనపు ఉత్పాదకతపై ప్రోత్సాహకాలు అందిస్తోంది. దిగుమతులను తగ్గించి, దేశీయంగా ఆయా ఉత్పత్తుల స్వావలంబన సాధించేందుకు (ఆత్మనిర్భర్ భారత్), ప్రపంచానికి తయారీ కేంద్రంగా చేయాలన్న (మేక్ ఇన్ ఇండియా) లక్ష్యాలు ఇందులో అంతర్లీనంగా ఉన్నాయి. దీంతో దేశీ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లో పోటీపడగలవని కేంద్రం భావిస్తోంది. ఆయా దిశల్లో తాజా బడ్జెట్ నిర్ణయాలు ఉంటాయని భావిస్తున్నారు.



ప్రస్తుత పరిస్థితి: దేశం పారిశ్రామికంగా మరింత పురోగతి చెందాలంటే, అందుకు మెరుగైన వసతులు అవసరం. అప్పుడే పెట్టుబడిదారులు ముందుకు వస్తారు. కేంద్రంలోని మోదీ సర్కారు రహదారులు, రైల్వే, జలమార్గాలకు ప్రాధాన్యాన్ని పెంచింది. రైల్వే వసతుల ఆధునికీకరణపై పెద్ద ఎత్తున ఖర్చు చేస్తోంది.

అంచనాలు: 2023–24లో రైల్వేలకు రూ.2.41 లక్షల కోట్లు చేయగా, ఈ విడత రూ.2.9–3 లక్షల కోట్లకు పెంచొచ్చని భావిస్తున్నారు. అంతేకాదు రహదారుల నిర్మాణానికి కేటాయింపులు పెరుగుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2014 నాటికి జాతీయ రహదారుల నిడివి 91,287 కిలోమీటర్లు ఉండగా, 2023 డిసెంబర్ నాటికి 1,46,145 కిలోమీటర్లకు పెరిగింది. ఏటా 4,000 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం ఉండగా, దాన్ని, 12వేల కిలోమీటర్లకు విస్తరించారు. జీడీపీలో మూలధన కేటాయింపులను 3.5 శాతానికి పెంచొచ్చని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ నోమురా అంచనా వేస్తోంది. ఎకానమీ పురోగతికి మౌలిక రంగం కీలకమని భావిస్తున్న కేంద్రం ఈ విషయంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి అన్ని చర్యలు తీసుకుంటోంది. బడ్జెట్‌లోనూ ఈ మేరకు నిర్ణయాలు ఉండవచ్చని అంచనా.



ప్రస్తుత పరిస్థితి: దేశ ఉత్పాదకత పెరిగేందుకు ఆరోగ్యకర సమాజం ఎంతో అవసరం. 2023–24 బడ్జెట్‌లో ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖకు చేసిన కేటాయింపులు రూ.80,517 కోట్లు. మొత్తం బడ్జెట్‌లో 2 శాతంలోపే. 2024–25 మధ్యంతర బడ్జెట్‌లో 13 శాతం పెంచి రూ.90,658 కోట్లు చూపించారు. ఈ నిధులు మరింత పెరగాల్సిన అవసరం ఉంది. నూతన ఔషధాల ఆవిష్కరణపై చేసే ఖర్చుకు, డయాగ్నోస్టిక్స్‌పైన జీఎస్టీ మినహాయించాలని, పీఎల్ఐ కింద ఈ రంగానికి ప్రోత్సాహకాలు పెంచాలని పరిశ్రమ కోరుతోంది. 9–14 ఏళ్ల బాలికలకు గర్భాశయ ముఖ ద్వారా కేన్సర్ నుంచి నివారణకు టీకా ఇవ్వడాన్ని సార్వత్రిక టీకా కార్యక్రమం పరిధిలోకి తేవాలన్న డిమాండ్ ఉంది.

అంచనాలు: కేన్సర్, జీవనశైలి వ్యాధుల నివారణకు వీలుగా ప్రజారోగ్యంపై మరింత పెట్టుబడులు అవసరమన్న సూచనలను బడ్జెట్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని మరింత మందికి చేరువ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్న అంచనాలు బలంగా ఉన్నాయి. వైద్య ఉపకరణాల దిగుమతులపై ప్రపంచంలోనే అత్యధికంగా కస్టమ్స్ డ్యూటీలు మన దేశంలో ఉన్నాయని, వీటిని తగ్గించాలన్న పరిశ్రమ డిమాండ్‌ను పరిశీలించవచ్చు.

మారిన ప్రభుత్వ ప్రాధాన్యతలు (కేటాయింపులు రూ. కోట్లలో)

	2021-22	2022-23	2023-24
రక్షణ	5.00681	5.73.098	6.23.889
రహదారులు, రవాణా	1.23.551	2.17.089	2.76.351
రైల్వేలు	1.35.242	1.62.410	2.43.272
ఆహార, పౌర సరఫరా	3.06.571	2.83.954	2.22.234
కెమికల్స్, ఫెర్టిలైజర్స్	1.54.789	2.53.563	1.92.218
గ్రామీణాభివృద్ధి	1.61.643	1.77.840	1.72.968
వ్యవసాయం	1.22.836	1.08.277	1.26.666
కమ్యూనికేషన్లు	51.545	1.40.976	1.22.749
విద్య	80.352	97.196	1.29.718
జల్‌శక్తి	84.470	71.618	96.550
కుటుంబ సంక్షేమం	84.470	75.731	80.518
గృహ, పట్టణాభివృద్ధి	1.06.840	77310	69.271

మోదీ సర్కారు రహదారులు, రైల్వేలు, జల్‌శక్తి, కమ్యూనికేషన్లకు పెద్ద పీట వేస్తున్నట్టు గత నాలుగు బడ్జెట్ కేటాయింపులు పరిశీలిస్తే తెలుస్తోంది. విద్య, వైద్యానికీ కేటాయింపులు పెంచినప్పటికీ రహదారులు, రైల్వేల స్థాయిలో లేకపోవడాన్ని గమనించొచ్చు. ముఖ్యంగా దేశ రక్షణ కోసమే పెద్ద మొత్తంలో కేటాయింపులు చేస్తున్నట్టు ఈ పట్టికను పరిశీలిస్తే తెలుస్తుంది.

విద్యారంగం



విద్యారంగానికి 2023–24 బడ్జెట్‌తో పోలిస్తే 7% తక్కువగా రూ.1.2 లక్షల కోట్లనే 2024–25 మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి కేటాయించారు. పూర్తిస్థాయి బడ్జెట్‌లో అయినా దీన్ని సరిదిద్దుతారేమో చూడాలి. విద్యా సేవలు, టెస్ట్ ప్రిపరేషన్, నైపుణ్య కోర్సులపై 18% జీఎస్టీ చాలా ఎక్కువన్న అభ్యంతరం ఉంది. నాణ్యమైన విద్యను అందుబాటు వ్యయాలకే అందించే దిశగా తగినన్ని పెట్టుబడులతోపాటు స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సాయం, సులభంగా విద్యా రుణాలు లభించేలా చర్యలు తీసుకోవాలని విద్యా సంస్థలు, ఎడ్‌టెక్ కంపెనీలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యా రుణాలు సులభం కావాలన్నది డిమాండ్.

ఎంఎస్ఎంఈలు



దేశంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమ కేంద్రం నుంచి మరింత సాయాన్ని ఆశిస్తోంది. తక్కువ వడ్డీపై రుణ సాయానికి తోడు, సులభతర రుణాలు, ఆవిష్కరణలకు ప్రోత్సాహం, మౌలిక వసతుల కల్పన, సానుకూల పన్ను విధానం, వ్యాపార సులభతర నిర్వహణకు వీలుగా నిబంధనల అమల్లో వెసులుబాటు తదితర రూపాల్లో సహకారాన్ని కోరుతోంది. ప్రతి జిల్లా స్థాయిలో ఆర్థిక కేంద్రాలు ఏర్పాటు చేసి, వసతులు కల్పించడం, నైపుణ్యాభివృద్ధి కల్పనతో మరింత మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నాయి. ఎస్ఎంఈలకు 45 రోజుల్లోగా చెల్లింపులు జరిగేలా చట్టంలో మార్పులు తీసుకురావాలని పరిశ్రమ కోరుతోంది.

హౌసింగ్



అందుబాటు ధరల ఇళ్లు, పర్యావరణ అనుకూల ఇళ్ల ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలుగా డెవలపర్లకు ప్రోత్సాహకాలు కల్పించాలని రియల్టీ కోరుతోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం విజయవంతమైన నేపథ్యంలో.. మరింత మందికి లబ్ధి చేకూరేందుకు ఈ పథకాన్ని 2.0 రూపంలో తీసుకురావాలని డిమాండ్ చేస్తోంది. అందరికీ ఇళ్ల లక్ష్యం సాకారం దిశగా బడ్జెట్‌లో చర్యలు ఉంటాయన్న అంచనాలు పెరిగాయి. గృహ రుణాలపై రూ. 5 లక్షల వరకు వడ్డీ చెల్లింపులకు పన్ను మినహాయింపు కల్పించాలని పరిశ్రమ ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిని కోరింది. ఈ రంగానికి పరిశ్రమ హోదా కల్పించాలన్న డిమాండూ ఉంది.

పర్యావరణ ఇంధనాలు



శిలాజ ఇంధనాలైన బొగ్గు, పెట్రోలియం ఉత్పత్తులపైనే ఎక్కువగా ఆధారపడగా, సోలార్, విండ్, గ్రీన్ హైడ్రోజన్ తదితర పర్యావరణ అనుకూల ఇంధనాలను కేంద్రం ప్రోత్సహిస్తోంది. 2070 నాటికి సున్నా కర్బన ఉద్గారాల విడుదల లక్ష్యాన్ని చేరుకోవాలంటే పునరుత్పాదక ఇంధన వనరులపై పెట్టుబడులకు ప్రోత్సాహం ఉండాలని, శుద్ధ ఇంధన వనరులకు మళ్లేందుకు, ఈ దిశగా పరిశోధన, అభివృద్ధికి తగినంత ప్రోత్సాహం అందించాలన్న డిమాండ్లు ఉన్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతున్న దశలో ఫేమ్ పథకం ద్వారా సబ్సిడీలు తొలగించడం సరికాదని పరిశ్రమ భావిస్తోంది.

బ్యాంకింగ్



బ్యాంకింగ్ ఎకానమీ పురోగతిలో కీలకమని కేంద్రం భావిస్తోంది. ఈ రంగంలో సంస్కరణలకు వీలుగా బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1949, ఇతర చట్టాలకు సవరణలను బడ్జెట్‌లో ప్రతిపాదించొచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. ప్రభుత్వరంగ బ్యాంక్‌లను ప్రైవేటీకరించాలంటే బ్యాంకింగ్ కంపెనీల చట్టం 1970, బ్యాంకింగ్ కంపెనీల చట్టం 1980లకు సవరణలు తప్పనిసరి. ఈ రెండు చట్టాలు బ్యాంకుల జాతీయకరణ సమయంలో తెచ్చినవి. వీటిల్లో సవరణలతో ప్రభుత్వరంగ బ్యాంక్‌ల ప్రైవేటీకరణకు, ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటా 51 శాతం లోపునకు తగ్గించుకునేందుకు వీలు లభిస్తుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
బడ్జెట్, క్యూ1 ఫలితాలపై దృష్టి | హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం డౌన్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-7-2024	
విశాఖ	550-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

స్టాక్స్ వ్యూ

టీసీఐ ఎక్స్‌ప్రెస్ | బ్రోకరేజ్: ప్రభుదాస్ లీలాధర్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,169 టార్గెట్: రూ. 1,410



ఎందుకంటే: లాజిస్టిక్స్ కంపెనీ టీసీఐ ఎక్స్‌ప్రెస్‌కు పుణేలోగల వస్తువుల క్రమబద్ధీకరించే(సార్టింగ్) సెంటర్‌ను ఇటీవలే సందర్శించాం. 1.5 లక్షల చదరపు అడుగులలో ఏర్పాటైన పూర్తి ఆటోమేటెడ్ కేంద్రమిది. సుమారు 50 లోడింగ్ డాక్స్(వాహనాలు)కు వీలుంది. ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) ద్వితీయార్థం(అక్టోబర్–మార్చి) నుంచి బీటూబీ పరిమాణం పుంజుకోనున్నట్లు యాజమాన్యం భావిస్తోంది. వార్షికంగా 12–15 శాతం వృద్ధిని ఊహిస్తోంది. ఇందుకు ప్రధానంగా దక్షిణాది మార్కెట్ల నుంచి టెక్స్‌టైల్స్ లగేజీ(లోడ్) పెరగనున్నట్లు అంచనా. శ్రామికులపై ఆధారపడటాన్ని తగ్గించుకునే బాటలో యాజమాన్యం ఆటోమేషన్‌పై గురిపెట్టింది. వీటితోపాటు ట్రక్‌ల కూలింగ్ టైమ్‌ను వేగవంతం చేయడంలో నిలకడ, ట్రక్కుల టర్న్‌అరౌండ్(టెర్మినల్‌లో గడిపే) సమయాన్ని(టీఏటీ) తగ్గించడం వంటి అంశాలకూ ప్రాధాన్యత ఇవ్వనుంది. దీంతో గతంలో ఒక్కో ట్రక్కుకోసం వినియోగించే 5–6గురు శ్రామికుల స్థానే ఇద్దరితోనే ప్యాకేజీల లోడింగ్, అన్‌లోడింగ్ కార్యకలాపాలకు అవకాశం ఏర్పడింది. పుణే సార్టింగ్ సెంటర్ ఆటోమేషన్ తదుపరి శ్రామిక వ్యయాలు 30 శాతం దిగివచ్చాయి. అంతేకాకుండా ఒక్కో ట్రక్కు లోడింగ్, అన్‌లోడింగ్ సమయం సైతం 6–7 గంటల నుంచి భారీగా తగ్గి గంటకు పరిమితమవుతోంది. వెరసి ఒక్కో ట్రక్ మొత్తం టర్న్‌అరౌండ్ సమయం 5 గంటలకు చేరింది. పుణే సెంటర్ 60 కేజీల హ్యాండ్లింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. అయితే లగేజీ పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ 50 కేజీలకుపైనగల పార్సెళ్లను మ్యాన్యువల్‌గా హ్యాండిల్ చేస్తోంది. వీటి వాటా 5–10 శాతమేకాగా.. జీపీఎస్ ద్వారా ట్రక్కుల రియల్ టైమ్ ట్రాకింగ్‌కు వీలు కల్పిస్తోంది.

వీఐపీ ఇండస్ట్రీస్ | బ్రోకరేజ్: సునిధి సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 464 టార్గెట్: రూ. 672



ఎందుకంటే: లగేజీ, బ్యాక్‌ప్యాక్, ప్రయాణ అనుబంధ వస్తువుల తయారీ దిగ్గజం వీఐపీ ఇండస్ట్రీస్ దేశీయంగా అతిపెద్ద కంపెనీ. అంతేకాకుండా గ్లోబల్ స్థాయిలోనూ లగేజీ తయారీకి రెండో పెద్ద కంపెనీగా నిలుస్తోంది. గత కొన్నేళ్లుగా బిజినెస్, లీజర్ ప్రయాణాలు జోరందుకున్న నేపథ్యంలో కంపెనీకి లబ్ధి చేకూరుతోంది. విమాన ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండటం, పలు ప్రీమియం ట్రయిన్లు ప్రవేశిస్తుండటానికితోడు.. ఎస్‌యూవీలు, ప్యాసింజర్ వాహనాల భారీ విక్రయాలు లీజర్ పరిశ్రమ పుంజుకునేందుకు ప్రభావం చూపుతున్నాయి. అంతేకాకుండా బలపడుతున్న మధ్యతరం(జెన్ఎక్స్) కుటుంబాల ఆకాంక్షలు, వ్యక్తిగత ప్రాధాన్యతలు మారుతుండటం వంటి అంశాలు మధ్యకాలం నుంచి దీర్ఘకాలంలో 10 శాతం స్థాయిలో వార్షిక డిమాండుకు కారణంకానున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) కంపెనీకి ట్రాన్స్‌ఫార్మేషనల్(పరివర్తన) ఏడాదిగా నిలవనున్నట్లు యాజమాన్యం భావిస్తోంది. గతేడాది(2023–24)లో చేపట్టిన వ్యవస్థీకృత మార్పుల ప్రభావంతో బ్రాండ్ పొజిషనింగ్, మార్కెటింగ్ ఇన్నొవేషన్స్ ఇందుకు సహకరించనున్నట్లు కంపెనీ పేర్కొంటోంది. కఠిన వర్కింగ్ క్యాపిటల్ నిర్వహణ, స్టాక్‌ను భద్రపరిచే, నిర్వహించే యూనిట్ల(ఎస్‌కేయూ)ల క్రమబద్ధీకరణ కంపెనీ విజయంలో కీలకపాత్ర పోషించనున్నాయి. గత కొన్నేళ్లుగా కోల్పోయిన మార్కెట్ లీడర్‌షిప్‌ను తిరిగి పొందే సన్నాహాల్లో భాగంగా కంపెనీ మధ్యస్థాయి యాజమాన్య నిర్వహణ సిబ్బందిలో మార్పులు చేపట్టింది. పారితోషిక(రివార్డ్) ఆధారిత మార్కెటింగ్ తదితర వ్యూహాలను అమలు చేస్తోంది. ఓవైపు ట్రావెల్ రంగం జోరు, మరోపక్క పటిష్ట బ్రాండింగ్, మార్కెటింగ్‌ల నేపథ్యంలో కంపెనీ వార్షికంగా కనీసం 10% వృద్ధిని సాధించే వీలుంది.

క్లుప్తంగా...

నేటి నుంచి ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలో ఉన్న నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2024–25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు ఈ నెల 22 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ నేతృత్వంలో కౌన్సెలింగ్ జరగనుంది. ఈ నెల 22, 23 తేదీల్లో నూజివీడు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీల్లోను, 24, 25 తేదీల్లో ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన అభ్యర్థులకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలోను, 26, 27 తేదీల్లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైన అభ్యర్థులకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో కౌన్సెలింగ్ జరగనుంది. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది.

రేపటి నుంచి ఏపీఈఏపీ సెట్-2024 తుది దశ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీఈఏపీ సెట్ –2024 తుది దశ కౌన్సెలింగ్‌ను ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 23 నుంచి 25 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, 23 నుంచి 26 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 24 నుంచి 26 వరకు ఆప్షన్ల ఎంపిక, 27న ఆప్షన్ల మార్పు, 28 నుంచి 30 వరకు సీట్ల కేటాయింపు ప్రక్రియ, 30న తుది సీట్లను కేటాయించనుంది. సీట్లు పొందిన విద్యార్థులు 31 నుంచి ఆగస్టు 3లోగా కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించింది. ఇప్పటికే తొలి విడత కౌన్సెలింగ్‌లో 1.17లక్షల కన్వీనర్ కోటాలో సీట్లను భర్తీ చేయగా, 19 నుంచే కళాశాలల్లో తరగతులు ప్రారంభమైనట్లు వివరించింది.

శభాష్.. సోహన్వికా

తైక్వాండోలో బంగారు పతకం సొంతం చేసుకున్న తొమ్మిదేళ్ల బాలిక



సాక్షి, అమరావతి: శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన బాలిక సోహన్వికారెడ్డి తైక్వాండో పోటీల్లో అదరగొట్టింది. ఆదివారం బెంగళూరులో నిర్వహించిన సౌత్ జోన్ సబ్ జూనియర్స్ తైక్వాండో విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. తలుపుల మండలం గంజివారిపల్లెకు చెందిన గుణరంజన్‌రెడ్డి కుమార్తె సోహన్వికా రెడ్డి చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తిని కనబరుస్తోంది.

న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాబ్జి



డాక్టర్ బాబ్జితో డాక్టర్ విజయ తదితరులు

గుంటూరు మెడికల్: ఏపీ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా హెల్త్ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ కె.బాబ్జి (కాకినాడ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర సదస్సు శుక్రవారం నుంచి ఏపీ న్యూరో కాన్ 2024 పేరుతో గుంటూరులో జరుగుతోంది. ఆదివారం సదస్సు చివరి రోజున నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా నెల్లూరుకు చెందిన డాక్టర్ ఏవీ రమణమూర్తి, కోశాధికారిగా విజయవాడకు చెందిన డాక్టర్ నూతక్కి పుష్పరాజ్, వైస్ ప్రెసిడెంట్‌గా గుంటూరుకు చెందిన డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ వీవీ రమేష్ చంద్ర, డాక్టర్ బలభద్ర వెంకటరాజు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ వి.కోదండ గిరిరావు, డాక్టర్ రాం బాలాజీనాయక్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం అధ్యక్షురాలిగా పనిచేస్తున్న డాక్టర్ పమిడిముక్కల విజయ నుంచి డాక్టర్ బాబ్జి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు.

బలహీనపడిన వాయుగుండం

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఆదివారం అల్పపీడనంగా బలహీనపడింది. ఇది ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా కదులుతూ క్రమంగా ఇంకా బలహీనపడే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపింది. రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. మరోవైపు ఒడిశా సమీపంలో ఏర్పడిన రుతుపవన ద్రోణి తూర్పు ఆగ్నేయ బంగాళాఖాతం మీదుగా కొనసాగుతోంది. వీటి ప్రభావంతో ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమల్లో రెండు రోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే సూచనలున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరులో 5.4 సెంటీమీటర్లు, విశాఖ జిల్లా గోపాలపట్నంలో 4.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు కాకినాడ జిల్లా కోటనందూరులో 3.6 సెంటీమీటర్ల వర్షం పడింది.

రక్షణ రంగంలో స్వావలంబన దిశగా భారత్ అడుగులు వేస్తోంది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా దేశీయంగా రక్షణ పరికరాల ఉత్పత్తి రెట్టింపవుతోంది. ముడిసరుకు నుంచి ఆయుధ సంపత్తి వరకూ స్వదేశీ వాటా ఏటా పెరుగుతూ వస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా'లో దూసుకుపోతూ ఐదేళ్ల కాలంలో 60 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.26 లక్షల కోట్ల విలువైన రక్షణ రంగ ఉత్పత్తుల్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు తయారు చేయడం విశేషం. రక్షణ రంగానికి చెందిన దిగుమతుల్ని క్రమంగా తగ్గించుకుంటూ వస్తున్న భారత్.. 2047 నాటికి పూర్తి 100 శాతం స్వదేశీ ఉత్పత్తులపై దృష్టి సారిస్తూ దూసుకుపోతోంది. ప్రపంచ రక్షణ తయారీ కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దేందుకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసింది. **- సాక్షి, విశాఖపట్నం**



రక్షణ రంగంలో స్వదేశీ గర్జన


- 'మేక్ ఇన్ ఇండియా'లో దూసుకుపోతున్న భారత్
- 2023-24లో రూ.1.26 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తులు
- 2019-20తో పోలిస్తే 60% వృద్ధి
- రక్షణ రంగ దిగుమతుల్ని తగ్గించుకుంటున్న భారత్
- ఐదు విడతల్లో 3,318 ఉత్పత్తులు, ముడిసరుకు దిగుమతులకు స్వస్తి

ప్రపంచ కేంద్రంగా భారత్

ప్రపంచ రక్షణ తయారీ కేంద్రంగా భారతదేశాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సుదీర్ఘ ప్రణాళికల్ని అమలు చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.1,26,887 కోట్ల విలువైన రక్షణ రంగ ఉత్పత్తుల్ని భారత్ తయారు చేయడం విశేషం. గతేడాది కంటే 16.7 శాతం వృద్ధి నమోదు చేసింది. 2022-23లో రూ.1,08,684 కోట్ల విలువైన ఉత్పత్తులు తయారయ్యాయి. 2019-20 నుంచి పరిగణనలోకి తీసుకుంటే.. ఐదేళ్ల కాలంలో 60 శాతం పెరుగుదల కనిపించింది. అన్ని డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్‌లు (డీపీఎస్‌యూలు) ఇతర పీఎస్‌యూలు రక్షణరంగ వస్తువుల తయారీతో పాటు ప్రైవేట్ కంపెనీల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం దేశంలో రక్షణ ఉత్పత్తి విలువ రికార్డు స్థాయిలో ఉంది. 2023-24లో డీపీఎస్‌యూలు, పీఎస్‌యూల వాటా రూ.1,00,381 కోట్లు కాగా ప్రైవేట్ సంస్థలు రూ.26,506 కోట్ల ఉత్పత్తులు తయారు చేశాయి.

స్వదేశీ విధానంతో ముందుకు..

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వదేశీ విధానంతో భారత రక్షణ వ్యవస్థ గతం కంటే పటిష్టంగా మారింది. 'ఆత్మ నిర్భర్ భారత్' పేరిట రక్షణ రంగంలోనూ స్వావలంబన సాధించేందుకు తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఉత్తరప్రదేశ్, తమిళనాడులో డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్లు ఏర్పాటు చేసింది. దేశీయ రక్షణ రంగ పరిశ్రమకు మూలధన సేకరణ బడ్జెట్‌లో 75% కేటాయించింది. ఇన్నోవేషన్స్ ఫర్ డిఫెన్స్ ఎక్సలెన్స్ (ఐడెక్స్), ఐడెక్స్ ప్రైమ్, ఐడెక్స్ అదితీ వంటి పథకాలు, ఆవిష్కరణలను ప్రారంభించడంతో సత్ఫలితాలు నమోదవుతున్నాయి.



ఎగుమతుల్లోనూ అదే దూకుడు

స్వదేశీకరణ ప్రయత్నాలు నిరంతర ప్రాతిపదికన దూకుడుగా కొనసాగుతుండగా.. ఎగుమతుల్లోనూ అదే జోరు నమోదైంది. స్వదేశీ రక్షణ ఉత్పత్తిలో మొత్తం వృద్ధికి డిఫెన్స్ ఎగుమతులు దోహదపడుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో డిఫెన్స్ ఎగుమతులు రికార్డు స్థాయిలో రూ. 21,083 కోట్లకు చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో రూ.15,920 కోట్లతో పోలిస్తే 32.5 శాతం వృద్ధిని నమోదు చేసింది. దేశంలో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణుల్ని కొనుగోలు చేసేందుకు ప్రపంచంలోని చాలా దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ జాబితాలో తొలి కొనుగోలుదారుగా ఫిలిప్పీన్స్ నిలిచింది. తేజస్ యుద్ధ విమానాల్ని కొనుగోలు చేసేందుకు సైతం ఫిలిప్పీన్స్ ఆసక్తి చూపిస్తోందనీ భారత రక్షణరంగ వర్గాలు చెబుతున్నాయి.

విడిభాగాల దిగుమతులు తగ్గుముఖం

వివిధ దేశాల నుంచి రక్షణ రంగానికి సంబంధించి 4,664 కీలక విడిభాగాలు దిగుమతి అవుతున్నాయి. ఐదు విడతలుగా 3,318 విడిభాగాల దిగుమతుల్ని నిలుపుదల చేసిన భారత్.. వీటిని స్వయంగా తయారు చేయడం ప్రారంభించింది. దేశంలోని ప్రతి నౌక, జలాంతర్గామి, విమానాలు, ఆయుధ వ్యవస్థ తయారీలో భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో దూసుకుపోతోంది. భారత రక్షణ రంగం స్వయం సమృద్ధిగా మారడానికి కట్టుబడి.. 2047 నాటికి పూర్తిగా స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేస్తోంది.



పునరావాసం ఊసేలేదు

ఇప్పటివరకు సహాయక చర్యలు ప్రారంభించని ప్రభుత్వం

సాక్షి, అమరావతి : భారీ వర్షాలు, వరదలకు ఏజెన్సీ ప్రాంతం అతలాకుతలమవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం కూడా స్పందించడంలేదు. ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని విలీన మండలాలు, మరికొన్ని గిరిజన మండలాల్లో గ్రామాలు మునిగిపోయి జనం జలదిగ్బంధంలో చిక్కుకుపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. శనివారం సాయంత్రం వరకు 20 మండలాల్లో 200కి పైగా గ్రామాలు మునిగిపోయినా పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేయలేదు. దీంతో అక్కడి జనం నానా బాధలు పడుతున్నారు. ఇళ్లల్లోకి నీరు వచ్చి, కరెంటులేక, నిత్యావసరాలు దొరక్కపోవడంతోపాటు కనీసం మంచినీరు లేక విలవిల్లాడుతున్నారు.

వరద పెరిగాక జనాన్ని తరలిస్తారట..

గోదావరి వరద పెరిగి మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశాకే పునరావాస కేంద్రాల గురించి ఆలోచించాలని అధికారులు సూచించడంతో ఎక్కడా పునరావాస కేంద్రాలు ఏర్పాటుకాలేదు. దీంతో ప్రజలు కనీస సౌకర్యాలు లేక ఇళ్లల్లోకి నీరు చేరినా అక్కడే ఉండక తప్పని పరిస్థితి నెలకొంది. గోదావరి వరద పెరిగేలోపు ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వున్నా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. వరద పెరిగాక సహాయ, పునరావాస కేంద్రాలకు తరలించవచ్చని అధికారులు భావించడంతో వందలాది గ్రామాల ప్రజలు ముంపు గ్రామాల్లోనే చిక్కుకుపోయారు.

అమెరికాలో తెలుగు విద్యార్థిని దుర్మరణం

- ఒక్లహోమా యూనివర్సిటీలో ఎంఎస్ చేస్తున్న తెనాలికి చెందిన హారిక
- రోడ్డు ప్రమాదంలో మృతి... శోకసంద్రంలో తల్లిదండ్రులు




జెట్టి హారిక(ఫైల్)

తెనాలి రూరల్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెనాలికి చెందిన ఓ విద్యార్థిని దుర్మరణం చెందింది. గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్‌కు చెందిన జెట్టి హారిక(25) వెటర్నరీ కోర్సు పూర్తిచేసి ఉన్నత చదువుల కోసం గత ఏడాది ఆగస్టులో అమెరికా వెళ్లింది. అక్కడి ఒక్లహోమా రాష్ట్రంలోని యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ ఒక్లహోమాలో న్యూట్రిషన్ అండ్ ఫుడ్ సైన్స్‌లో ఎంఎస్ చేస్తోంది. పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ స్నేహితులతో కలిసి ఉంటోంది. అమెరికా కాలమానం ప్రకారం శనివారం రాత్రి సుమారు ఏడు గంటల సమయంలో ఒక్లహోమాలోని వెస్ట్ ట్రిప్లెట్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో హారిక అక్కడికక్కడే మృతిచెందింది. హారిక తండ్రి జెట్టి శ్రీనివాసరావు దేవదాయ శాఖలో ఉద్యోగి కాగా, తల్లి నాగమణి గృహిణి. కుమార్తె ఉన్నత చదువుల కోసం వారు బ్యాంకు నుంచి రుణం తీసుకుని హారికను అమెరికా పంపారు. అక్కడకు వెళ్లిన 11 నెలలకే రోడ్డు ప్రమాదంలో మరణించిందని యూనివర్సిటీ నుంచి ఆదివారం వచ్చిన సమాచారంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. తమ కుమార్తె మృతదేహాన్ని త్వరగా స్వస్థలానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లను హారిక కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

శ్రీశైలంలోకి 96,369 క్యూసెక్కులు

శ్రీశైలంలోకి గంటగంటకు పెరుగుతున్న ప్రవాహం

- 822.5 అడుగుల్లో 42.73 టీఎంసీలకు చేరిన నీటినిల్వ
- మూడురోజుల్లో తుంగభద్ర డ్యామ్ గేట్లు ఎత్తే అవకాశం
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 12,325 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల



శ్రీశైలం డ్యాం

సాక్షి, అమరావతి/శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్టులోకి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు 96,369 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 822.5 అడుగులకు చేరింది. జలాశయంలో నీరు 42.73 టీఎంసీలకు చేరుకుంది. కట్టలేరు, మున్నేరు పరవళ్లు తొక్కుతుండటంతో ప్రకాశం బ్యారేజ్‌లోకి 13,634 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఇక్కడ 17 గేట్లు ఒక అడుగుమేర ఎత్తి 12,325 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ఉధృతి మరింత పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1,17,647 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 78.67 టీఎంసీలకు చేరింది. మూడురోజుల్లో తుంగభద్ర డ్యామ్ నిండే అవకాశం ఉంది. అప్పుడు గేట్లు ఎత్తి దిగువకు వరదను విడుదల చేస్తారు.

ఆదివారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు, నీటినిల్వలు ఇలా...

ప్రాజెక్టు పేరు	పూర్తి నీటినిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటినిల్వ	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
అల్మట్టి	129.72	99.68	1,25,000	1,50,000
నారాయణపూర్	37.64	32.78	1,25,000	1,45,750
ఉజ్జయిని	117.24	51.01	7,954	176
జూరాల	9.66	6.81	1,11,000	1,19,253
శ్రీశైలం	215.81	42.73	96,369	0
నాగార్జునసాగర్	312.05	122.97	0	9,646
పులిచింతల	45.77	0.83	640	50
ప్రకాశం బ్యారేజ్	3.07	3.07	13,634	13,634

1.30 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం

సాక్షి, అమరావతి : వర్షాలతో వ్యవసాయ, ఉద్యాన పంటలకు అపారమైన నష్టం వాటిల్లింది. ప్రధానంగా అల్లూరి సీతారామరాజు, ఉభయ గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, గుంటూరు, అనకాపల్లి, నంద్యాల, జిల్లాల పరిధిలో సాగైన ఖరీఫ్ పంటలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. ఆదివారం సాయంత్రానికి క్షేత్రస్థాయి నుంచి అందిన సమాచారం మేరకు ఈ ఎనిమిది జిల్లాల పరిధిలోనే సుమారు లక్షా 30 వేల ఎకరాల్లో పంటలు ముంపునకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. అత్యధికంగా ఐదు వేల ఎకరాల్లో సిద్ధంచేసిన నారుమడితో పాటు 1.20 లక్షల ఎకరాల్లో వేసిన వరినాట్లు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. తూర్పు గోదావరి జిల్లా పరిధిలో 41 వేల ఎకరాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 38వేల ఎకరాలు, ఏలూరు జిల్లా పరిధిలో 12 వేల ఎకరాలు, కోనసీమ జిల్లా పరిధిలో తొమ్మిది వేల ఎకరాలు, గుంటూరు జిల్లాలో 7,500 ఎకరాలు, కాకినాడ జిల్లాలో ఆరువేల ఎకరాల్లో వరినాట్లు ముంపునకు గురైనటు గుర్తించారు. అనకాపల్లి, కృష్ణాతో సహా ఇతర జిల్లాల్లో మరో ఏడు వేల ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైనట్లు తేల్చారు.

ముంపుబారిన వేరుశనగ, మొక్కజొన్న..

ఇక ఏఎస్ఆర్, ఏలూరు జిల్లాల పరిధిలో వెయ్యి ఎకరాల్లో వేరుశనగ, నంద్యాలలో 1,200 ఎకరాల్లో మొక్కజొన్న ముంపుబారిన పడినట్లు గుర్తించారు. కృష్ణా, ఏలూరు, తూర్పు గోదావరి, నంద్యాల జిల్లాల్లో 343 ఎకరాల్లో అరటి, 166 ఎకరాల్లో కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతినగా, మరో వంద ఎకరాల్లో తమలపాకు, కోకో, పుచ్చకాయ, పసుపు, బొప్పాయి, కొబ్బరి, ఆయిల్ పామ్ ముంపునకు గురయ్యాయి. 30కి పైగా పశువులు కొట్టుకుపోవడంతో పాటు వందకు పైగా పశువులు ముంపునీటిలో చిక్కుకున్నాయి.

పోటెత్తుతున్న 'గోదావరి'

ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 7.72 లక్షల క్యూసెక్కులు కడలిపాలు

నేడు ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 10 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వస్తుందని సీడబ్ల్యూసీ అంచనా



పోలవరం వద్ద ఉరకలేస్తున్న వరద

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్ : గోదావరి నదీ పరివాహక ప్రాంతం (బేసిన్)లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, గోదావరి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉప నదులు శబరి, ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరు, కిన్నెరసాని కూడా పరవళ్లు తొక్కుతుండటంతో గోదావరి పోటెత్తుతోంది. గోదావరికి ఎగువన ప్రాణహిత తోడవ్వడంతో తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజ్‌లోకి ఆదివారం సా.6 గంటలకు 5,52,600 క్యూసెక్కులు చేరుతుండగా గేట్లు ఎత్తేసి, వచ్చింది వచ్చినట్లుగా దిగువకు వదిలేస్తున్నారు. ఈ ప్రవాహానికి ఇంద్రావతి వరద జత కలిసింది. దీంతో తుపాకులగూడెం (సమ్మక్క) బ్యారేజ్‌లోకి 8,23,450 క్యూసెక్కులు చేరుతుండడంతో అంతేస్థాయిలో గేట్లు ఎత్తి దిగువకు వదిలేస్తున్నారు. ఈ వరదకు వాగులు, వంకల ప్రవాహం తోడవుతుండటంతో దుమ్ముగూడెం (సీతమ్మ సాగర్) బ్యారేజ్‌లోకి 9,01,989 క్యూసెక్కులు చేరుతోంది. ఇక్కడా వచ్చింది వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ వరదకు తాలిపేరు, పెద్దవాగు, కిన్నెరసాని ప్రవాహం కలుస్తోంది. ఫలితంగా.. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గంట గంటకూ పెరుగుతోంది. ఆదివారం సా.6 గంటలకు భద్రాచలం వద్ద నీటి మట్టం 43 అడుగులకు చేరుకోవడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేసి.. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక.. 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరికను జారీచేస్తారు. ఇక ఈ వరదలు విలీన మండలాల వాసుల కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.

కూనవరం వద్ద శబరి దూకుడు..

ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో శనివారం భారీ వర్షాలు కురవడంతో శబరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. శబరి దూకుడుతో కూనవరం వద్ద నీటి మట్టం 36.74 మీటర్లకు చేరుకుంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేసిన అధికారులు.. పరివాహక ప్రాంతంలో పల్లపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. మరోవైపు.. పోలవరం ప్రాజెక్టులోకి 8,57,707 క్యూసెక్కులు చేరుతుండటంతో స్పిల్ వే ఎగువన నీటిమట్టం 32 మీటర్లకు చేరుకుంది. దీంతో ప్రాజెక్టు 48 గేట్లను ఎత్తేసి.. మొత్తం 8.60లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు.

నేడు ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ?

ఇక ఆదివారం సా.6 గంటలకు ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 7,74,171 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 1,800 క్యూసెక్కులను అధికారులు విడుదల చేస్తున్నారు. మిగులుగా ఉన్న 7,72,371 క్యూసెక్కులను 175 గేట్లను ఎత్తి సముద్రంలోకి వదిలేస్తున్నారు. ప్రస్తుత నీటి సంవత్సరంలో అంటే జూన్ 1 నుంచి ఇప్పటివరకూ ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 149.03 టీఎంసీలు సముద్రంలో కలిస్తే.. గతేడాది ఇదే సమయానికి 77.79 టీఎంసీలు సముద్రంలో కలవడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఆదివారం కూడా ప్రాణహిత, ఇంద్రావతి, శబరి పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవడం.. ఇప్పటికే ఎగువ నుంచి భారీ వరద వస్తుండటంతో సోమవారం పేరూరు–ధవళేశ్వరం మధ్య గోదావరి వరద ఉధృతి మరింత పెరుగుతుందని సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) అంచనా వేసింది. దీంతో సోమవారం ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి చేరే వరద పది లక్షల క్యూసెక్కులను దాటే అవకాశముందని పేర్కొంది. దీన్నిబట్టి చూస్తే.. సోమవారం ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేయనున్నారు.

ఇళ్లలోకి వరదనీరు..

మరోవైపు.. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులోని టోల్‌గేట్ సెంటర్‌తో పాటు సంతపాకలు, శబరిఒడ్డు ప్రాంతాల్లోని ఇళ్లలోకి క్రమక్రమంగా వరదనీరు ప్రవేశిస్తోంది. చింతూరు మెయిన్‌రోడ్ సెంటర్ నుండి శబరి ఒడ్డుకు వెళ్లే రహదారిపై వరదనీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడున్న వివిధ వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్య.. చింతూరు మండలంలోని సుమారు 25 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు వంతెన వద్ద ఆదివారం రాత్రికి శబరినది నీటిమట్టం 40 అడుగులకు చేరుకుంది. కుయిగూరు వాగు ఉధృతితో కల్లేరు వద్ద రహదారి కోతకు గురైంది. దీంతో ఏపీ నుండి ఒడిశాకు రాకపోకలు రెండోరోజూ కూడా కొనసాగలేదు. అలాగే, చింతూరు మండలం చట్టి వద్ద వరదనీరు విజయవాడ, జగదల్‌పూర్ జాతీయ రహదారి–30 పైకి చేరడంతో ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు కూడా రాకపోకలు స్తంభించిపోయాయి. వందలాది వాహనాలు సైతం నిలిచిపోయాయి. ఇక వీఆర్ మండలంలోని గోదవరి, శబరి ఉభయ నదుల పరివాహక గ్రామాల ప్రజలు వరదతో భయాందోళనకు గురవుతున్నారు. వడ్డిగూడెంతోపాటు మరికొన్ని చోట్ల కూడా గ్రామస్తులు ఇళ్లను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు వెళ్తున్నారు.

జలదిగ్బంధంలో 'వేలేరుపాడు'

- 30 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్..
- మూడ్రోజులుగా అంధకారంలో పల్లెలు

పొంగిపొర్లుతున్న వాగులు.. ఉగ్రరూపం దాల్చిన గోదావరి, శబరి నదులతో ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని 30 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ప్రజలు వణికిపోతున్నారు. వేలేరుపాడు మండలానికి దిగువనున్న మేళ్ల వాగు, ఎద్దుల వాగు, టేకూరు వాగుల వంతెనలు నీట మునగడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. నార్లవరం, కన్నాయగుట్ట, జీలుగు చెరువు వద్ద రహదారంతా కూడా నీట మునిగింది. ఇక వేలేరుపాడు నుంచి రుద్రమకోట, తాట్కూర్ గొమ్ము, రేపాక గొమ్ము వెళ్లే రహదారులూ నీట మునిగాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. భారీ వర్షాలతో 30 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. మూడ్రోజులుగా విద్యుత్ సరఫరాలేక ఆయా గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22,Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943